PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 345 | విజయవాడ, బుధవారం 16 జులై 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Wednesday16 July 2025 | Rs

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె

- పలుచోట్ల ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు
- కొనసాగిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నిరసనలు

2



శ్రీ చరణికి 6వ ర్యాంక్

- ఐసిసి మహిళల టి20 ర్యాంకింగ్స్ విడుదల

8



భువికి చేరుకున్న తర్వాత అభివాదం చేస్తున్న శుభాంశు బృందం

'శుభా'గమనం

యాక్సియం-4 మిషన్ విజయవంతం
శుభాంశు శుక్లా బృందం తిరిగిరావడంతో సంబరాలు

న్యూఢిల్లీ : అంతరిక్షయాత్ర ముగించుకొని భారత వ్యోమగామి శుభాంశు శుక్లా బృందం సురక్షితంగా భూమికి చేరుకుంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో 18 రోజులు గడిపి, మానవాళికి ప్రయోజనం కలిగించే అనేక ప్రయోగాలను విజయ వంతంగా నిర్వహించిన ఈ బృందం.. మంగళవారం మధ్యాహ్నం 3:01కి కాలిఫోర్నియా సముద్ర తీరంలో దిగింది. భూమికి తిరిగి రావడం సంతోషంగా ఉందని యాక్సియం-4 కమాండర్ పెగ్గీ విట్సన్ పేర్కొన్నారు. దీంతో యాక్సియం-4 మిషన్ ప్రయోగం విజయవంతమైంది. శుభాంశు శుక్లా బృందం సురక్షితంగా భువికి తిరిగి రావడంతో వారి కుటుంబ సభ్యులతో పాటు శుభాంశు స్వస్థలం లక్నోలోనూ సంబ రాలు మిన్నం టాయి. కేక్ కట్ చేసి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

కోట్లాది మందికి స్ఫూర్తి : ప్రధాని మోడీ

శుభాంశు శుక్లా బృందం భూమికి సురక్షితంగా చేరుకోవడంపై ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. ఐఎస్ఎస్‌ను సందర్శించిన తొలి భారతీయ వ్యోమగామిగా చరిత్ర సృష్టించిన శుభాంశు.. పట్టుదల, అంకిత భావం, సాహస చర్యల ద్వారా కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలిచారని ఎక్స్ వేదికగా కొనియాడారు. ఇది మన సొంత మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్ యాన్‌కు దిక్సూచిగా నిలుస్తుందన్నారు. ఐఎస్ఎస్‌లో పలు పరిశోధనలు చేపట్టిన యాక్సియం-4 మిషన్ బృందం.. స్పేస్ఎక్స్‌కు చెందిన క్రూ డ్రాగన్ గ్రేస్ వ్యోమ నౌకలో సోమవారం బయలుదేరింది. శుభాంశు శుక్లాతో పాటు పెగ్గీ విట్సన్, స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నియేస్కీ, టిబర్ కపులు ఈ బృందంలో ఉన్న సంగతి తెలిసిందే.

కర్ణాటక ఏరోస్పేస్ పార్కు

భూ సేకరణ రద్దు

రైతుల డిమాండ్లకు తలొగ్గిన సర్కార్ ● ఫలించిన మూడేళ్ల పోరాటం ● అన్నదాతలకు ఎఐకెఎస్ అభినందనలు



కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో రైతు సంఘాల నాయకులు

బెంగళూరు : మూడేళ్ళకు పైగా అకుంఠిత దీక్షతో, కృత నిశ్చయంతో రైతులు సాగించిన మహోద్యమంతో కర్ణాటక ప్రభుత్వం దిగొచ్చింది. ఎన్ని బెదిరింపులు, అణచివేత చర్యలు చేపట్టినా వాటికి వెరవకుండా రైతులు కొనసాగించిన తీవ్ర వ్యతిరేకత, నిరసనల కారణంగా ఏరోస్పేస్ పార్క్ కోసం చేపట్టదలచిన వేలాది ఎకరాల భూ సేకరణ ప్రక్రియను ఉపసంహరించుకుంది. దేవనహళ్లి తాలుకాలోని 13 గ్రామాల్లో 1777 ఎకరాల భూమిని ఏరోస్పేస్ పార్కు నిర్మాణం కోసం సేకరించాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టింది. అయితే రైతులు ఈ ప్రతిపాదనను తీవ్రంగా ప్రతి ఘటించారు. తక్షణమే భూ సేకరణను నిలిపివేయాలంటూ రైతులు ప్రారంభించిన నిరసలు మంగళవారానికి 1198వ రోజుకు చేరాయి. ఈ పరిస్థితుల్లో రైతుల డిమాండ్‌కు తలొగ్గుతున్నట్లు ముఖ్యమంత్రి సిద్ధరాయమ్య ప్రకటించారు. బెంగళూరులో రైతు ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. అయితే ఈ ప్రాజెక్టు కోసం ఎవరైతే స్వచ్ఛందంగా తమ భూమిని ఇవ్వాలనకుంటున్నారో అటువంటి రైతుల నుండి భూమిని ప్రభుత్వం సేకరిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. అధిక ధరలకు ఆ భూమిని కొనుగోలు చేయడమే కాకుండా, ఆ రైతులకు అభివృద్ధిపరిచిన భూమిలో కొంత భాగాన్ని ఇవ్వడం వంటి చర్యలు కూడా చేపడతామని ప్రకటించారు. ఈ ప్రతిపాదిత పార్కులో కొత్తగా ఫ్యాక్టరీలు పెట్టాలనుకునే పారిశ్రామికవేత్తలు ఇక్కడ అవకాశం లేకపోతే పొరుగు రాష్ట్రాలకు వెళ్ళిపోయే అవకాశం వుందని అన్నారు. అయినప్పటికీ, తమ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోరాదని గట్టిగా పట్టుబడుతున్న రైతుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని ఇక ఈ భూ సేకరణ ప్రక్రియను పూర్తిగా నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. తమ డిమాండ్ సాధన కోసం దేవనహళ్లి తాలుకా రైతులు చన్నరాయపట్నాలో గత 1198 రోజులుగా నిరసనలు కొనసాగిస్తున్నారు. తమ మిగతా 7లో

స్మార్ట్ మీటర్లతో విపరీత భారాలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- విశాఖలో దీపం బుడ్లు, లాంతర్లతో నిరసన



2



కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు జ్ఞాపిక అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆర్థిక కొరత తీవ్రం

- రాష్ట్రానికి మరింత సహకారమివ్వండి
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సిఎం చంద్రబాబు భేటీ
- 'బనకచర్ల'కు అనుమతులివ్వాలని వినతి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆర్థిక వనరుల పరంగా ఆంధ్రప్రదేశ్ తీవ్ర కొరతతో ఇబ్బందులు పడుతోందని, ఈ నేపథ్యంలో మరింత సహకారం అందివ్వాలని కేంద్ర ప్రభుత్వానికి సిఎం చంద్రబాబునాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళ వారం నాడిక్కడ కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులు, మిగతా 7లో

బనకచర్లపై చర్చకు నో

- సిఎంల సమావేశ అజెండా సవరించండి
- కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వ లేఖ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ ఈ నెల 16న ఢిల్లీలో ఏర్పాటు చేసిన సమావేశంలో బనకచర్లను అజెండాగా చేర్చడంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బనకచర్లపై చర్చించాల్సిన అవసరం లేనేలేదని, వెంటనే అజెండాను సవరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాలతో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం కేంద్ర జలశక్తి కార్యదర్శికి లేఖ రాశారు. గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై ఉన్న అభ్యంతరాలను ప్రభుత్వం ఈ లేఖలో ప్రస్తావించింది. ఢిల్లీలో బుధవారం జరిగే సమావేశంలో బనకచర్లపై చర్చించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సింగిల్ అజెండాను కేంద్రానికి పంపించింది. దీనిపై స్పందించిన తెలంగాణ ప్రభుత్వం... కేంద్రానికి లేఖ రాసింది. ఇప్పటికే కృష్ణా నదిపై పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, గతంలో కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, డిండి ప్రాజెక్టులను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించడం, తుమ్మడిహెట్టి వద్ద నిర్మించిన ప్రాణహిత ప్రాజెక్టుకు 80 టిఎంసిల నీటి కేటాయింపుతోపాటు ఎఐబిపి సాయం, ఇచ్చంపల్లి వద్ద 200 టిఎంసిల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మాణం తదితర అంశాలతో తెలంగాణ ప్రభుత్వం అజెండా ప్రతిపాదనలను పంపించింది. 'బనకచర్లపై జిఆర్ఎంబి, సిడబ్ల్యుసి తీవ్ర అభ్యంతరాలు తెలిపాయి. ఇప్పటి వరకు బనకచర్లకు ఎలాంటి అనుమతులూ లేవు. చట్టాలను, ట్రిబ్యునల్ తీర్పులను ఉల్లంఘించే బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేదు' అని ఈ లేఖలో పేర్కొంది. ఇలాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తాయని అందులో ప్రస్తావించింది. ఇప్పటికే ఎపి ప్రభుత్వం సమర్పించిన ప్రీ-ఫీజిబిలిటీ రిపోర్ట్‌ను కేంద్ర పర్యావరణ శాఖ పరిధిలోని ఇఎసి తిరస్కరించిన విషయాన్ని ఈ లేఖలో ఉటంకించింది. ప్రీ ఫిజిబులిటీ రిపోర్టును తిరస్కరించాలని కేంద్ర జల సంఘానికి సిఎస్ విజ్ఞప్తి చేశారు. డిపిఆర్ సమర్పించకుండా, టెండర్లు పిలవకుండా ఆంధ్రప్రదేశ్‌ని అడ్డుకోవాలని కోరారు. రెండు రాష్ట్రాల సిఎంల సమావేశంలో గోదావరి-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై చర్చను వాయిదా వేయాలని, తెలంగాణ ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనలను అజెండాలో చేర్చాలని కేంద్రానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

డోలాయమానంలో అమరావతి భూ సమీకరణ

2

జగన్‌ను కలిసిన కరేడు రైతులు

3

కొండే జీవనాధారం..

- అదాని కంపెనీకి భూములివ్వం
- ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులను అడ్డగించిన మారిక గిరిజనులు

3

పౌరసత్వంతో ముడిపెట్టొద్దు

- సుప్రీం మార్గదర్శకాలతోనే ఓటర్ల జాబితా సవరణలు
- కేంద్ర ఎన్నికల సంఘానికి టిడిపి వినతి
- సిఇసి, ఇసిలతో నేతల భేటీ

5



నేటి నుంచి ఎపి ఐసెట్ వెబ్ ఆప్షన్ల ఎంట్రీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపిఐసెట్ మొదటి విడత కన్వీనరు కోటాలో వెబ్ ఆప్షన్ల ఎంట్రీ చేసుకునేందుకు ఈ నెల 16 నుంచి 21 వరకు అవకాశం కల్పిస్తున్నట్లు ఎపి ఐసెట్ కన్వీనరు శశి తెలిపారు. ఈ మేరకు షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. వెబ్ ఆప్షన్లు మార్చుకునేందుకు ఈ నెల 22న, సీటు కేటాయింపులు ఈ నెల 25న, కాలేజీలో సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు 26 నుంచి 28 వరకు, తరగతులు ఈ నెల 28న ప్రారంభమవుతాయని తెలిపారు.

జిన్‌పింగ్‌తో జై శంకర్ భేటీ

5



నిమిష ప్రియ మరణశిక్ష అమలు వాయిదా

5

ఇంటర్ విద్యార్థినిపై హత్యాచారం?

ముళ్లపొదల్లో వివస్త్రగా మృతదేహం
పోలీసుల అదుపులో నిందితుడు?

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్, కడప

ప్రముఖ పర్యాటక ప్రాంతం గండికోటలో దారుణం జరిగింది. ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమె హత్యాచారానికి గురైనట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సంఘటన మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... ప్రొద్దుటూరులోని సార్వకట్ట వీధికి చెందిన ఓ బాలిక (17) అదే పట్టణంలోని ఒక కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఆమె సోమవారం ఉదయం యథావిధిగా కళాశాలకు వెళ్లింది. గండికోట వెళుతున్నానని, కళాశాల వదిలే సమయానికి వస్తానని తోటి విద్యార్థినులతో చెప్పి లోకేష్ అనే యువకుడి బైక్‌పై వెళ్లింది. వారు గండికోటకు వెళ్లినట్లు టోల్ ప్లాజా వద్ద సీసీ టీవి పుటేజీల్లో దృశ్యాలు కన్పించాయి. తిరుగు ప్రయాణంలో బైక్‌పై లోకేష్ ఒక్కడే వెళ్లినట్లు ఈ పుటేజీల్లో ఉంది. రాత్రి అయినా కళాశాల నుంచి తమ కుమార్తె ఇంటికి రాకపోవడంతో ప్రొద్దుటూరులోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి బాలిక కోసం వెతకడం ప్రారంభించారు. సీసీ టీవి పుటేజీలను తనిఖీ చేశారు. గండికోటలోని రంగనాథ స్వామి దేవాలయం వెనుక ముళ్లపొదల్లో ఓ బాలిక మృతదేహం వివస్త్రగా పడి ఉన్నట్లు మంగళవారం ఉదయం పోలీసులకు సమాచారం వచ్చింది. వారు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు ఇది తమ కుమార్తె మృతదేహంగా గుర్తించి కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిగతా 7లో



అనుమానితుడు లోకేష్



మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

గ్రామాల విలీనం లేకుండానే త్వరలో మున్సిపల్ ఎన్నికలు

- మంత్రి నారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రామాల విలీన సమస్యల కారణంగా నిలిచిపోయిన 21 మున్సిపాలిటీలకు ఆ గ్రామాల విలీనం లేకుండానే త్వరలోనే ఎన్నికలు నిర్వహించాలని ముఖ్య మంత్రి చంద్రబాబు ఆదేశించారని మంత్రి పొంగులేటి నారాయణ తెలిపారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావుతో కలిసి పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణంలోని 19వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. వీలైనంత వరకూ గ్రామాల విలీనంపై కోర్టు కేసులను పరిష్కరించడం, లేనిపక్షంలో విలీన గ్రామాలు లేకుండానే ఆయా మున్సిపాల్టీలకు రెండు, మూడు నెలల్లోనే ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

మంత్రికి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వినతి

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తాడేపల్లిగూడెం మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలని సిఎం చంద్రబాబు చెప్పారని, త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయని హామీ ఇచ్చారని జెపిసి నేత ఎం.సతీష్ తెలిపారు.

అమరావతిలో ఎక్యూసిసి ఏర్పాటు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నగరంలో అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ (ఎక్యూసిసి) పేరుతో కంపెనీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి ఐటిశాఖ కార్యదర్శి ఛైర్మన్‌గా ఉండనున్నారు. అలాగే ఐటిశాఖ స్పెషల్ సెక్రటరీ, ఫైనాన్స్, ఐఅండ్ఐ, అగ్రికల్చర్, ఎనర్జీ, హెల్త్, స్కిల్ డెవలప్‌మెంట్, ఆర్‌టిజిఎస్ కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు.

ఎంపి మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్‌కు నిరాకరణ

ప్రజాశక్తి-అమరావతి

మద్యం విధానంలో అక్రమాలు జరిగాయనే కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఎంపి పివి మిథున్‌రెడ్డికి హైకోర్టులో చుక్కెదురైంది. పిటిషనర్ పాత్ర ఉందనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వడం లేదని స్పష్టం చేసింది. దర్యాప్తు సంస్థ సమర్పించిన ఆధారాలను పరిశీలించాక మిథున్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు తీర్పు చెప్పారు. మద్యం సిండికేట్ కోసం రూ.3,500 కోట్లను లంచాల రూపంలో వసూలు చేసినట్లు ఆరోపణలపై దర్యాప్తు జరగాల్సి వుందన్నారు. సిఆర్‌పిసి సెక్షన్ 438 కింద ఉన్న అధికారాలను ఈ కేసులో ఉపయోగించి ముందస్తు బెయిల్ ఇవ్వలేమన్నారు.

పట్టణాభివృద్ధిశాఖలో డిప్యుటేషన్ విధివిధానాలు విడుదల

- నాలుగు శాఖల నుండి తీసుకోవాలని నిర్ణయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పంచాయతీరాజ్, రెవెన్యూ, ఆడిట్, సెక్రటేరియట్ విభాగాల సిబ్బందిని పట్టణాభివృద్ధిశాఖలోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. పట్టణాభివృద్ధిపై అవగాహన లేని శాఖల నుండి అధికారులను నియమించడం వల్ల నిర్వహణ లోపాలు తలెత్తాయని అందులో పేర్కొన్నారు. ఇటీవల పట్టణాభివృద్ధిశాఖ అధికారులు మంత్రి నారాయణను కలిసి తమ అభ్యంతరాలు తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులను తీసుకునే విషయంలో విధివిధానాలు రూపొందించాలని పట్టణాభివృద్ధిశాఖ అధికారులకు మంత్రి సూచించారు. దీన్ని పరిశీలించిన అధికారులు పంచాయతీరాజ్‌శాఖలోని ఎంపిడిఓ, డిఎల్‌డిఓ, డిప్యూటీ సిఇఓ, జిల్లా పరిషత్ సిఇఓలు, రెవెన్యూ విభాగంలో తహశీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు, ఆడిట్ విభాగంలో అసిస్టెంట్, జిల్లా ఆడిట్ అధికారులు, సెక్రటేరియట్ విభాగంలో సెక్షన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సెక్రటరీలను తీసుకోవాలని నిర్ణయించారు. డిప్యుటేషన్‌పై వచ్చే అధికారులు మాతృశాఖలో కనీసం ఐదేళ్ల సర్వీసు ఉండాలని, ప్రొబేషన్ పూర్తి చేయాలని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుండి కనీసం డిగ్రీ పొంది ఉండాలని పేర్కొన్నారు. ఎపిపిఎస్‌సి నిర్వహించిన ఎకౌంట్స్ టెస్టును పూర్తి చేయాలని తెలిపారు. వారి మాతృ సంస్థలో విజిలెన్స్ క్లియరెన్స్ కూడా ఉండాలని పేర్కొన్నారు. అలాగే ఎంపిక చేసిన అధికారులు 30 రోజులుపాటు వివిధ శాఖల్లో శిక్షణ పొందాలని పేర్కొన్నారు. ఇలా తీసుకునే సిబ్బంది కూడా పదిశాతానికి మించకూడదని తెలిపింది.

స్మార్ట్ మీటర్లతో విపరీత భారాలు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- విశాఖలో దీపం బుడ్లు, లాంతర్లతో వినూత్న నిరసన



విశాఖలో దీపం బుడ్లు, లాంతర్లతో నిరసన తెలుపుతున్న వి.శ్రీనివాసరావు, లోకనాథం, జగ్గునాయుడు తదితరులు

ప్రజాశక్తి - యంత్రాంగం

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై విపరీత భారాలు పడనున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. తక్షణమే ఆ మీటర్ల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు, భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో పలుచోట్ల నిరసనలు తెలిపారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే అనర్థాలు, భారాలను వివరిస్తూ.. కరపత్రాలు పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. విశాఖ నగరంలోని సింగ్ హోటల్ జంక్షన్ వద్ద దీపం బుడ్లు, లాంతర్లతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడిపి కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఉల్లంఘించాయన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇంటింటా బిగించేందుకు ప్రభుత్వం సిద్ధపడిందని తెలిపారు. నాడు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడిన నారా లోకేష్.. అధికారంలోకి వచ్చిన తర్వాత అవే స్మార్ట్ మీటర్లను బిగించేందుకు సిద్ధపడ్డారని తెలిపారు. అదాని కంపెనీకి లాభం చేకూర్చడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారన్నారు. అదాని రూపొందించిన స్మార్ట్ మీటర్ల వల్ల బిల్లులు భారీగా పెరుగుతున్నాయని, దీన్ని అన్ని రాష్ట్రాలూ వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. చుట్టుపక్కల ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో మీటర్లు మార్చబోమని, ఉన్నవాటిని కొనసాగిస్తామని తేల్చి చెప్పారని, మన ప్రభుత్వం మాత్రం స్మార్ట్ మీటర్లను బిగించడానికి సిద్ధపడిందన్నారు. ప్రజలపై కోట్ల రూపాయల భారం పడేటువంటి స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, పాత మీటర్లనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రీపెయిడ్ మీటర్లతో కూడా దోచుకునే అవకాశం ఉందన్నారు. వాటినీ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్ ఛార్జీలతో ఇప్పటికే ఆరు నుండి ఏడు వేల కోట్ల రూపాయలు అదనంగా వసూలు చేశారని, ఈ ఏడాది విశాఖలోని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు రూ.1200 కోట్లు మిగులు ఉన్నా యూనిట్‌కు రూ.40 పైసలు చొప్పున వసూలు చేసి ప్రజలపై రూ.2700 కోట్ల భారం మోపారని తెలిపారు. అసలు ఇంత భారం ఎందుకు వేశారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలియజేస్తోందని, దీనిని ప్రజలంతా బలపరిచి స్మార్ట్ మీటర్లు వద్దని తిరస్కరించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని చర్చిపేటలో మహిళలు నిరసన తెలిపారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలంలో సైకిల్ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆచంట కచేరి సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. స్మార్ట్ మీటర్లతో వ్యవసాయ కనెక్షన్లకు భారీగా బిల్లులు రావడాన్ని నిరసిస్తూ అనకాపల్లి జిల్లా మునగపాక మండలం వెంకటాపురం సబ్‌స్టేషన్ వద్ద ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. బుచ్చయ్యపేట మండల కేంద్రంలో స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. విజయవాడ సింగ్‌నగర్‌లో ధర్నా చేపట్టారు.

డోలాయమానంలో అమరావతి భూ సమీకరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి రాజధానిలో అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి కంపెనీల ఏర్పాటు కోసం రెండోదశ భూసమీకరణ చేపట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇప్పుడే సమీకరించాలా? లేదా కొంత కాలం వేచి ఉండాలా అనే ఆలోచనలో పడ్డట్లు తెలిసింది. 20, 496 ఎకరాలు సమీకరణ కింద తీసుకోవాలని ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సిఆర్‌డిఎ అథారిటీ సమావేశంలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. దానిపై క్యాబినెట్లోనూ చర్చ జరిగింది. ఆమోదించిన సమయంలో ఎప్పుడు నోటిఫికేషన్ ఇవ్వాలనే అంశం నిర్ణయించలేదు. దీంతో పూలింగు ప్రక్రియను ప్రారంభించలేదు. ఇప్పటికే . పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అందరి కంటే ముందుగా అమరావతి మండల పరిధిలోని గ్రామాల్లో సమీకరణ ప్రక్రియపై రైతులతో సమావేశాలు నిర్వహించారు. అప్పట్లో రైతుల్లో పెద్దగా అవగాహన లేకపోవడంతో ఎమ్మెల్యే చెప్పారనే పేరుతో తలూపారు. ఈలోపు వారందరూ గత పూలింగు ఏరియాలో ఉన్న పరిస్థితులపై అధ్యయనం చేశారు. అనంతరం పూలింగ్‌కు భూములు ఇవ్వకూడదనే నిర్ణయానికి వచ్చారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి చేరడంతోపాటు గతంలో సమీకరణకు ఇచ్చిన ప్రాంతంలో ప్లాట్లనే అభివృద్ధి చేయలేదనే అంశంపై పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అథారిటీ ఆమోదం పొందినప్పటికీ ప్రభుత్వం ముందడుగు వేయడం లేదు. అయితే రైతుల్లో ఉన్న వ్యతిరేకతను చల్లబరిచే ప్రక్రియను వేగవంతం చేశారు. భూమి లేని పేదలకు ఇస్తున్న పెన్షన్ల సంఖ్యను పెంచారు. రైతులకు ఇవ్వాల్సిన కౌలు(యాన్యుటీ)ను ఒకటీ రెండు రోజుల్లో చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నామని గ్రామాల్లో ప్రచారం చేశారు. అలాగే మెడికల్ క్యాంపులు, ఇతరత్రా కార్యక్రమాలూ చేపట్టారు. భూ సమీకరణ ప్రక్రియ చేపడుతున్నారా లేదా అనే అంశంపై సామాజిక మాధ్యమాల్లో వేర్వేరు రూపాల్లో ప్రచారం చేస్తున్నారు. దీనిపై పట్టణాభివృద్ధిశాఖలో ఉన్నతాధికారి ఒకరిని సంప్రదించగా అథారిటీ నిర్ణయించిందని, ప్రభుత్వానికి వీలైనప్పుడు చేపడుతుందని తెలిపారు. నిర్దిష్ట కాలపరిమితి ఏమీ నిర్ధారించనందున ప్రభుత్వానికి వీలైన సమయంలో నిర్ణయం అమలు చేస్తుందని వివరించారు. సమీకరణ నిలిపేశారనే వార్తలు వస్తున్నాయని ప్రశ్నించగా పూలింగు నోటిఫికేషన్ విడుదల చేయకుండా నిలిపేయడం అనే ప్రశ్నే ఉత్పన్నం కాదని చెప్పారు.



రైతులతో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

కరేడు ప్రజల జీవనోపాధి దెబ్బతీయొద్దు

మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి- ఉలవపాడు, నెల్లూరు ప్రతినిధి

కరేడు ప్రజల జీవనోపాధిని దెబ్బతీస్తూ ఇండోసోల్‌కు భూములను కట్టబెట్టటం దుర్మార్గమని రాష్ట్ర మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి అన్నారు. కరేడు ప్రాంతంలో మహిళా సంఘాల ఐక్యవేదిక నాయకులు మంగళవారం పర్యటించారు. రైతులు, ప్రజలతో మాట్లాడి పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రమాదేవి మాట్లాడుతూ.... ఎనిమిది వేల ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించి ఇండోసోల్‌కు కట్టబెట్టేందుకు జిఓ నంబర్ 43 తీసుకువచ్చారని, రైతుల అనుమతి లేకుండా ఈ ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. కాకినాడ ఎస్‌సిజెడ్‌లో సేకరించిన పది వేల ఎకరాల భూములు నిరుపయోగంగా ఉన్నాయని, అక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. షిరిడీసాయి కంపెనీ జగన్ బినామి అని గతంలో టిడిపి నాయకులు విమర్శించారని, ఇప్పుడు ఇండోసోల్ కంపెనీకి మీరు బినామీలయ్యారా? అని ప్రశ్నించారు. రైతుల అనుమతి లేకుండా భూములు, ఇళ్లు తీసుకునే హక్కు లేదన్నారు. కార్యక్రమంలో అఖిల భారత మహిళా సమాఖ్య జాతీయ నాయకులు వనజాక్షి, రాష్ట్ర కార్యదర్శి దుర్గ భవాని, ఐద్వా సహాయ కార్యదర్శి సిహెచ్ రమణి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు పద్మశ్రీ, పిఓడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరసన దీక్ష

కరేడు భూసేకరణకు వ్యతిరేకంగా జారీ చేసిన జిఓ 43ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నెల్లూరులోని విఆర్‌సి సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. దీనికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్ మద్దతు తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు భూములను కట్టబెడుతూ గిరిజనుల, రైతుల పొట్టకొట్టొద్దని ప్రభుత్వానికి హితవు పలికారు. కరేడు రైతులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు నారపురెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె

- పలుచోట్ల ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు
- కొనసాగిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నిరసనలు



అనంతపురంలో ఎమ్మెల్యే దగ్గుపాటికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - యంత్రాంగం

రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా, జిఓ నంబర్ 36 ప్రకారం వేతనాలు అమలు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని కార్మికులు హెచ్చరించారు. ఇందులో భాగంగా ప్రజాప్రతినిధులకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. అనంతపురంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే ఇంటి వరకూ కార్మికులు ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు గోపాల్, సిఐటియు నగర అధ్యక్షులు వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జిఓ 36 ప్రకారం పారిశుద్ధ కార్మికులకు ఇస్తున్న తరహాలో రూ.21 వేలు, రూ.24,500 జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ అమలు చేయాలని, చనిపోయిన వారి స్థానాల్లో ఉద్యోగాలు కల్పించాలని, సర్వీసు 62 ఏళ్లకు పెంచాలని కోరారు. ఎమ్మెల్యే దగ్గుపాటి స్పందిస్తూ.. మీ సమస్యలను మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తాడిపత్రిలో వంటావార్పు, రాయదుర్గంలో ఒంటికాలిపై నిలబడి అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ నిరసన తెలిపారు. కర్నూలులో స్థానిక పద్మావతి నగర్ ఆర్చ్ నుంచి రాజ్ థియేటర్ వరకూ ర్యాలీ చేశారు. మంత్రి ఫరూక్ క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మంత్రి అందుబాటులో లేకపోవడంతో ఆయన కుమారుడు, టిడిపి నాయకులు ఫయాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆత్మకూరులో కళ్లకు నల్ల రిబ్బను కట్టుకొని నిరసన తెలిపారు. బేతంచెర్లలో సిఐటియు కార్యాయలం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఏలూరు జిల్లా నూజివీడులో పురపాలక సంఘ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మెనుద్దేశించి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు గత ఏడు సంవత్సరాల నుంచి జీతాలు పెంచకపోవడం చాలా దారుణమని, పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

తిరుపతి జిల్లా నాయుడుపేట, గూడూరులో నిరసన తెలిపారు. వేతనాలు పెంచే వరకూ పోరాటం కొనసాగిస్తామని కార్మికులు హెచ్చరించారు. సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి.చెంగయ్య మాట్లాడారు. 16 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు సమ్మెలోకి వెళ్తారని చెప్పారు. విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. విజయవాడ ధర్నా చౌక్‌లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొని మాట్లాడారు. తిరువూరులో నగర పంచాయతీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకూ నిరసన ప్రదర్శన, నందిగామలో వంటావార్పు చేపట్టారు. ఇబ్రహీంపట్నంలో చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. హెచ్‌పిసిఎల్ ఆయిల్ టెర్మినల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు సమ్మెకు సంఘీభావం తెలిపారు.

విత్తనాలు, ఎరువుల షాపుల తనిఖీ

- రూ.10.33 కోట్ల విలువైన సరుకు అమ్మకాలు నిలిపివేత
- రూ.5.38 కోట్ల ఎరువులు సీజ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై వ్యవసాయశాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సంయుక్తంగా 30 బృందాలుగా ఏర్పడి 219 దుకాణాలను తనిఖీ చేశారు. ఈ మేరకు వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం వివరాలను వెల్లడించారు. 41 మెట్రిక్ టన్నుల మేర రూ.5.38 కోట్ల విలువైన ఎరువులను సీజ్ చేసినట్లు తెలిపారు. అమ్మకాలు నిలిపివేసిన సరుకు విలువ రూ.10.33 కోట్లుగా ఉందని పేర్కొన్నారు. విత్తనాల షాపులు 45 తనిఖీ చేయగా, 75 క్వింటాళ్ల విత్తనాలను అమ్మకం నిలిపివేశారు. వీటి విలువ రూ.61 లక్షలుగా పేర్కొన్నారు. 2 దుకాణాల లైసెన్సులు రద్దు చేసినట్లు, 16 నమూనాలు సేకరించి పరీక్షలకు పంపినట్లు తెలిపారు. 99 ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించగా, 2,225 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకం నిలిపివేశామని, వీటి విలువ రూ.6.38 కోట్లు ఉంటుందన్నారు. సీజ్ చేసిన ఎరువులు 40.93 మెట్రిక్ టన్నులని, వీటి విలువ రూ.5.38 కోట్లుగా పేర్కొన్నారు. ఒక షాపు లైసెన్స్ రద్దు చేయగా, మరో షాపు లైసెన్స్ సస్పెండ్ చేసినట్లు, 16 రకాల ఎరువుల నమూనాలను పరీక్షలకు పంపినట్లు వెల్లడించారు. అదే విధంగా 75 పురుగుమందుల షాపులను తనిఖీ చేయగా, 24,317 లీటర్ల పరిమాణంలో పురుగుమందులను అమ్మకం నిలిపివేసినట్లు, వీటి విలువ రూ.3.35 కోట్లుగా ఉందని పేర్కొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తాత హత్య : మనవడి ఘాతుకం

ప్రజాశక్తి - బనగానపల్లె

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని తాతను మనవడు హత్య చేసిన ఘటన నంద్యాల జిల్లా బనగానపల్లె పట్టణం బిసి రాజారెడ్డి కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కాలనీకి చెందిన చెందిన షేక్ హుస్సేన్ షా(75) మనవడు షేక్ హుస్సేన్ బాష అలియాస్ మున్నా మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి డబ్బులు ఇవ్వాలని తాతను కోరగా...అందుకు ఆయన నిరాకరించడంతో బ్లేడుతో గొంతుకోశాడు. కుటుంబీకులు గమనించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ పట్ల ... రాష్ట్ర ప్రభుత్వం వివక్ష

- జిందాల్‌కు ఐరన్ ఓర్ కేటాయింపు తగదు : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రభుత్వ రంగ విశాఖ స్టీల్‌ప్లాంట్ పట్ల రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలోని రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా జిందాల్ స్టీల్‌ప్లాంట్‌కు నెల్లూరు జిల్లాలో లింగ సముద్రం పరిసర ప్రాంతాల్లో తొమ్మిది కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న ఐరన్ ఓర్‌ను కేటాయించడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకవైపు విశాఖ స్టీల్‌ప్లాంట్ సొంత గనుల్లేక అధిక ధర పెట్టి ఇనుప ఖనిజాన్ని కొనుగోలు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శించడం అన్యాయమని పేర్కొ న్నారు. విశాఖ ఉక్కు పురోగతి పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా లింగ సముద్రంతో సహా రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఇనుప గనులన్నింటినీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టిడిపి నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రావడంతోనే అనకాపల్లి జిల్లాలో అర్సెలార్ మిట్టల్‌కు అన్ని రకాల సదుపాయాలూ కల్పించి ప్రమోట్ చేసిందని గుర్తుచేశారు. నేడు జిందాల్‌కు అదే రీతిలో ప్రయోజనం కల్పిస్తూ రాష్ట్ర సహజ వనరులను గుత్తగా ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టడాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పట్ల వివక్షతను ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించి మున్సిపల్ సమ్మెను విరమింపచేయండి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జీతాల పెంపు, సంక్షేమ పథకాల అమలు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం మూడు రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు సిపిఎం రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాము అధికారంలోకి వస్తే 25 వేల రూపాయల జీతం ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలని ఈ ప్రకటనలో కోరారు. ఇంజనీరింగ్ కార్మికులు కోరుతున్న విధంగా జిఓ నెంబరు 26 ప్రకారం జీతాలు పెంచి చెల్లించాలని సూచించారు. ఇంజనీరింగ్ కార్మికుల నైపుణ్యానికి అనుగుణంగా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని, నిత్యావసర సరుకుల ధరలు కరెంటు ఛార్జీలు తదితర భారాలు మోయలేక కుటుంబాలు అర్ధాకలితో గడుపుతున్నాయని తెలిపారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తల్లికి వందనం పథకం అమలు కోసం జారీచేసిన 26వ నెంబరు జిఓలో ఆదాయ పరిమితిని రూ.25 వేలకు పెంచకుండా, ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయకుండా పారిశుధ్య కార్మికులను, నిరుద్యోగులను మోసం చేశారని పేర్కొన్నారు. గత సంవత్సరం మున్సిపల్ కార్మికులు నిర్వహించిన 17 రోజుల పోరాటం సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో కార్మికులు తీవ్ర అసంతృప్తికి గురయ్యారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని, ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధపెట్టి మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వచ్చే నాలుగేళ్లలో 10 లక్షల ఉద్యోగాలు

- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రానున్న నాలుగేళ్లలో ఐటి, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జిసిసి) నుంచి 10 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అధికాయంత్రాంగం పని చేయాలని విద్యా, ఐటి అండ్ ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఐటి, ఎలక్ట్రానిక్స్, ఆర్టిజిఎస్ శాఖల ఉన్నతాధికారులతో ఉండవల్లి నివాసంలో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐటి, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, డేటా సంటర్ల ఏర్పాటుకు ఇప్పటి వరకూ 95 ప్రముఖ సంస్థలు రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని, ఆ సంస్థలు త్వరితగతిన తమ యూనిట్లును ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు, సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతిష్టాత్మక సంస్థలైన టిసిఎస్, కాగ్నిజెంట్ సంస్థలకు విశాఖలో ఇప్పటికే భూములు కేటాయించామని అధికారులు ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తెచ్చారు. ఎఎన్ఎస్ఆర్, సత్య సంస్థలు జిసిసిల ఏర్పాటుకు ఎంఒయుకు కుదుర్చుకున్నాయని, ఈ రెండింటితోనే 35 వేల మందికి ఉద్యోగాలు రానున్నాయని మంత్రి చెప్పారు. ఈ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ యూనిట్లు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రానికి వచ్చే చిన్న సంస్థల కోసం అన్ని జిల్లా కేంద్రాల్లో కో-వర్కింగ్ స్పేస్ సిద్ధం చేయాలన్నారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. పౌర సేవల్లో సరికొత్త అధ్యాయాన్ని సృష్టించిన మనమిత్రా వాట్సాప్ గవర్నెన్స్ సేవలకు మరింత విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన ధృవీకరణ పత్రాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తరిగే విధానానికి చెక్ పెట్టాలని, కుల ధృవీకరణ పత్రంలో సహా అన్ని సంబంధిత సర్టిఫికెట్‌లను బ్లాక్ చైన్‌తో అనుసంధానం చేసి మనమిత్రాలో సులభంగా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఐటి అండ్ సి ప్రత్యేక కార్యదర్శి సుందర్, ఎపిఐఐసి ఎండి అభిషిక్త్ కిషోర్, ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సిఇఓ సాయికాంత్ వర్మ, ఆర్టిజిఎస్ సిఇఓ ప్రఖర్‌జైన్, ఎపిటిఎస్ ఎండి సూర్యతేజ తదితరులు పాల్గొన్నారు.

'మున్సిపల్' సమ్మెకు కెవిపిఎస్ మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. కార్మికులు చేపట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒ నల్లప్ప, అండ్ర మాల్యాద్రి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాలతో చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మిక సంఘాలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు.

'వెనిగండ్ల' ఘటనపై సమగ్ర విచారణకు డిమాండ్

కుల బహిష్కరణ పేరుతో వసూళ్లకు పాల్పడుతూ, వేధింపులకు గురి చేస్తున్న వారిపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గుంటూరు జిల్లా, పెద్ద కాకాని మండలం, వెనిగండ్ల గ్రామంలో ఎస్ ఆదెమ్మ ఇరువురు కుమారులతో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్నారని తెలిపారు. స్థానికంగా రామకృష్ణ, రాంబాబు, సింహాచలం, వెంయయ్య, చింటూ అనే వ్యక్తులు పెద్దమనుషులుగా చలామణి అవుతూ ఇతరులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. ఆదెమ్మ కుటుంబాన్ని ఐదేళ్ల కిందట కులం నుంచి బహిష్కరించారని, వారిని కుటుంబంలోకి తీసుకోవడానికి రూ.3 లక్షలు జరిమానా వసూలు చేయడం రాజ్యాంగ, చట్ట ఉల్లంఘనకు పాల్పడటమే అవుతుందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ట్రిబుల్ ఐటీ 'భోజనం' అక్షయపాత్రకు?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉన్న ట్రిబుల్ ఐటీల్లో విద్యార్థులకు అందించే భోజనాన్ని అక్షయపాత్రకు అప్పగించే ఆలోచనను ప్రభుత్వం చేస్తోంది. రాష్ట్రంలో ఉన్న నాలుగు ట్రిబుల్ ఐటీ క్యాంపస్లలోని మెస్ నిర్వహణను అక్షయపాత్ర గానీ, మరేదైనా స్వచ్ఛంద సంస్థలకు గానీ అప్పగించాలని టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఈ నెల 1న రాసిన లేఖ ఆధారంగా ఈ కసరత్తు సాగుతున్నట్లు సమాచారం. ఈ నెల 4న విద్యాశాఖమంత్రి లోకేష్ వద్ద జరిగిన సమీక్షలో ఈ విషయం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. టిడిపి నాయకులతో పాటు అధికారుల్లో కూడా ఈ ప్రతిపాదనపై తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అక్షయపాత్ర సంస్థ మాంసాహారం సరఫరా చేయదన్నది వీటిలో కీలకమైనది. ఈ సంస్థ భోజనంపై గతంలో వచ్చిన ఫిర్యాదులను కూడా పలువురు ప్రస్తావిస్తున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి, కృష్ణా జిల్లా గుడివాడ ప్రాంతాల్లో అక్షయపాత్ర, విశాఖపట్నం, తిరుపతి జిల్లాల్లో ఇస్కాన్ మధ్యాహ్న భోజన పథకం కింద అందిన విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాసిరకంగా ఉంటుందని తల్లిదండ్రులు, విద్యార్థులు అనేకసార్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేశారు. ఇటీవల మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో కూడా అక్షయపాత్ర, ఇస్కాన్ అందించే భోజనాన్ని తల్లిదండ్రులు తినలేకపోయారు. రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న అన్న క్యాంటీన్లకు కూడా అక్షయపాత్రే ఆహారాన్ని సరాఫరా చేస్తోంది. ఈ క్యాంటీన్లలో కూడా నాణ్యమైన భోజనం అందించడం లేదని వీటిపై సర్వే నిర్వహించిన ఒక సంస్థ వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం నుంచి రూ.65, లబ్ధిదారుల నుంచి రూ.5 చొప్పున రూ.70లు తీసుకుంటున్నా నాసిరకం భోజనం అందిస్తోందని ఆ సంస్థ వెల్లడించింది. అక్షయపాత్రకు అప్పగించాలన్న ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్న వారు ఈ అంశాలన్నింటినీ ప్రస్తావిస్తున్నట్లు తెలిసింది. కొంతమంది టిడిపి నేతలు కూడా ఆ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. పేద విద్యార్థులను తీవ్రంగా నష్టపరచాలన్న ఉద్దేశం ఆ ప్రతిపాదనలో స్పష్టంగా కనపడుతోందని ఈ లేఖలో పేర్కొన్నారు. అక్షయపాత్ర గుడ్డు, చికెన్ అందించరని, కూరల్లో ఉల్లిపాయను కూడా వాడరని ఈ లేఖలో వారు వివరించారు. దీనివల్ల విద్యార్థులకు ప్రోటీన్‌లు అందే అవకాశం లేదని, ముఖ్యంగా బాలికలకు ఈ మెనూ వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు.

17న ఉన్నత విద్యామండలి కార్యాలయం ఎదుట ధర్నా

- విద్యార్థి సంఘాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యులతో పాటు పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన ఈ నెల 17న ఉన్నత విద్యామండలి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆయా సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని కోరుతూ విజయవాడ బందరు రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కె ప్రసన్నకుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయికుమార్, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా.. ఇంకా డిగ్రీ కళాశాల మొదటి సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ మొదలుపెట్టలేదన్నారు. ఇంటర్ పూర్తయి డిగ్రీ చేరాలనుకునే విద్యార్థులకు నష్టం జరుగుతోందని విద్యార్థి సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ ప్రవేశాలు ఆన్‌లైన్‌లో ఉండటంతో ఎక్కువ శాతం సీట్లు ఖాళీగా ఉండిపోతున్నాయని, విద్యార్థులు చేరాలనుకునే కళాశాలల్లో జాయిన్ అయ్యే అవకాశం ఉండటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షులు పి రామ్మోహన్, సిహెచ్ వెంకటేశ్వరరావు, కుమారస్వామి, పిడిఎస్‌యు, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

పోర్టుల అభివృద్ధికి యువశక్తి కీలకం

- అంతర్జాతీయ పరిణామాలపై రెండో రోజు పేనలిస్టుల్లో ఆందోళన
- ముగిసిన బిమ్స్‌టెక్ కాన్‌క్లేవ్



చర్చల్లో పాల్గొన్న బిమ్స్‌టెక్ ప్రతినిధి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పోర్టుల రంగం భవిష్యత్తులో ముందుకు సాగాలంటే యువశక్తి అత్యంత కీలకమైనదని బిమ్స్‌టెక్ 7 దేశాల ప్రతినిధులు వెల్లడించారు. విశాఖలో రెండు రోజులపాటు తలపెట్టిన '7 కంట్రీస్ - వన్ విజన్' రెండవ బిమ్స్‌టెక్ - 2025 కాన్‌క్లేవ్ మంగళవారంతో ముగిసింది. బిమ్స్‌టెక్ (బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్) దేశాలైన బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయ్‌లాండ్ పోర్టులకు చెందిన పలువురు బిమ్స్‌టెక్ నౌకాశ్రయాల మధ్య భవిష్యత్తులో పరస్పర సహకారంపై చర్చించారు. అంతర్జాతీయ అనిశ్చితి, పోర్టుల వాణిజ్యం, దాని ప్రభావంపైనా చర్చ సాగింది. విశాఖలోని నోవాటెల్ హోటల్ వేదికగా రెండో రోజైన మంగళవారం కాన్‌క్లేవ్‌లో పోర్టుల సామర్థ్యం, క్రూయిజ్ టూరిజం అభివృద్ధి, మానవ వనరుల ప్రగతి, టెక్నాలజీ రంగాలపై సెషన్స్ నడిచాయి. పోర్టుల్లో కార్మికులకు నైపుణ్యాలను పెంపొందించడంపైనా ఈ దేశాల మధ్య చర్చ జరిగింది. పోర్టుల అభివృద్ధిలో ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యాల (పిపిపి) పాత్రపై పేనలిస్టుల మధ్య చర్చలు నడిచాయి. వాణిజ్యం, క్రూయిజ్ వాణిజ్యం రెండింటినీ పోర్టులు ముందుకు తీసుకెళ్లగలిగితేనే ఆర్థిక ప్రగతి సాధ్యపడుతుందని అభిప్రాయపడ్డారు. రెండో రోజు కాన్‌క్లేవ్‌లో థాయ్‌లాండ్ నుంచి పోర్టు అథారిటీ ఆఫ్ థాయ్‌లాండ్ ప్రతినిధి రుత్ బానోమ్ యోంగ్, న్యూఢిల్లీ (ఇండియా) నుంచి ప్రబీర్ డే, మయన్మార్ నుంచి ఎంఆర్.ఎంపా తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ అననుకూలతలపైనా చర్చ

ఐటీవల కాలంలో రష్యా - ఉక్రెయిన్ మధ్య యుద్ధం, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు, ఎర్ర సముద్రం సంక్షోభ పరిణామాలు వంటివి నౌకా వాణిజ్యంపై తీవ్ర ప్రభావం చూపాయని బిమ్స్‌టెక్‌కు చెందిన పలుదేశాల ప్రతినిధులు రెండోరోజు సదస్సులో ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో యుఎస్ - చైనా మధ్య ట్రేడ్ వార్ జరిగితే సముద్రయానంపై ప్రభావం ఎలా ఉంటుంది ?, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 2.0 పాలనా ప్రయాణంలో టారిఫ్‌తో షాక్ ఇస్తుండడంతో ప్రతినిధులు ఆందోళన చెందారు. ఇలాంటి పరిస్థితుల్లో ఫ్రెయిట్ రేట్లు విపరీతంగా పెరిగి వాణిజ్యం స్తంభించిపోయే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. బిమ్స్‌టెక్ దేశాల సరిహద్దుల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టుల అభివృద్ధి, డిజిటల్ లాజిస్టిక్స్‌పై దృష్టి సారించాల్సి ఉందన్నారు.

హిందుస్థాన్ షిప్‌యార్డును సందర్శించిన కేంద్ర మంత్రి సోనోవాల్

కేంద్ర పోర్టులు, నౌకలు, జలరవాణా శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ మంగళవారం విశాఖలోని హిందుస్తాన్ షిప్‌యార్డ్ (హెచ్ఎస్ఎల్)ను సందర్శించారు. షిప్‌యార్డులో నడుస్తున్న పనులు, వర్క్ ఆర్డర్ గురించి అడిగి తెలుసుకున్నారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) పనులపైనా మంత్రి సోనోవాల్ ఆరా తీశారు. ఆయన వెంట విశాఖపట్నం పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఉన్నారు. మారిటైం సెక్యూరిటీ మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాల అధికారుల కార్యక్రమంలో వారిరువురూ పాల్గొన్నారు. బిమ్స్‌టెక్ ముగింపు కార్యక్రమం పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్మన్ దుర్గేశ్ కుమార్ దుబే ఆధ్వర్యాన జరిగింది.



జగన్‌ను కలిసిన కరేడు రైతులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రకాశం జిల్లా కరేడుకు చెందిన పలువురు రైతులు మంగళవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. వారిని వైసిపి ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, కందుకూరు వైసిపి సమన్వయ కర్త బుర్రా మధుసూదన్ జగన్ వద్దకు తీసుకొచ్చారు. వారితో చర్చించిన అనంతరం జగన్ మాట్లాడుతూ కరేడు రైతులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారి ఉద్యమం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. ప్రకాశం జిల్లా ఉలవపాడు మండలం కరేడులో సారవంతమైన భూములను ఇండోసోల్ ప్రైవేటు లిమిటెడ్‌కు ప్రభుత్వం కేటాయించడాన్ని నిరసిస్తూ రైతులు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు మాట్లాడుతూ రాజోలో రోజుల్లో వైసిపి ప్రజల తరుపున పోరాడుతుందని అన్నారు. కందుకూరు వైసిపి ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ మాట్లాడుతూ సారవంతమైన భూములు రైతులకు చెందాలని, సాగుకు నిరుపయోగమైన భూములు ఇస్తే ఎలాంటి అభ్యంతరం లేదని జగన్ తెలిపారని వివరించారు.

మా సహనం చేతకానితనం కాదు

- మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా జిల్లా)

వైసిపి నేతలు బరితెగించి మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని, వైసిపి నేత పేర్ని నాని మాట్లాడే ముందు నోరు అదుపులో పెట్టుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. కృష్ణా జిల్లా బందరులోని టిడిపి కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. వారసత్వంగా వచ్చిన వ్యాపారాలను అవినీతి సంపాదన అని చెప్పడానికి పేర్ని నానికి సిగ్గుండాలన్నారు. తన తాత, ముత్తాతల నుండి ఉన్న ఆస్తులను చూపించి తాను అవినీతి సొమ్ము కూడబెట్టుకున్నానని చెప్పడంపై మండిపడ్డారు. తన గురించిగానీ, తన కుటుంబ సభ్యుల గురించిగానీ తేడాగా మాట్లాడితే క్షమించేదిలేదని హెచ్చరించారు. లంకెట్టి భూములకు 2016లో రిజిస్ట్రేషన్ చేయించి రూపాయికి మూడు రూపాయలు కట్టించారని, వారి నుంచి ఇప్పుడు నానా లక్షలు డిమాండ్ చేసిన పేర్ని నాని కూడా తన గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సివిల్ సప్లయి మినిస్టర్‌గా ఉన్న కొడాలి నాని అండ చూసుకొని రేషన్ బియ్యం మాయం చేసిన పేర్ని నాని అప్పుట్లో రేషన్ వాహనాల కొనుగోలులో కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. పేర్ని నాని మాట్లాడిన ప్రతి మాటకు, చేసిన ప్రతి చర్యకూ ప్రతిచర్య ఉంటుందని హెచ్చరించారు. బియ్యం దొంగలను, నకిలీ పట్టాల కేసులున్నవైపైనా చట్టబద్ధంగా విచారణ జరుగుతున్నాయని, ఎక్కడా తాము అడ్డగోలుగా వ్యవహరించలేదని తెలిపారు.

తిరుమల లడ్డూ కేసులో రాజశేఖరన్‌కు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి కేసులో అరెస్టయిన ఎఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండి) రాజశేఖరన్‌కు రాష్ట్ర హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. 'రూ.50 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలి. నెలలో ఒక రోజున ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు ఆరు నెలల పాటు దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలి. సాక్షులను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బెదిరించకూడదు. దర్యాప్తునకు సహకరించాలి. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదు' అని పేర్కొంది.

కొండే జీవనాధారం..

- అదాని కంపెనీకి భూములివ్వం
- ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన అధికారులను అడ్డగించిన మారిక గిరిజనులు



రహదారికి అడ్డంగా ముళ్లకంచెలు పెట్టి అధికారులు రాకుండా అడ్డుకున్న మారిక గిరిజనులు

ప్రజాశక్తి-వేపాడ (విజయనగరం జిల్లా)

'మారిక కొండే మాకు జీవనాధారం' అదాని కంపెనీకి ఎట్టి పరిస్థితుల్లోనూ మా భూములిచ్చేది లేదు' అని మారిక గిరిజనులు తెగేసి చెప్పారు. ఇక్కడ తప్ప వేరే చోట జీవించలేమని స్పష్టంచేశారు. రైవాడ ఓపెన్ లూప్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టుకు భూ సేకరణ కోసం విజయనగరం జిల్లా వేపాడ మండలంలోని మారిక గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభను మంగళవారం అధికారులు ఏర్పాటు చేశారు.

ప్రజాభిప్రాయ సేకరణకు మారిక కొండపైకి వస్తున్న అధికారులు, పర్యావరణ, సామాజిక నిపుణులు ఎ మాధవరెడ్డి, సామాజిక నిపుణులు పి దేవరాజు, డిప్యూటీ తహశీల్దార్ పి రామకృష్ణ తదితరులను సిపిఎం ఆధ్వర్యాన గిరిజనులు దారి మధ్యలోనే ముళ్ల కంపలు వేసి అడ్డుకున్నారు. అదాని హైడ్రో పవర్ ప్రాజెక్టు తమకు వద్దని, తమ భూములను ఇవ్వబోమని స్పష్టంచేశారు. సామాజిక, ఆర్థిక, సాంఘిక సర్వే వద్దని ఇదివరకే స్పష్టం చేశామని గిరిజనులు గుర్తు చేశారు. దశాబ్దాలుగా కొండను నమ్ముకొని జీవిస్తున్నామని, కొండపై తప్ప వేరే చోట జీవించలేమని తెలిపారు. అదాని హైడ్రో పవర్ ప్రాజెక్టుకు భూములిస్తే జీవనాధారం కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. భూసేకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చలుమూరి శ్యామ్, సర్పంచ్ పాతబోయిన పెంటమ్మ, జాలరి వీర్రాజు, జి బాబూరావు, సోమేష్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

నల్లపురెడ్డి వ్యాఖ్యలు సమర్థనీయం కావు : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉన్నత పదవులు నిర్వహించిన వ్యక్తి ఆ తరహా వ్యాఖ్యలు చేయడాన్ని ఆక్షేపించింది. మహిళా ఎమ్మెల్యేపై అలాంటి వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదని పేర్కొంది. స్వీయ నియంత్రణ ఉండాలని హితవు చెప్పింది. అనుచిత వ్యాఖ్యలతో లేనిపోని గందరగోళాన్ని సృష్టించారని వ్యాఖ్యానించింది. ప్రశాంతిరెడ్డిపై వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు ఇవ్వాలంటూ నల్లపురెడ్డి వేసిన వ్యాజ్యంపై విచారణను బుధవారానికి వాయిదా వేస్తూ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సింగయ్య మృతి కేసుపై విచారణ వాయిదా

వైసిపి అధినేత వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా కారు కింద పడి సింగయ్య మృతి చెందాడనే ఘటనపై నమోదైన కేసును కొట్టేయాలంటూ జగన్, ఎంపి వైవి సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజిని, జగన్ పిఎస్ కె నాగేశ్వరరెడ్డి వేసిన పిటిషన్లపై హైకోర్టు తదుపరి విచారణ 2 వారాలకు వాయిదా వేసింది. కౌంటర్ దాఖలు వ్యవహారంపై నిర్ణయం తీసుకోవాల్సి వుందని పోలీసుల తరపున పిపి ఎం లక్ష్మీనారాయణ చెప్పారు. జగన్ తరపున సీనియర్ న్యాయవాది ఎస్ శ్రీరామ్ వాదిస్తూ, పోలీసులు కౌంటర్ దాఖలు చేయలేదన్నారు.

ఆర్ఎస్ఎస్ వ్యాఖ్యలతో రాజ్యాంగం అపహాస్యం

- ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ



సెమినార్‌లో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

భారత రాజ్యాంగ పీఠిక నుంచి సెక్యులరిజం, సోషలిజం పదాలను తొలగించాలని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మాట్లాడడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. 'భారత రాజ్యాంగానికి ఎదురవుతున్న తాజా సవాళ్లు, ప్రజాస్వామ్య మనుగడపై ప్రభావం' అనే అంశంపై శ్రీకాకుళంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చి హిందూ దేశంగా మార్చాలన్నది ఆర్ఎస్ఎస్ లక్ష్యంగా ఉందన్నారు. సోషలిజం, సెక్యులరిజం రాజ్యాంగంలో అంతర్భాగమని, 1976లో చేసిన 42వ రాజ్యాంగ సవరణ సందర్భంగా సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తు చేశారు. దాన్ని మార్చడం ఎవరి తరమూ కాదని తేల్చిచెప్పారు. ఆర్ఎస్ఎస్ అజెండాను అమలు చేయడానికి మోడీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఒక పద్ధతి ప్రకారం రాజ్యాంగం, దాని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం, రాజ్యాంగ యంత్రాంగం మత విషయాల్లో జోక్యం చేసుకోకూడదని రాజ్యాంగం చెప్తున్నా.. ఒక మతాన్ని ఆదరించేలా మోడీ ఆయోధ్య రామ మందిరాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఎన్నికల కమిషన్, న్యాయ వ్యవస్థ స్వతంత్రను దెబ్బ తీసేలా వ్యవహరిస్తున్నారని తెలిపారు. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో రూపొందిన భారత రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. అంతకుముందు స్వాతంత్ర్య సమరయోధుడు, కవి గరిమెళ్ల సత్యనారాయణ, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షులు వి.జి.కె మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. విశ్రాంత డైట్ కాలేజీ ప్రిన్సిపల్ కొత్తకోట అప్పారావు అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో శ్రీకాకుళం నగర ఎన్‌టిఆర్ ఎంహెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి జామి భీమశంకరరావు, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు, సహాయ కార్యదర్శి పి.సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు 'స్వాంతన'

- మంత్రి వీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనారోగ్యంతో మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు స్వాంతన పథకంలో రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందిస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి మంగళవారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతి గృహాలను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ వెల్ఫేర్ అసిస్టెంట్లు తప్పనిసరిగా తనిఖీ చేయాలన్నారు. విద్య, ఆరోగ్యం, భద్రత అంశాల్లో కూటమి ప్రభుత్వం రాజీపడదన్నారు. గురుకులాలు, వసతి గృహాల్లో మిగిలిన సీట్లను భర్తీ చేయాలని, 10వ తరగతి విద్యార్థులకు ముందుగానే స్టడీ మెటీరియల్ పంపిణీ చేయాలని అన్నారు. పిఎం అజయ్ పథకంలో నిర్మిస్తున్న నూతన వసతి గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని, గురుకులాలు, హాస్టళ్ల మరమ్మతులు త్వరిగతిన పూర్తి చేయాలని చెప్పారు. పరిశుభ్రత, పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ఆదేశించారు. ఐఐటి, నీట్ ఎక్సలెన్సీ సెంటర్ల సంఖ్యను 10కి పెంచామన్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా గురుకులాలు, వసతి గృహాల్లో ప్రవేశాలు, స్కాలర్ షిప్‌లు, విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పిఎం ఆదర్శ గ్రామ యోజన, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ బాధితులకు పరిహారం, ఎస్‌సి కాంపొనెంట్, లిడ్ క్యాంప్‌పైనా మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్, డైరెక్టర్ లావణ్య వేణి, గురుకులాల కార్యదర్శి వి.ప్రసన్న వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతుల్లో పెరుగుదల



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లోని జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో భారత ఎగుమతులు 6 శాతం పెరిగి 210.31 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 198 బిలియన్ల ఎగుమతులు చోటు చేసుకున్నాయి. గడిచిన క్యూ1లో వాణిజ్య లోటు 9.4 శాతం తగ్గి 20.3 బిలియన్లకు చేరుకుంది. సేవల ఎగుమతులలో సుమారు 11 శాతం వృద్ధి చోటు చేసుకోవడంతో వాణిజ్య లోటు తగ్గుదలకు దోహదం చేసిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. క్రితం క్యూ1లో సర్వీసు సెక్టార్ ఎగుమతులు 11 శాతం పెరిగి 98.1 బిలియన్లకు చేరాయి. 2024-25 ఇదే త్రైమాసికంలో 88.5 బిలియన్ల ఎగుమతులు జరిగాయి. గడిచిన క్యూ1లో సరుకుల ఎగుమతులు 2 శాతం పెరిగి 112.2 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి. మరోవైపు మొత్తం దిగుమతులు 4.4 శాతం పెరిగి 230.6 బిలియన్లకు చేరాయి. ఇందులో వస్తు దిగుమతులు 4.2 శాతం, సేవల దిగుమతులు 4.9 శాతం చొప్పున పెరిగాయి.

రుణాల చెల్లింపులో ఎంటిఎన్ఎల్ విఫలం

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ అయిన మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్ (ఎంటిఎన్ఎల్) ఏడు ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెల్లించాల్సిన రూ.8,585 కోట్ల రుణాలు, వడ్డీ చెల్లింపులలో విఫలమయ్యింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్, పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లకు అప్పులు చెల్లించాల్సి ఉండగా.. ఆగస్టు 2024 నుండి ఫిబ్రవరి 2025 మధ్య ఎలాంటి చెల్లింపులు చేయలేకపోయింది. మూలధనం రూ.7,794.34 కోట్లు, వడ్డీ మొత్తం రూ.790.59 కోట్లుగా ఉంది. యూనియన్ బ్యాంక్‌కు అత్యధికంగా రూ.3,733 కోట్లు చెల్లించాల్సి ఉంది.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళలను ఆర్థికంగా శక్తివంతులుగా చేసేందుకు సిఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి లైవ్లీ హుడ్స్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ యాక్సిలరేషన్ ప్రోగ్రాంను (లీప్) తాడేపల్లిలోని ఒక కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. వారిలో దాగున్న వ్యాపార నైపుణ్యాలను వెలికితీసి వారిని బలమైన వ్యాపారవేత్తలుగా తయారు చేయడానికి మెప్మా చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 30 వేల మందికిపైగా మహిళా వ్యాపారవేత్తలను తయారు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. స్వయం సహాయ సంఘాల నుంచి రుణం తీసుకుని చిన్న, చిన్న వ్యాపార సంస్థలను నెలకొల్పి అంచెలంచెలుగా రూ.కోటి టర్నోవర్ సాధించే సంస్థలుగా రూపాంతరం చెందేలా వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా ఆడిట్ నిర్వహించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నట్లు చెప్పారు. మెప్మా ఎమ్‌డి తేజ్‌భరత్ మాట్లాడుతూ.. మహిళలకు రుణాలు ఇప్పించడంతో బాధ్యత తీరిపోయిందనుకోవద్దని, వారి వ్యాపార ఉన్నతికి తమవంతు సహాయ, సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ ఫోరం అధ్యక్షులు వినోద్ కుమార్, భారత ఎస్ఎంఇ ఫోరం డైరెక్టర్ సుష్మ, మెప్మా ఎడి వెంకటేశ్వరరావు, కొటిపల్లి తదితరులు పాల్గొన్నారు.



ముంబయిలో టెస్లా తొలి షోరూం ప్రారంభం

ముంబయి : ఎలన్ మస్క్‌కు చెందిన విద్యుత్ కార్ల కంపెనీ భారత్‌కు తన కార్యకలాపాలను విస్తరించింది. ముంబయిలోని బంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ఆ సంస్థ ఏర్పాటు చేసిన టెస్లా షోరూంను మంగళవారం మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ లాంచనంగా ప్రారంభించారు. 'మోడల్ వై' కారును ఆవిష్కరించారు. ఈ కార్ల ధరల శ్రేణి రూ.38.63 లక్షల నుంచి రూ.69.15 లక్షలుగా ఉన్నాయి. తమ కార్లను ఒక్కసారి ఛార్జి చేస్తే 500-600 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని ఆ కంపెనీ తెలిపింది. టెస్లా తన అమ్మకాలకు సరైన రాష్ట్రం, నగరాన్ని ఎంచుకుందని ఫడ్నవీస్ పేర్కొన్నారు.

జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ పొడిగింపు

- జీఓ ఎంఎస్ నెంబరు 77 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్ట్ వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం జీఓ ఎంఎస్ నెంబరు 77ను జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అక్రిడిటేషన్లు అమల్లో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం ప్రీమియం రూ.1250 www.cfms.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా 8342-00-120-01-03-001-001 డిడిఓ కోడ్ 27030802003 ప్రీమియం చెల్లించాలని ఐఅండ్ పిఆర్ కమిషనరు హిమాన్షుశుక్లా తెలిపారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజనల్ చలానా, రెన్యువల్ చేయించుకున్న రాష్ట్ర స్థాయి అక్రిడేషన్ జిరాక్స్‌కాపీలను విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండు, ఎన్‌టిఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లోని సమాచార, పౌరసంబంధాలశాఖ సంచాలకుల కార్యాలయంలో అందజేయాలన్నారు. జిల్లా స్థాయి జర్నలిస్టులు సంబంధిత జిల్లా కేంద్రాల్లోని సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ప్రీమియం రూ.2500లు కాగా ఇందులో ప్రభుత్వం వాటా రూ.1250లు అని తెలిపారు. జర్నలిస్ట్, భార్య/భర్త, పిల్లలు, జర్నలిస్ట్‌పై ఆధారపడిన తల్లిదండ్రులకు ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు. ఈ స్కీమ్‌లో భాగంగా ప్రభుత్వం కార్పస్‌ఫండ్‌ను నిర్వహిస్తూ జర్నలిస్టుల వైద్య ఖర్చులను డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్ట్ విధి విధానాలను అనుసరించి చెల్లిస్తుందన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ తరహాలో జర్నలిస్టులకు నగదు రహిత వైద్య సేవలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ పథకానికి డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్ట్ ఇంప్లిమెంట్ ఏజెన్సీగా అదే విధంగా పౌర సంబంధాల శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందన్నారు.

ఎబి వెంకటేశ్వరరావుపై నమోదైన కేసుల్లో ప్రొసీడింగ్స్ నిలిపివేత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పదవీ విరమణ చేసిన మాజీ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఇంటెలిజెన్సీ) ఎబి వెంకటేశ్వరరావుపై నమోదైన క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై చర్యలను నిలిపివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం జీఓ ఆర్‌టి నెంబరు 1334ని ప్రభుత్వం విడుదల చేసింది. ఇంటెలిజెన్సీ డిజిగా ఉన్న సమయంలో నమోదైన కేసుల్లో ప్రొసీడింగ్స్ నిలిపివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రిటైర్డు ఉద్యోగుల మెడికల్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించాలి

- ఎపి జెఎసి అమరావతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రిటైర్డు ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపులు ఆఫ్‌లైన్‌లో కాకుండా రెగ్యులర్ ఉద్యోగుల తరహాలోనే ఆన్‌లైన్‌లో చెల్లించాలని ప్రభుత్వానికి ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఉద్యోగికి క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ అందేలా చూడాలన్నారు. మంగళగిరి ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్‌లో సిఇఒ ఆధ్వర్యాన ఉద్యోగ సంఘాలతో ఇహెచ్ఎస్ మేనేజింగ్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హెల్త్ స్కీమ్ కార్డు ఉన్నా లేనట్లుగానే ఉందన్నారు. 2013లో ఈ స్కీమ్ ప్రారంభమైనా నేటికీ సరైన వైద్యం అందడం లేదని పేర్కొన్నారు. ఆస్పత్రులకు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించే బిల్లులో కేవలం 30 శాతం కూడా ప్రభుత్వం తిరిగి ఉద్యోగికి ఇవ్వడం లేదన్నారు. ఈ సమావేశంలో పలు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన నగర పంచాయతీ కమిషనర్

ప్రజాశకి-నెల్లిమర్ల (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా నెలిమర్ల నగర పంచాయతీ కమిషనర్ ఎ.తారక్‌నాథ్ ఓ ఇంటి ప్లాన్ అప్రూవల్ కోసం లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. విజయనగరం ఎసిబి డిఎస్‌పి రమ్య తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లిమర్లలోని పద్మశాలి వీధికి చెందిన బురిడి మహేష్ తన ఇంటి నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్లాన్ అప్రూవల్ కోసం కమిషనర్ తారక్‌నాథ్ లంచం డిమాండ్ చేశారు. అప్రూవల్ ఫీజు చెల్లించానని బాధితుడు చెప్పినా కమిషనర్ వినిపించుకోకుండా రూ.15 వేల నగదు, ఒక దివాన్ కాట్ ఇవ్వాలని కోరారు. దీంతో బాధితుడు మంగళవారం ఎసిబి అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయంలోని తన గదిలో మహేష్ నుండి కమిషనర్ లంచం తీసుకుంటుండగా డిఎస్‌పి రమ్య ఆధ్వర్యాన ఎసిబి సిబ్బంది పట్టుకున్నారు. మరో పది రోజుల్లో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా... లంచం కేసులో ఎసిబి అధికారులకు కమిషనర్ పట్టుబడడం చర్చనీయాంశమైంది.

సంపాదకీయం

ప్రజాస్వామ్యంపై దాడి


జమ్ముకాశ్మీర్ స్వాతంత్ర్య సమర యోధులకు నివాళులర్పించేందుకు వెళ్లిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని సైతం కేంద్ర దళాలు అడ్డుకోవడం గర్హనీయం. అమరవీరులను స్మరించుకునే రోజున ముఖ్యమంత్రితోపాటు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే మహ్మద్ యూసుఫ్ తరిగామి, అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు బయటకు రాకుండా గృహ నిర్బంధం చేయడం, అమరవీరుల త్యాగాలకు గుర్తుగా ఉన్న నక్సబంద్ సాహిబ్ సమాధి వద్దకు వెళ్లకుండా భారీ స్థాయిలో పోలీసులను మోహరించి అడ్డుకునేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటు. గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్ల ద్వారా ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిరంకుశంగా వ్యవహరించడం కేంద్ర ప్రభుత్వానికి నిత్యకృత్యమైంది. ప్రజలచే ఎన్నికైన ప్రభుత్వాలు పనిచేయకుండా అడుగడుగునా అడ్డుకుంటోంది. 1931 జులై 13న డోగ్రా మహారాజు హరిసింగ్ దుర్మార్గపు పాలనను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన వారిపై ఆర్మీ అమానుషంగా కాల్పులు జరిపి, 22 మందిని పొట్టనపెట్టుకుంది. మరో 40 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. ఆ దారుణాన్ని, నాటి అమరుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఏటా జులై 13న శ్రీనగర్‌లోని వారి సమాధుల వద్ద నివాళులర్పించడం ఆనవాయితీ. 2019 ఆగస్టులో భారీ ఎత్తున సైన్యాన్ని మోహరించి, సమాచార, సాంకేతిక వ్యవస్థను స్తంభింపజేసి, జమ్ముకాశ్మీర్ రాష్ట్ర హోదాను, రాజ్యాంగంలో 370, 35 (ఎ) అధికరణలను రద్దు చేసిన కేంద్రం నిర్వాకం ప్రపంచానికి ఎరుకే! ఆ తరువాత జులై 13వ తేదీన అమరవీరుల దినోత్సవం సెలవును రద్దు చేసింది. ప్రాణాలు కోల్పోయిన వారంతా అమరవీరులు కారని, అల్లరి మూకలని పేర్కొంటూ అవమానపరిచింది. వారి హత్యకు బాధ్యుడు మాత్రమే గాక, భారతదేశంలో భాగం కావడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన మహారాజా హరిసింగ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించడం ద్వారా జమ్ము కాశ్మీర్ ప్రజలతోపాటు దేశ ప్రజల మనోభావాలను కేంద్రం గాయపరిచింది. ఆరేళ్లయినా రాష్ట్ర హోదా పునరుద్ధరించకుండా, తమ చెప్పు చేతల్లో ఉండి సంఘ్ పరివార్ అజెండాను ముందుకు తీసుకెళ్లేలా లెఫ్టినెంట్ గవర్నర్ల ద్వారా సమాంతర పాలన సాగిస్తోంది. పహల్గాం లాంటి ఉగ్రదాడిని ఎదుర్కోవడంలో కేంద్ర హోం మంత్రిత్వశాఖ నేతృత్వంలో పనిచేసే పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు. అదే సమయంలో కాశ్మీర్ ప్రజలను నిత్యం అనుమానించే, వేధించే చర్యలు ఏళ్లతరబడి కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో అదృశ్యమైన ముగ్గురు యువకులు హత్యకు గురవడాన్ని నిరసిస్తూ ఆందోళన చేసిన మహిళలను డిఎస్‌పి స్థాయి అధికారి ఒకరు కాళ్లతో తన్నుతూ, దుర్భాషలాడుతున్న వీడియో పోలీసు దుర్మార్గాలను కళ్లకు కట్టేదే. రాష్ట్ర శాసన సభకు, ముఖ్యమంత్రికి ఉన్న అధికారాలు పరిమితం చేసేసి పాలన చేతుల్లోకి తీసుకుంటున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించాలి. పోలీసులు, ఎసిబి, జైళ్లు, ఐఎఎస్‌లు, ఐపిఎస్ అధికారులు... ఇలా అనేక అధికారాలు ఎల్‌జికి కట్టబెట్టడం అంటే కేంద్ర హోం శాఖ నిర్వహించడం నిరంకుశ చర్య. ప్రజల చేత ఎన్నికైన ముఖ్యమంత్రికి, మంత్రివర్గానికే అమరవీరులకు నివాళులర్పించేందుకు అనుమతించకపోవడం, బిజెపియేతర రాజకీయ పార్టీల నేతలందరి నివాసాలకూ తాళాలు వేయడం, రెండోరోజు కూడా సమాధుల ప్రవేశ మార్గాన్ని మూసివేయడం, గోడ దూకి అక్కడికి వెళ్లిన సిఎంపైనే పోలీసులతో దాడి చేయించడం నిరంకుశత్వానికి పరాకాష్ట. ప్రజల మనోభావాలతో ఆడుకోవడం మాని అమరవీరుల దినోత్సవం నాడు సెలవును పునరుద్ధరించాలి. జమ్ముకాశ్మీర్ ప్రజల, ప్రజాస్వామ్య హక్కులను గౌరవించి, రాష్ట్ర హోదా తక్షణం పునరుద్ధరించి రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని అధికారాలు అప్పగించాలి. సిఎంపై, నేతలపై, ప్రజలపై దాడి చేయించినందుకు లెఫ్టినెంట్ గవర్నర్ క్షమాపణ చెప్పాలి. ఆ దిశగా కేంద్రం మెడలు వంచేందుకు ప్రజా ఉద్యమాలు మరింత ప్రజ్వరిల్లాలి.

మంచి మాట



జాతి వేరనీ, దేశం వేరనీ, నువ్వు వేరనీ విడిగా ఉండకు. నీకు జరిగితే దేశానికి జరిగినట్టే. దేశం అనుభవించే బానిసతనం నీవూ అనుభవించవలసినదే.

- సరోజినీ నాయుడు, కవయిత్రి.



పెట్టుబడిదారీ వ్యవస్థ - సంక్షేమానికి కోత





ప్రభాత్ పట్నాయక్

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన వెంటనే పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడే సంక్షోభంలో పడింది. దాని నుండి బైట పడడానికి అది ఒక ద్విముఖ వ్యూహాన్ని అనుసరించింది. మొదటిది: "ఎర్ర" ప్రమాదం ముంచుకొస్తోందన్న భయాన్ని రెచ్చగొట్టింది. వాస్తవానికి అలా భయపెట్టడానికి ఎటువంటి ప్రాతిపదికా లేదు. దేశీయ కార్మికవర్గాన్ని భయోత్పాతానికి గురి చేసి వారు పెట్టుబడిదారీ వ్యవస్థకు తలవొగ్గి నడుచుకునేలా చేయడమే దీని అసలు ఉద్దేశం. ఇక రెండవది: పెట్టుబడిదారీ వ్యవస్థ బతికి బట్ట కట్టాలంటే అందుకోసం తప్పనిసరిగా కొన్ని చర్యలను చేపట్టవలసి వచ్చింది. ఆ చర్యల్లో నాలుగింటిని ఇక్కడ ప్రధానంగా పేర్కొనాలి. తమ ఆధీనంలో ఉన్న వలస దేశాలకు స్వతంత్రం ఇచ్చినట్టు ప్రకటించడం, సార్వత్రిక ఓటు హక్కును అమలు చేసి ప్రజాస్వామ్య పరిపాలనను చేపట్టడం, భారీ స్థాయిలో ఉన్న నిరుద్యోగాన్ని కీన్స్ సూచించిన విధానం అమలు ద్వారా అదుపు చేయడం (కీన్షియన్ డిమాండ్ మేనేజ్‌మెంట్ - ప్రభుత్వ వ్యయాన్ని భారీగా పెంచి ఉద్యోగావకాశాలు కల్పించడం, తద్వారా కొనుగోలు శక్తిని పెంచడం), ముఖ్యంగా పశ్చిమ యూరప్ దేశాల్లో సంక్షేమ రాజ్య చర్యలను అమలు చేయడం-ఇవే ఆ నాలుగు చర్యలు. ఈ చర్యలు ఎంత ప్రాధాన్యత కలిగివున్నాయంటే, వాటి ఫలితంగా ప్రజల్లో పెట్టుబడిదారీ విధానపు స్వభావమే మారిపోయిందన్న అభిప్రాయం కలిగింది. అంతకు పూర్వ ఉండిన "కొల్లగొట్టే" దోపిడీ వ్యవస్థ స్థానంలో "ప్రజా సంక్షేమాన్ని పట్టించుకునే పెట్టుబడిదారీ విధానం" వచ్చిందన్న భావన ఏర్పడింది.

యుద్ధానంతరం దీర్ఘకాల వ్యవధిలో పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడింది. ద్రవ్య పెట్టుబడి ప్రధాన శక్తి అయింది. దాని ఫలితంగా ద్రవ్య పెట్టుబడి ప్రపంచవ్యాప్త సంచారం మొదలైంది. దాని పర్యవసానంగా జాతి రాజ్యాల స్వయం నిర్ణయాధికారం కుదించుకుపోయి, అన్ని చోట్లా నయా ఉదారవాద విధానాల అమలు మొదలైంది. దాంతో యుద్ధానంతరం వెంటనే చేపట్టిన చర్యలన్నింటినీ తిరగదోడడం ప్రారంభించారు. ఇప్పుడు ఆ తిరగదోడే వేగం గతంలో ఎన్నడూ లేనంతగా పుంజుకుంది. సామ్రాజ్యవాద దేశాల దన్నుతో అత్యంత దారుణంగా పాలస్తీనా జాతిని సామూహికంగా అంతం చేయడానికి ఏమాత్రమూ వెరపు లేకుండా పూనుకోవడం వలసపాలనా కాలంలో జరిగిన దారుణాలకు ఏ మాత్రమూ తీసిపోదు. నయా ఫాసిస్టు శక్తుల విజృంభణతో బూర్జువా నియంతృత్వం ప్రజానీకానికి ఉన్న ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తోంది. ప్రస్తుతం పెట్టుబడిదారీ వ్యవస్థ అంతర్జాతీయంగా ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం నుంచి బైట పడడానికి 'కీన్షియన్ డిమాండ్ మేనేజ్‌మెంట్' వ్యూహం అమలు చేయగల పరిస్థితి లేదు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యమే దీనికి కారణం. ఇప్పుడు పనిగట్టుకుని అన్ని చోట్లా సంక్షేమ విధానాలనన్నింటినీ తిరగదోడుతున్నారు. తద్వారా మిగిలే ఆర్థిక వనరులను నేరుగా పెట్టుబడిదారులకు బదలాయిస్తున్నారు. లేదా సైనిక వ్యయాన్ని పెంచడానికి ఉపయోగిస్తున్నారు.

డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన "పెద్ద, అందమైన బిల్లు" ను అమెరికాలోని ఉభయ సభలూ ఆమోదించాయి. దాంతో అది ఇప్పుడు చట్టం అయి కూర్చుంది. ఆ చట్టం సంక్షేమం మీద భారీ స్థాయిలో దాడిని తలపెట్టింది. ఆ చట్టం రానున్న పదేళ్ళ కాలంలో 4.5 లక్షల కోట్ల డాలర్ల మేరకు పన్ను రాయితీలను ప్రతిపాదించింది. దాని వలన ప్రధానంగా లబ్ధి పొందేది సంపన్నులే. దానికి తోడు సైనిక వ్యయాన్ని 15,000 కోట్ల డాలర్ల మేరకు ప్రతీ ఏడూ పెంచుతారు. సరిహద్దుల కాపలా కోసం (వలసదారుల ప్రవేశాన్ని అడ్డుకోడానికి) 12,900 కోట్ల డాలర్ల వ్యయం చేస్తారు. ఈ అదనపు ఖర్చులను చేయడానికి వైద్య సహాయం బడ్జెట్‌లో 93,000 కోట్ల డాలర్లు, పర్యావరణహిత విద్యుత్తు బడ్జెట్‌లో 48,800 కోట్ల డాలర్లు, ఆహార సబ్సిడీలలో 28,700 కోట్ల డాలర్లు కోతలు పెడతారు. వృద్ధులు, పేదలు, వికాలంగులు వంటి అత్యంత బలహీన తరగతుల ప్రజానీకపు వైద్యానికి చేసే సహాయంలో కోత పెట్టడం అంటే అత్యంత నిస్సహాయుల్ని నిర్దాక్షిణ్యంగా దెబ్బ తీయడమే. ట్రంప్ తెచ్చిన 'పెద్ద, అందమైన బిల్లు" కడు పేదలనుండి అత్యంత సంపన్నులకు సంపదను బదలాయించడం కోసమే వచ్చింది.

ఐతే, పేదల సంక్షేమంలో పెట్టిన కోతలకన్నా సంపన్నులకు ఇచ్చే పన్ను రాయితీలు చాలా ఎక్కువగా ఉన్నాయి. దీని వలన అమెరికా బడ్జెట్ ద్రవ్యలోటు రానున్న పదేళ్ళలో 3.4 లక్షల కోట్ల డాలర్ల మేరకు అదనంగా పెరుగుతుంది. ఈ లోటును పూడ్చడం కోసం ప్రభుత్వం అప్పులు చేయాలి. వాటిని తీర్చడం పేరుతో పేదల సంక్షేమానికి మరిన్ని కోతలు పెడతారు. ఇదంతా ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవం కోసమేనంటూ సమర్థించుకుంటున్నారు. నిజంగా ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం కోసమే అయితే, ప్రభుత్వం అప్పు చేసి తెచ్చిన ధనాన్నంతటినీ ప్రభుత్వమే ఖర్చు చెయ్యాలి. కాని ఆ సంపదనంతటినీ ధనవంతుల చేతుల్లో పెడుతోంది. అంటే కొనుగోలు శక్తిని ధనవంతులకు పెంచుతోంది. దాని ప్రభావంతో ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం అనేది జరగదు. ఎందుకంటే ఆ ధనవంతులు అదనంగా కొనుగోలు చేసేది ఏమీ ఉండదు. ఇదంతా ఆ సంపన్నులను మరింత సంతృప్తి పరచడం కోసమే జరుగుతోంది.

ఇక్కడ ఒక సందేహం తలెత్తుతుంది. ద్రవ్య పెట్టుబడికి భారీ బడ్జెట్ లోటు ఉండడం అనేది ఏమాత్రమూ అంగీకారం కాదు. ఒకవేళ భారీ లోటు ద్వారా సంపన్నులకు ధనాన్ని బదలాయించినా, బడ్జెట్ లోటు పెరగడం ద్రవ్య పెట్టుబడికి నచ్చదు. మాజీ బ్రిటిష్ ప్రధాని లిజ్ ట్రస్ ఇదే పద్ధతిని అమలు చేయడానికి పూనుకున్నారు. అప్పుడు ఎంత ఎక్కువ వ్యతిరేకత వచ్చిందంటే బ్రిటిష్ పౌండు విలువ అమాంతం పడిపోయి, లిజ్ ట్రస్ రాజీనామా చేయవలసి వచ్చింది. బ్రిటన్ చరిత్రలోనే అత్యంత తక్కువ కాలం ప్రధానిగా ఉన్న వ్యక్తిగా ఆమె చరిత్ర పుటల్లోకెక్కారు. 50 రోజులకు మించి ఆమె పదవిలో కొనసాగలేకపోయారు. అటువంటప్పుడు అదే ద్రవ్య పెట్టుబడి డొనాల్డ్ ట్రంప్‌ను మాత్రం ఎందుకు కొనసాగనిస్తుంది? ఇప్పుడు అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి బడ్జెట్ లోటును భారీగా పెంచడానికి ట్రంప్‌ను అనుమతిస్తుందా అన్నది ప్రశ్న. బడ్జెట్ లోటును ఇంకా తగ్గించమని పట్టుబడుతుందా? సంపన్నులకు అందించే తాయిలాలలో కోతలు పెట్టమని కోరకపోవచ్చు కాని పేదల సంక్షేమానికి చేసే ఖర్చులో మరింత కోత పెట్టమని పట్టుబట్టవచ్చు. ఐతే అమెరికన్ డాలర్ ప్రస్తుతం చెలాయిస్తున్న ఆధిపత్యం కారణంగా ట్రంప్‌కు కొంత వెసులుబాటు ఉండవచ్చు. ఈ మాదిరి వెసులుబాటు బ్రిటిష్ పౌండుకు లేదు. ప్రపంచ సంపదలో ఎక్కువ భాగాన్ని తమ చెప్పుచేతల్లో ఉంచుకున్నవారు ఇప్పటికీ డాలర్ అంటే బంగారంతో దాదాపు సమానమే అని భావిస్తున్నారు. ఇటువంటి సదుపాయం లిజ్ ట్రస్‌కు లేకపోయింది.

పశ్చిమ సంపన్న దేశాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ కుప్పకూలకుండా నిరోధించాలంటే తమకు సవాలుగా పరిణమించే అవకాశం ఉన్న దేశాలను సైనిక బలంతో బెదిరించి ఎదుర్కోవడమే మార్గం అని అవి భావిస్తున్నాయి. ఇరాన్ మీద బాంబుల దాడి వెనుక ప్రేరణ ఈ ఆలోచనే. రాబోయే కాలంలో ఇటువంటి దాడులు మరిన్నింటిని చూస్తాం.

ఇప్పుడు అమెరికాలో సంక్షేమ పద్దులకు మొదలైన కోతలు త్వరలోనే సంపన్న పెట్టుబడిదారీ దేశాలన్నింటికీ వ్యాపిస్తాయి. జూన్ 24, 25 తేదీలలో ది హేగ్ లో జరిగిన నాటో దేశాల శిఖరాగ్ర సమావేశంలో 2035 నాటికి నాటో సభ్య దేశాలన్నీ తమ జిడిపిలో 5 శాతం సైనిక వ్యయానికి కేటాయించాలని తీర్మానించాయి. ప్రస్తుతం అది 2 శాతం మాత్రమే ఉంది. కొన్ని దేశాల్లో ఆ మాత్రం కూడా లేదు. అంటే నాటో సభ్య దేశాలన్నీ రాబోయే పదేళ్ళలో తమ సైనిక వ్యయాన్ని ఇప్పుడున్న 2 శాతం నుండి 5 శాతానికి పెంచుతాయన్నమాట.

తక్కిన నాటో దేశాల కరెన్సీలు అమెరికన్ డాలర్ మాదిరి ఆధిపత్యాన్ని కలిగిలేవు. అందుచేత ఆ దేశాలు తమ బడ్జెట్‌లలో లోటును పెంచి తద్వారా సైనిక వ్యయాన్ని పెంచడం కుదరదు. దానికి అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒప్పుకోదు. పైగా చాలా నాటో దేశాలు యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలుగా కూడా ఉన్నాయి. ఇ.యు. చట్టం ప్రకారం ఆ దేశాలేవీ తమ బడ్జెట్ లోటును 3 శాతానికి మించి పెంచకూడదు. ఇప్పటికే ఆ పరిమితికి చాలా దేశాలు చేరుకున్నాయి. ఇక సంపన్నుల మీద అదనపు పన్నులు వేయడం ఎలానూ కుదరదు. కనుక సైనిక వ్యయాన్ని పెంచాలంటే శ్రామిక ప్రజలను బలి పెట్టడం ఒక్కటే వారి ముందున్న మార్గం. వారి మీద అదనపు పన్నులు విధించడం ద్వారానో, లేక సంక్షేమ వ్యయాన్ని తగ్గించడం ద్వారానో, రెండింటినీ జమిలిగా అమలు చేయడం ద్వారానో అది జరుగుతుంది.

అన్నింట్లోకీ సంక్షేమ పద్దులకు కోత పెట్టడం తేలిక. ఏ పద్ధతిని అనుసరించినా, అంతిమంగా అది శ్రామిక ప్రజల కొనుగోలుశక్తి దిగజారిపోవడానికే దారి తీస్తుంది. ఇప్పుడున్నదాని కన్నా జిడిపిలో 3 శాతం భారాన్ని అదనంగా శ్రామిక వర్గం మీద మోపడం అంటే అది చాలా ఎక్కువ మోతాదు. ఒక విధంగా చెప్పాలంటే నాటో సభ్య దేశాలు సంక్షేమ విధానాలను అమలు చేసే పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లిందని ప్రకటించాయని అనుకోవాలి. అంటే మళ్ళీ "కొల్లగొట్టి దోచుకునే" పెట్టుబడిదారీ విధానంలోకి ప్రపంచం మళ్ళుతోంది.


ఇంతకూ ఇప్పుడు సైనిక వ్యయాన్ని పెంచడానికి నాటో దేశాలు ఎందుకు తయారౌతున్నాయి? పశ్చిమ యూరప్ కు రష్యా నుండి ప్రమాదం పొంచివుందన్న సాకు ఎటూ ఉండనే వుంది. ప్రచ్ఛన్న యుద్ధం కాలంలో కూడా సోవియట్ యూనియన్ నుంచి యుద్ధ ప్రమాదం ఉందని ప్రచారం చేసి తమ సైనిక వ్యయాన్ని పెంచడాన్ని సమర్థించుకున్నారు. కాని మొత్తం నాటో దేశాలన్నింటి సైనిక వ్యయంతో పోల్చి చూసినా, రష్యా సైనిక వ్యయం అందులో మూడో వంతు కూడా లేదు. అంటే రష్యన్ బూచిని చూపడం వొట్టి బూటకం మాత్రమే. పశ్చిమ సంపన్న దేశాలలో పెట్టుబడిదారీ వ్యవస్థ కుప్పకూలకుండా నిరోధించాలంటే తమకు సవాలుగా పరిణమించే అవకాశం ఉన్న దేశాలను సైనిక బలంతో బెదిరించి ఎదుర్కోవడమే మార్గం అని అవి భావిస్తున్నాయి. ఇరాన్ మీద బాంబుల దాడి వెనుక ప్రేరణ ఈ ఆలోచనే. రాబోయే కాలంలో ఇటువంటి దాడులు మరిన్నింటిని చూస్తాం.


ఇటువంటి దాడులకు సన్నద్ధం కావడానికి ఈ పశ్చిమ సంపన్న దేశాలు తమ తమ దేశాల కార్మిక వర్గం ఇంతవరకూ అనుభవిస్తున్న సంక్షేమ పథకాలను బలి చేయనున్నాయి. కుప్పకూలే స్థితిలో ఉండే సామ్రాజ్యవాదం అత్యంత ప్రమాదకరం. ఎందుకంటే అది మొత్తం ప్రపంచాన్నే వినాశనానికి గురి చేయగలదు. బేఖాతరుగా ఇరాన్ మీద కురిపించిన బాంబుల వర్షం దీనికి ఉదాహరణ. అందుచేత ప్రపంచం మొత్తం మీద ప్రజానీకానికి ఈ సామ్రాజ్యవాదపు ప్రమాదం ఎంత తీవ్రమైనదో వివరించి ప్రతిఘటించే దిశగా నడిపించడం నేడు అత్యంత ప్రాధాన్యత కలిగిన కర్తవ్యంగా ముందుకొచ్చింది.

(స్వేచ్ఛానుసరణ)

అంతర్జాతీయం

ఉక్రెయిన్ పోరు - ట్రంప్ బెదిరింపు!





ఎం. కోటేశ్వరరావు

రానున్న యాభై రోజుల్లో ఉక్రెయిన్‌పై దాడులను ఆపకపోతే తీవ్రమైన ఆంక్షలు విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా గడువు ప్రకటించాడు. ఇది రాసిన సమయానికి రష్యా నుంచి ఎలాంటి స్పందన వెలువడలేదు. ఉక్రెయిన్ సంక్షోభం మంగళవారం నాటికి 1,237వ రోజులో ప్రవేశించింది. పరస్పర దాడులు సాగుతున్నాయి, తూర్పు ప్రాంతంలో మరో రెండు గ్రామాలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నట్లు రష్యా ప్రకటించింది. అధికారం స్వీకరించిన 24 గంటల్లో పోరును ఆపివేస్తానని ప్రకటించిన ట్రంప్ అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్ని మాటలు మార్చాడో, ప్రగల్భాలు పలికాడో తెలిసిందే. పోరును గనుక ఆపకపోతే రష్యా నుంచి దిగుమతులు చేసుకొనే దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తానని తాజాగా బెదిరించాడు, కొద్ది రోజుల క్రితం 500 శాతం అని చెప్పిన సంగతి తెలిసిందే.

గత ఆరు నెలలుగా పుతిన్‌తో సంప్రదింపుల గురించి చెబుతున్నప్పటికీ ఉక్రెయిన్‌పై దాడులు పెరుగుతున్నాయే తప్ప తగ్గలేదు. దాంతో రష్యాతో వాణిజ్యం చేసే దేశాలపై 500 శాతం పన్ను విధించాలనే తీర్మానాన్ని పార్లమెంటులో ప్రవేశ పెడతానని సెనెటర్ లిండ్సే గ్రాహమ్ చెప్పాడు. గొప్పలు చెప్పుకున్న ట్రంప్ అది జరగకపోవటంతో అవమాన భారంతో ఏం మాట్లాడుతున్నాడో, ఏం చేస్తాడో తెలియని స్థితిలో ఉన్నాడంటే అతిశయోక్తి కాదు. పుతిన్ సేనలపైన, రష్యాపైన దాడులు చేసేందుకు పేట్రియాట్ క్షిపణులు ఇస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించి సంక్షోభాన్ని మరో మలుపు తిప్పాడు. పరిష్కరించాలనే చిత్తశుద్ధి అమెరికాకు లేదన్నది స్పష్టం. ఈ క్షిపణి విధ్వంసక వ్యవస్థ ధర ఒక్కొక్కటి 40 లక్షల డాలర్లు ఉంటుంది. ఉక్రెయిన్‌కు సరఫరా చేసే ఆయుధాలను ఐరోపాకు విక్రయించి అక్కడి నుంచి ఉక్రెయిన్‌కు తరలించే విధంగా అమెరికా నిర్ణయించింది. కీలక ఆయుధ సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రకటించి రష్యాను బుట్టలో వేసుకోవాలని ట్రంప్ చూశాడు. ఆ పప్పులు ఉడకలేదు, దాంతో ఆయుధాల సరఫరా పునరుద్ధరించనున్నట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. మరోవైపున శాంతి చర్చలకు చొరవ చూపేందుకు పోప్ లియో సుముఖంగా ఉన్నారని ఆయనను కలిసిన తరువాత జెలెన్స్కీ ప్రకటించాడు. దాని గురించి ఎటూ తేలక ముందే సరికొత్త ఆంక్షల గురించి ట్రంప్ ప్రకటించాడు. పుతిన్ గురించి నోరు పారవేసుకున్న ట్రంప్ తీరును తాము పట్టించుకోవటం లేదని గత వారంలో రష్యా స్పందించింది. ఆయుధ ఒప్పందం ఆటతీరునే మార్చి వేస్తుందని రూటే వర్ణించాడు. జర్మనీతో సహా ఫిన్లాండ్, డెన్మార్క్, స్వీడన్, నార్వే వంటివి అమెరికా నుంచి తీసుకొని నూతన ఆయుధాలను సరఫరా చేస్తాయని చెప్పాడు. తాను ముందుగా ఐరోపా దేశాలు ఇలాంటి చొరవ తీసుకుంటాయని అనుకోలేదని, కానీ అవి చేశాయని ట్రంప్ అభినందించాడు. త్వరలో మరికొన్ని క్షిపణులను కూడా అందించేందుకు అమెరికా పూనుకుంది. రష్యా క్షిపణులను అడ్డుకొనేందుకు పేట్రియాట్ వ్యవస్థలను వినియోగిస్తామని, అయితే ఎదురు దాడి చేసే ఆయుధాలను కూడా ఇచ్చే అవకాశం ఉందని నాటోలో అమెరికా రాయబారి చెప్పాడు. నేరుగా ఉక్రెయిన్‌కు ఆయుధాలు విక్రయిస్తే వచ్చే విమర్శల నుంచి తప్పుకొనేందుకు, తన చేతికి మట్టి అంటకుండా, ఖజానా మీద భారం మోపకుండా ఐరోపా దేశాలకు ఆయుధాలను విక్రయించి అటు నుంచి తరలించేందుకు ట్రంప్ వేసిన ఎత్తుగడ ఇది.

అధికారానికి వచ్చిన తరువాత ట్రంప్ ఆర్భాటంగా పుతిన్‌తో నేరుగా మాట్లాడాడు. రష్యాకు రాయితీలు ఇవ్వాల్సిందే, కొన్ని ప్రాంతాలు వదులుకోవాల్సిందే, మేం 350 బిలియన్ డాలర్లు ఇచ్చినా యుద్ధంలో గెలిచేది లేదని జెలెన్స్కీతో చెప్పాడు. అతగాడిని మంచి హాస్యనటుడు అంటూనే ఎన్నికలు జరపని నియంత అన్నాడు. ఫిబ్రవరి 28న అధ్యక్ష భవనంలో బహిరంగంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీని అవమానించి ఐరోపా భాగస్వాములను నిర్ఘాంతపరిచాడు. రష్యాను ఖండిస్తూ ఐరాసలో ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని వ్యతిరేకించాడు. ఐరోపా దేశాలన్నీ ఈ తీరును చూసి నిజంగానే ట్రంప్ తమను వదలి పుతిన్‌తో చేతులు కలిపి ఉక్రెయిన్‌ను అప్పగిస్తాడా అన్నంతగా భయపడ్డాయి. చివరికి భద్రతా మండలిలో రష్యా మీద ఎలాంటి విమర్శలు లేని తీర్మానానికి మద్దతు ఇచ్చాయి. ఈలోగా ఉక్రెయిన్ లోని విలువైన ఖనిజాలున్న ప్రాంతాన్ని తమకు అప్పగించాలని అమెరికా రాయించుకొని ఒప్పందం చేసుకుంది.

గత గురువారం నాడు రోమ్ నగరంలో ఉక్రెయిన్ స్వస్థత సమావేశం జరగటానికి ముందు జెలెన్స్కీ ఇటలీలో ట్రంప్ ప్రతినిధి కెయిత్ కెలోగ్‌తో సమావేశం సందర్భంగా రష్యా దాడులను తీవ్రం కావించింది. పోప్ లియోను రెండు నెలల్లోనే జెలెన్స్కీ రెండు సార్లు కలిశాడు. పోరు ఇంకా కొనసాగుతుండగానే ఉక్రెయిన్ పునరుద్ధరణ పథకాలు, దానికి అవసరమైన పెట్టుబడులు, దానిలో పాలుపంచుకొనే దేశాలు, నిర్మాణ సంస్థల గురించి పశ్చిమ దేశాలు వాణిజ్య చర్చలు జరిపాయి. ఇప్పటికే ఐరోపాలో ఉన్న పేట్రియాట్ క్షిపణులను వెంటనే ఉక్రెయిన్‌కు తరలించి మిగతావాటిని అమెరికా ఫ్యాక్టరీల్లో తయారు చేసి అందచేస్తారు. మీరు గనుక ఉక్రెయిన్ మీద దాడి చేస్తే నేను మాస్కో మీద బాంబులు వేయిస్తానని పుతిన్‌తో మాట్లాడినపుడు ట్రంప్ బెదిరించాడన్న వార్త గుప్పుమన్నది. అయితే వారి మధ్య ఆ సంభాషణ ఎప్పుడు జరిగిందో, అది నిజమో కాదో నిర్ధారణ కాలేదు గానీ, ఆధునిక ఆయుధాలను ఇస్తానన్న ట్రంప్ మాటలు దాన్ని నిర్ధారిస్తున్నాయి. కొద్ది వారాల క్రితం రష్యా భూభాగంలో ప్రవేశించి అనేక చోట్ల ఉక్రెయిన్ జరిపిన దాడుల వెనుక అమెరికా హస్తం లేదని ఎవరూ చెప్పలేరు.

గత ఆరు నెలలుగా పుతిన్‌తో సంప్రదింపుల గురించి చెబుతున్నప్పటికీ ఉక్రెయిన్‌పై దాడులు పెరుగుతున్నాయే తప్ప తగ్గలేదు. దాంతో రష్యాతో వాణిజ్యం చేసే దేశాలపై 500 శాతం పన్ను విధించాలనే తీర్మానాన్ని పార్లమెంటులో ప్రవేశ పెడతానని సెనెటర్ లిండ్సే గ్రాహమ్ చెప్పాడు. గొప్పలు చెప్పుకున్న ట్రంప్ అది జరగకపోవటంతో అవమాన భారంతో ఏం మాట్లాడుతున్నాడో, ఏం చేస్తాడో తెలియని స్థితిలో ఉన్నాడంటే అతిశయోక్తి కాదు. పుతిన్ సేనలపైన, రష్యాపైన దాడులు చేసేందుకు పేట్రియాట్ క్షిపణులు ఇస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించి సంక్షోభాన్ని మరో మలుపు తిప్పాడు. పరిష్కరించాలనే చిత్తశుద్ధి అమెరికాకు లేదన్నది స్పష్టం.

రష్యా ఆధీనంలోని జపోర్ఝియా ప్రాంతంలో ఉన్న అణువిద్యుత్ కేంద్రంపై వందలాది రౌండ్ల కాల్పులు జరిపినట్లు అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ చెప్పింది. అక్కడ అణు ప్రమాదం జరిగితే దానికి రష్యాను బాధ్యురాలిగా చేసి వత్తిడి తేవాలన్న కుట్ర దీనిలో కనిపిస్తోంది. దీని వెనుక పశ్చిమ దేశాల హస్తం ఉందని వేరే చెప్పనవసరం లేదు. పేట్రియాట్లతో సహా ఆధునిక ఆయుధాలను అందచేయాలన్న నిర్ణయం నాటకీయంగా జరగలేదు. గత కొద్ది వారాలుగా మల్లగుల్లాలు పడుతున్నారు. వీటితో పుతిన్ దారికి వస్తాడని భావిస్తున్నట్లుగా కనిపిస్తున్నది. జూన్‌లో జరిగిన నాటో సమావేశాల్లో ఒక కొలిక్కి వచ్చిన ఈ ఆలోచనపై అంతకు ముందే విధి విధానాల గురించి చర్చ మొదలైంది. నాటో నేరుగా ఆయుధాలు పంపితే అది రష్యాకు ఒక అస్త్రంగా మారుతుంది. అన్నింటికీ మించి నాటో కూడా యుద్ధంలో పాల్గొన్నట్లే. అందుకే కొన్ని దేశాలను ఎంపిక చేసి వాటి ద్వారా కథ నడిపిస్తున్నారు. 'మీరు ఆధునిక ఆయుధాలు ఇస్తారు, అవి రష్యా క్షిపణులను అడ్డుకుంటాయి సరే, మా కుటుంబాల ప్రాణాలను కాపాడతాయో లేదో చెప్పండ'ని ఉక్రేనియన్ సైనికులు కొందరు సిఎన్ఎన్‌తో మాట్లాడిన మాటలు ఒక్క మిలిటరీలోనే కాదు, యావత్తు ఉక్రేనియన్లలో ఉంటాయని వేరే చెప్పనవసరం లేదు. అందుకే జెలెన్స్కీ అవమానాలు భరించి కూడా ఆయుధాల కోసం విలువైన ఖనిజాలున్న ప్రాంతాలను అమెరికాకు రాసి ఇచ్చిన తరువాత...దేశం మొత్తాన్ని నాటో కూటమికి తాకట్టు పెట్టినా ఆశ్చర్యం లేదు. ఏం జరుగుతుందో చూద్దాం! ★

జనవాక్యం

'శిక్ష'ణా కార్యక్రమాలు!

ఇటీవల రాష్ట్రంలోని ప్రధానోపాధ్యాయులకు స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయి. వీటిలో రిసోర్స్ పర్సన్ అయిన ఒక ప్రధానోపాధ్యాయుడు ఒత్తిడికి లోనై గుండె పోటుతో మరణించారు. గతంలో కూడా ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాలలో కొంతమంది ఉపాధ్యాయులు మరణించిన విషయం గుర్తుండే వుంటుంది. శిక్షణా కార్యక్రమాలకు సంబంధించి ఎవరికీ మినహాయింపు లేదు. అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని విద్యాశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో అనారోగ్యంతో బాధ పడుతున్న ఉపాధ్యాయులు శిక్షణా కార్యక్రమాలకు హాజరై మృతి చెందుతున్నారు. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు తప్పనిసరి చేయరాదు. ఉపాధ్యాయులు పూర్తి సుముఖతతోనే హాజరయ్యేందుకు వీలుగా మార్చాలి. ఉపాధ్యాయులకు ఒత్తిడి లేని శిక్షణ కార్యక్రమాలు జరపాలి. నిర్బంధ శిక్షణ కార్యక్రమాలు రద్దు చేయాలి. అనారోగ్య కారణాలతో హాజరు కాలేమని తెలిపే ఉపాధ్యాయులకు శిక్షణల నుంచి మినహాయింపు ఇవ్వాలి. అప్పుడు పైన పేర్కొన్నటువంటి ఘటనలు చోటుచేసుకోవు.

- వాసిలి సురేష్,
సెల్: 9494615360

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

జిన్‌పింగ్‌తో జై శంకర్ భేటీ



చైనా అధ్యక్షులు జిన్‌పింగ్‌తో
విదేశాంగ మంత్రి జైశంకర్

బీజింగ్ : ప్రస్తుతం చైనాలో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి జై శంకర్ మంగళవారం చైనా అధ్యక్షులు జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సంబంధాల్లో ఇటీవల వచ్చిన పరిణామాలపై జిన్‌పింగ్‌కు అన్నీ వివరించినట్లు జై శంకర్ చెప్పారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) విదేశాంగ మంత్రుల సమావేశం కోసం ఇక్కడకు వచ్చిన జై శంకర్ సోమవారం చైనా విదేశాంగ మంత్రితో విడిగా సమావైన సంగతి విదితమే. మంగళవారం జిన్‌పింగ్‌ను కలిసి రాష్ట్రపతి, ప్రధానమంత్రి తరపున అభినందనలు తెలియచేసినట్లు ఆయన ట్వీట్ చేశారు. 2020 జూన్‌లో గాల్వన్ లోయలో ఘర్షణల తర్వాత ఇరువురు నేతలు సమావేశం కావడం ఇదే తొలిసారి. తూర్పు లడఖ్‌లో తలెత్తిన సరిహద్దు ప్రతిష్టంభనపై ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో వాటిని చక్కదిద్దుకోవడానికి రెండు దేశాలు చర్యలు తీసుకుంటున్నాయి. ద్వైపాక్షిక చర్చల యంత్రాంగాన్ని పునరుద్ధరించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. వాస్తవ నియంత్రణ రేఖ వద్ద ఉద్రిక్తతలను తగ్గించుకునేందుకు కృషి చేయాలని ఇరు దేశాలు భావించాయి. సోమవారం చైనా విదేశాంగ మంత్రితో సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు జై శంకర్ తెలిపారు. జూన్‌లో ఎస్‌సిఓ రక్షణ మంత్రుల సమావేశానికి వచ్చిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీసుకున్న చర్యల నేపథ్యంలో తాజాగా జై శంకర్ పర్యటన వూపందుకుంది. ఈ ఏడాది చివరిలో ప్రధాని మోడీ చైనాలో పర్యటించే అవకాశం వుంది. క్షేత్ర స్థాయిలో అందుకు అవసరమైన కసరత్తును మంత్రులు చేస్తున్నారు. ఆ దిశగా ఇంతకుముందు రాజ్‌నాథ్, ఇప్పుడు జై శంకర్ పర్యటనలు సాగుతున్నాయి. సంబంధాలను సాధారణ స్థాయికి తీసుకువచ్చేందుకు రెండు దేశాలు కృషి చేస్తున్నాయి.

జెఎస్‌డబ్ల్యు నుంచి సిహెచ్‌డి వాటర్‌గార్డ్ సిమెంట్



హైదరాబాద్ : జెఎస్‌డబ్ల్యు సిమెంట్ భారతదేశంలో తొలిసారిగా టర్బో జెల్ టెక్నాలజీతో కూడిన సిహెచ్‌డి వాటర్‌గార్డ్ సిమెంట్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఈ సూపర్ ప్రీమియం, వాటర్ రిపెలెంట్ సిమెంట్ దక్షిణాదిలోని అధిక తేమ, ఉప్పు, భారీ వర్షాల సవాళ్లను ఎదుర్కొనేలా రూపొందించబడిందని ఆ కంపెనీ పేర్కొంది. ఇది సీపేజీ, తుప్పు, తేమ నష్టాన్ని నిరోధిస్తుందని, నిర్మాణ దృఢత్వం, మన్నికను పెంచుతుందని ఆ కంపెనీ సిఇఒ నీలేస్ నర్వేకర్ పేర్కొన్నారు.

స్వేచ్ఛ హద్దు మీరకూడదు !

- సోషల్ మీడియా అభ్యంతరకర పోస్టులపై 'సుప్రీం' వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : భావ ప్రకటనా స్వేచ్ఛ హద్దు మీరకూడదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఏం చేసినా.. ఏం చెప్పినా చెల్లిపోతుందనే ధోరణి మారాలని పేర్కొంది. సోషల్ మీడియాలో కొందరు యూ ట్యూబర్లు, స్టాండప్ కమెడియన్లు, కళాకారులు తమ ఇష్టం వచ్చినరీతిలో అభ్యంతరకర పోస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అలాంటి పోస్టుల కట్టడికి తప్పనిసరిగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. తరచూ ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడంపై ఆగ్రహించింది. ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్‌ఎస్‌ఎస్‌పై వేసిన కార్టూన్‌కు సంబంధించి తనపై నమోదైన కేసులో తనను అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలంటూ కార్టూనిస్టు హేమంత్ మాలవీయ వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం ఈ వ్యాఖ్యలు చేసింది. భావ ప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేయవద్దని హెచ్చరిస్తూ.. కార్టూనిస్టుకు అరెస్టు నుంచి రక్షణ కల్పించింది. అయితే ఇదే విధంగా సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన పోస్టులను షేర్ చేస్తే.. చట్ట ప్రకారం అతడిపై చర్యలు తీసుకునే అధికారం రాష్ట్రానికి ఉందని జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ అరవింద్ కుమార్‌తో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. కార్టూనిస్ట్‌పై న్యాయవాది, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త వినయ్ జోషి ఫిర్యాదుతో ఈ కేసు నమోదైంది. అభ్యంతరకర విషయాలను అప్‌లోడ్ చేయడం ద్వారా హిందువుల మతపరమైన మనోభావాలను దెబ్బతీశారని జోషి ఆరోపించారు. ఈ కేసులో అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ హేమంత్ మధ్యప్రదేశ్ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేయగా న్యాయస్థానం దానిని తోసిపుచ్చడంతో ఆయన సుప్రీంను ఆశ్రయించారు.

పౌరసత్వంతో ముడిపెట్టొద్దు

- సుప్రీం మార్గదర్శకాలతోనే ఓటర్ల జాబితా సవరణలు
- కేంద్ర ఎన్నికల సంఘానికి టిడిపి వినతి
- సిఇసి, ఇసిలతో నేతల భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పౌరసత్వ ధ్రువీకరణతో ముడిపెట్టి ఓటర్ల జాబితా సవరణ చేయొద్దని కేంద్ర ఎన్నికల సంఘాన్ని తెలుగుదేశం పార్టీ (టిడిపి) కోరింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారమే సవరణలు ఉండాలని సూచించింది. ఈ విషయంలో ప్రస్తుతం బీహార్‌లో చేపడుతున్న తరహాలో దేశవ్యాప్తంగా చేయతలపెట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు విధానపరమైన స్పష్టత ఉండాలని కోరింది. ఎస్ఐఆర్ అనేది పౌరసత్వ ధ్రువీకరణకు సంబంధించిన ప్రక్రియ కాదనే విషయాన్ని క్షేత్ర స్థాయిలో స్పష్టంగా తెలియజేయాలని సూచించింది. ఎస్ఐఆర్ ఉద్దేశమేంటో స్పష్టమైన నిర్వచనం ఇవ్వాలని, సవరణలకు స్పష్టమైన నిర్వచనం, ఈ ప్రక్రియను మార్పులు, చేర్పులకే పరిమితం చేయాలని విన్నవించింది. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియను వీలైనంత త్వరగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించాలని కూడా టిడిపి కోరింది. ఎన్నికల జాబితా విషయంలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరముందని, ఈ ప్రక్రియలన్నీ పూర్తి పారదర్శకంగా చేపట్టాలని కోరింది. న్యూఢిల్లీలోని నిర్వచన్ భవన్‌లో కేంద్ర ఎన్నికల కమిషనర్ (ఇసిఐ) జ్ఞానేష్ కుమార్‌తో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో కూడిన నేతల బృందం మంగళవారం సమావేశమైంది. పల్లాతో పాటు ఎంపిలు లావు శ్రీకృష్ణదేవరాయులు, డి ప్రసాదరావు, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే కూన రవికుమార్, టిడిపి జాతీయ అధికార ప్రతినిధి టి జ్యోత్స్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాలుగు పేజీల లేఖను ఇసిఐకి టిడిపి బృందం అందజేసింది. ఎన్నికల జాబితా నిర్వహణను బలోపేతం చేయడం, ప్రజాస్వామ్య ప్రక్రియలో పారదర్శకతను పెంపొందిం చడం లక్ష్యంగా పలు సంస్కరణలను ప్రతిపాదిం చింది.

కేంద్ర కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ద్వారా థర్డ్ పార్టీ ఆడిట్‌లు, ఎఐ ఆధారిత డూప్లికేషన్ల తొలగింపు, ఆధార్ ఆధారిత ఎన్నికల ఫొటో గుర్తింపు కార్డు (ఇపిఐసి) నంబర్లను ఆధార్ ఆధారితంగా ధ్రువీకరించడం, ఓటరు ఫిర్యాదు ట్రాకింగ్ కోసం మెరుగైన పబ్లిక్ డాష్‌బోర్డ్ ఏర్పాటు వంటి పలు సూచనలను టిడిపి తన లేఖలో సూచించింది.

జాతీయ సగటు కంటే ఏపిలో పోలింగ్ ఎక్కువ

ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ సగటు ఓటింగ్ కంటే పోలింగ్ శాతం అధికంగా నమోదైందని, ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఏపిలో 81.86 శాతం ఓటింగ్ నమోదైందని, జాతీయ సగటు 65.79 శాతం కంటే చాలా ఎక్కువ అని టిడిపి పేర్కొంది. సాంకేతికతతో కూడిన ఓటరు జాబితా సవరణలు ప్రజాస్వామ్య వ్యవస్థలో చాలా కీలకమని తెలిపింది. ఎన్నికల అధికారుల కఠినమైన జవాబుదారీతనం, బ్లాక్ లెవల్ ఆఫీసర్లు (బిఎల్‌ఒలు)/ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు (ఈఆర్‌వోలు) తప్పనిసరి రొటేషన్ చేపట్టాలని, అలాగే వలస ప్రజల కోసం ప్రత్యేక ఓటరు నమోదు డ్రైవ్‌లు నిర్వహించాలని టిడిపి సూచించింది. ఏపిలో 2029 వరకు అసెంబ్లీ ఎన్నికలు జరగవని, అందువల్ల ఎస్ఐఆర్‌తో ఓటర్ల జాబితాలు న్యాయంగా, సమగ్రంగా, పారదర్శకంగా అప్‌డేట్ చేయడానికి అవకాశం లభిస్తుందని టిడిపి పేర్కొంది. ఈ ప్రక్రియను రాష్ట్రంలో వీలైనంత త్వరగా ప్రారంభించాలని కోరింది.

నిమిష ప్రియ మరణశిక్ష అమలు వాయిదా



న్యూఢిల్లీ : యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటోన్న కేరళ నర్సు నిమిష ప్రియకు చివరి నిముషంలో కాస్త ఊరట లభించింది. ఆమె మరణశిక్ష అమలును యెమెన్ ప్రస్తుతానికి వాయిదా వేసినట్లు భారత విదేశాంగశాఖ వర్గాలు వెల్లడించాయి. తొలుత నిర్ణయించిన ప్రకారం బుధవారం ఈ శిక్ష అమలు జరగాల్సి వుంది.

"తొలినుండి నిమిష ప్రియకు అన్ని విధాలా సాయం చేసేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నిస్తూనే ఉంది. నిమిష కుటుంబం.. బాధిత కుటుంబం పరస్పర అంగీకారానికి వచ్చి ఈ సమస్యను పరిష్కరించుకునేలా కొంత సమయం ఇచ్చేందుకు ప్రయత్నాలు చేశాం. స్థానిక జైలు అధికారులు, ప్రాసిక్యూటర్ ఆఫీసుతో నిరంతరం సంప్రదింపులు జరిపాం. ఫలితంగా మరణశిక్ష అమలును వాయిదా వేసేందుకు యెమెన్ అధికారులు అంగీకరించారు." అని విదేశాంగ శాఖ వర్గాలు వెల్లడించాయి.

ఇదిలావుండగా, బ్లడ్ మనీ తీసుకుని కేసును ఉపసంహరించుకునేలా బాధిత కుటుంబాన్ని ఒప్పించేందుకు మత గురువు అబూబకర్ ముస్లియార్ జరుపుతున్న కూడా సానుకూలంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. బాధిత కుటుంబానికి మిలియన్ డాలర్లు (దాదాపు రూ.8.6 కోట్లు) ఇచ్చేందుకు నిమిష ప్రియ కుటుంబం సిద్ధమైంది. ఇందుకు వారు అంగీకరిస్తే నిమిష ప్రియకు మరణశిక్ష తప్పే అవకాశం ఉంది.

'బ్లడ్ మనీ' ఇప్పటివరకు ఎవరినైనా కాపాడిందా..?

నిమిష ప్రియ కేసు నేపథ్యంలో ఈ 'క్షమాధనం (బ్లడ్ మనీ)' ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతంలో ఎవరైనా ఇలా బ్లడ్ మనీతో మరణశిక్ష నుంచి బయటపడ్డారా? అని పరిశీలిస్తే షరియా చట్టాల ప్రకారం.. నేరం రుజువైన తర్వాత కూడా దోషిని బాధిత కుటుంబం క్షమిస్తే శిక్ష తప్పుతుంది. ఆ కుటుంబం బ్లడ్ మనీకి అంగీకరిస్తేనే అది సాధ్యమవుతుంది. ప్రస్తుతం ఈ విధానం యెమెన్, సౌదీ అరేబియా, ఇరాన్, పాకిస్తాన్ వంటి ఇస్లామిక్ దేశాల్లో అమల్లో ఉంది. గత కొన్నేళ్లుగా అరుదైన సందర్భాల్లో కొంతమంది భారతీయులు ఇలా 'క్షమాధనం'తో మరణశిక్షను తప్పించుకున్నారు.

సంచలనాల సినర్

- తొలిసారి వింబుల్డన్ కైవసం
- రెండేళ్లుగా అద్భుత ఫామ్‌లో ఇటలీ స్టార్



జెన్నిక్ సిన్నర్ ప్రస్తుతం టెన్నిస్ జగత్తులో ఎక్కువగా వినిపిస్తున్న పేరు. గత రెండేళ్లలో ఏకంగా నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను ఒడిసిపట్టిన ఇటలీకి చెందిన టాప్‌సీడ్ 23ఏళ్ల సినర్ 2024లో ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌ను నెగ్గి టైటిళ్ల వేటను మొదలుపెట్టాడు. ఆ ఏడాదే యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను చేజిక్కించుకున్నాడు. ఈ క్రమంలోనే 2025 ప్రారంభంలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను సాధించాడు కూడా. కానీ గత నెలలో రోలాండ్ గారోస్‌లో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో అనూహ్యంగా అల్కరాజ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. కానీ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను కైవసం చేసుకొని కెరీర్‌లో నాల్గో గ్రాండ్‌స్లామ్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలోనే ఫైనల్లో ఫ్రెంచ్ ఓపెన్‌ఓ ఓటమికి బదులు తీర్చుకున్నాడు.

2024లో తొలిసారి ఎటిపి ర్యాంకింగ్స్‌లో టాప్‌సీడ్‌కు ఎగబాకిన సినర్ ఈ ఫీట్‌ను సాధించిన తొలి ఇటలీ ఆటగాడుగా రికార్డుపుటల్లోకెక్కాడు. 2023 నుంచి క్రమంగా టాప్-3లో నిలుస్తున్న సినర్ ఏడాది కాలంలోనే టాప్ ర్యాంక్‌కు ఎగబాకడం విశేషం. ఈతరం ఆటగాళ్లు కార్లోస్ అల్కరాజ్, మెద్వదెవ్‌తోపాటు రికార్డు గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత నొవాక్ జకోవిచ్‌నుంచి గట్టి పోటీ ఎదురవుతున్నా.. ఆ సవాళ్లనన్నింటినీ అధిగమిస్తూ టైటిళ్లను కొల్లగొడుతున్నాడు. ఈ క్రమంలోనే 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత నొవాక్ జకోవిచ్‌కు అందని ద్రాక్షలా ఉన్న 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌కు అడ్డుగా నిలుస్తూ వస్తున్నాడు. ఓపెన్ ఎరాలో ఒకే ఏడాది నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను చేజిక్కించుకున్న రికార్డు ఇప్పటివరకు ఏ ఒక్క టెన్నిస్ ఆటగాడు సాధించలేకపోయాడు. గతంలో ఫెదరర్, జకోవిచ్, నాదల్ 20ఏళ్లలో ఒక్క ఏడాదిలో నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను సాధించలేదు. ఈ క్రమంలో ఈతరం ఆటగాళ్లు అల్కరాజ్-సినర్‌ల మధ్య కూడా ప్రధానంగా అదే అడ్డు తగులుతోంది. అలాగే టాప్ ర్యాంక్ హోదాలో ఈ ఫీట్‌ను ఇప్పటివరకు ఏ ఒక్క ఆటగాడు కైవసం చేసుకోలేదు. కనీసం సినర్ అయినా 2025 ఏడాదిలో ఆ మార్క్‌ను సాధిస్తాడని ఆశించిన అభిమానులకు నిరాశే మిగిలింది. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గినా.. ఫ్రెంచ్ ఓపెన్‌లో ఓడాడు. దీంతో వింబుల్డన్ నెగ్గినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో సినర్ వరుసగా నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు నెగ్గాలంటే మళ్లీ 2026 ఏడాది వరకు ఆగాల్సిందే.

సినర్ గెలిచి గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు..
ఆస్ట్రేలియన్ ఓపెన్: 2024, 2025
వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ : 2025
యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ : 2024

అల్కరాజ్ జోరు కూడా..

ఇక స్పెయిన్ యువ సంచలనం 22ఏళ్ల కార్లోస్ అల్కరాజ్‌ను ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. అతడు ఈ రెండేళ్ల కాలంలో ఏకంగా ఐదు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను తన ఖాతాలో వేసుకున్నాడు. గత నెలలో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్‌ను నెగ్గిన అల్కరాజ్.. వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్‌ను చేజిక్కించుకొనడం ఖాయం అనుకున్నా.. సినర్ జోరుముందు నిలువలేకపోయాడు. దీంతో హ్యాట్రిక్ వింబుల్డన్ టైటిల్‌ను సాధించలేకపోయాడు.

ఓపెన్ ఎరాలో..

నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఫ్రెంచ్ ఓపెన్‌కు ఒక ప్రత్యేకత ఉంది. మట్టికోర్టుపై ఆడాల్సి రావడమే ఇందుకు ప్రధాన కారణం. రెండున్నర దశాబ్దాల కాలంలో భాగంగా ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో రఫెల్ నాదల్‌కు తిరుగులేదు. 2005 నుంచి 2022 వరకు ఏకంగా 14సార్లు ఈ టైటిల్‌ను కైవసం చేసుకొని రఫెల్ నాదల్ రికార్డుపుటల్లోకెక్కాడు. 2000 ఏడాది నుంచి దాదాపు 2020 అంటే దాదాపు రెండు దశాబ్దాలపాటు టెన్నిస్ జగత్తును శాసించింది ఫెదరర్, జకోవిచ్, నాదల్ మాత్రమే. ఈ త్రయానికి ఒక్క ఏడాదిలో వరుసగా నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు దక్కిన దాఖలాలు లేవు. కనీసం రాబోయే కాలంలోనైనా సినర్ లేదా అల్కరాజ్ ఒక ఏడాదిలో వరుసగా నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించాలని కోరుకుందాం.

- స్పోర్ట్స్ డెస్క్



గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

పెన్షన్ వ్యాలిడేషన్ సవరణను రద్దు చేయాలి

పలు జిల్లాల్లో పెన్షనర్ల ఆందోళనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

కేంద్రంలో ఎనిమిదవ పే కమిషన్‌ను, రాష్ట్రంలో 12వ పే కమిషన్‌ను నియమించాలని, డిఎ బకాయిలు తక్షణం చెల్లించాలని, కాంప్రహెన్స్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీమును అమలు చేయాలని, కమ్యూటేషన్ రికవరీ కాలం 15 ఏళ్ల నుంచి 11 సంవత్సరాలకు తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల సంఘం ఆధ్వర్యాన పలు జిల్లాల్లో పెన్షనర్లు ఆందోళనలు చేపట్టారు. ఆర్థిక బిల్లుతో పాటు కేంద్రం ప్రవేశపెట్టిన పెన్షన్ వ్యాలిడేషన్ సవరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో పెన్షనర్ల సంఘ భవనం నుంచి ధర్నా చౌక్ వరకు ప్రదర్శన నిర్వహించారు. పెన్షన్‌దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ...సమాన విధులు నిర్వహించిన వారికి సమాన పెన్షన్ ఇవ్వాలన్న సుప్రీం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనుదారుల హక్కులకు, భద్రతకు ముప్పు తలపెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన పెన్షనర్ల వర్గీకరణ చట్టంపై రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్‌దారులు ఆందోళనలు చేపట్టారని తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నానుద్దేశించి ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మాట్లాడారు. ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్ పట్టాభి రామయ్య ధర్నాకు మద్దతు ప్రకటించి మాట్లాడారు. ధర్నాలో ప్రభుత్వ పెన్షన్ అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పెన్షనర్ల ఆందోళనకు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మద్దతు తెలిపారు. పెన్షనర్ల సమస్యను పరిష్కరించాలని, వారికి ఉన్నటువంటి చట్టాలను రద్దు చేయడం సబబు కాదన్నారు. ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రజారోగ్య వేదిక జిల్లా కార్యదర్శి రాజమోహన్ తదితరులు మద్దతుగా పాల్గొన్నారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ జంక్షన్ వద్దనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం భవనం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విజయనగరం జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. నంద్యాలలో బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

పాడి పరిశ్రమపై ట్రంప్ కన్ను

- పాల ఉత్పత్తులను అనుమతించాలని ఒత్తిడి
- జిఎం పశుగ్రాసం కోసం పట్టు
- టారిఫ్‌లను తగ్గించాలని ప్రధాన డిమాండ్
- ప్రమాదంలో 8 కోట్ల పాడి రైతుల జీవనాధారం
- చితికిపోనున్న డెయిరీ సహకార సంఘాలు



ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

భారత పాడి పరిశ్రమపై అమెరికా కన్ను వేసింది. తమ దేశం పాలు, పాల ఉత్పత్తులను భారత్‌లోకి ఎలాంటి ఆంక్షలు లేకుండా, తక్కువ సుంకాలతో అనుమతించాలని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ పట్టుబడుతున్నారు. నాలుగు రోజుల పాటు ఇరు దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చల్లో జిఎం విత్తనాలు అనుమతి సహా పాలు, పాల ఉత్పత్తులను అనుమతించాలని అమెరికా ప్రధానంగా డిమాండ్ చేస్తోంది. దీనిలో జన్యు మార్పిడి (జిఎం) పశుగ్రాసం కూడా ఉంది. తమ ఉత్పత్తులపై అధిక సుంకాలను తగ్గించాలని ఒత్తిడి చేస్తోంది. భారత్ ఏమాత్రం తలొగ్గినా భారత పాడి పరిశ్రమ దివాలా తీసే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇప్పటికే టారిఫ్‌లకు కోత..

దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ అమెరికాకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. అమెరికా నుండి పౌల్ట్రీ, గుడ్ల దిగుమతులపై ఉన్న నిషేధాన్ని మోడీ సర్కార్ 2023లో జరిగిన జి-20 సమ్మిట్‌లో ఎత్తివేసింది. అతిపెద్ద హోటళ్లలో ఉపయోగించే బ్లూబెర్రీస్, క్రాన్‌బెర్రీస్, ఫ్రోజెన్ టర్కీ, ఫ్రోజెన్ డక్‌లపై టారిఫ్‌లను 30 శాతం నుండి 5 - 10 శాతానికి తగ్గించింది. పెకాన్ నట్స్, బాదం, యాపిల్స్, చిక్‌పీస్, వాల్‌నట్‌లపై రిటాలియేటరీ టారిఫ్‌లను తొలగించింది. ఇది దిగుమతులను మరింత పెంచేలా చేసింది. గతేడాది 2024లో భారత్‌కు అమెరికా 1.5 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.13 వేల కోట్లు) విలువ చేసే వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసింది. ఈ ఎగుమతులను బహుళ రెట్లు పెంచుకోవడానికి వీలుగా జిఎం విత్తనాలను, పాలు, పాల ఉత్పత్తులను అనుమతించాలని పట్టుబడుతోంది.

రైతులకు జరిగే నష్టాలు..

- అమెరికా ఉత్పత్తులతో ధరల పోటీని తట్టుకోలేరు.
- స్థానిక రైతుల మార్కెట్ వాటా భారీగా తగ్గుతుంది.
- 8 కోట్ల పాడి రైతుల జీవనాదాయాలకు దెబ్బ
- జిఎం పశుగ్రాసంతో పశువులకు, రైతులకు ఆరోగ్య సమస్యలు
- సహకార సంస్థల ఆర్థిక స్థిరత్వంపై ప్రతికూలత
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతుంది.

రూ.20 లక్షల కోట్ల మార్కెట్‌పై దృష్టి

2022-23 నాటి గణాంకాల ప్రకారం.. భారత్ 230 మిలియన్ టన్నుల పాల ఉత్పత్తితో ప్రపంచంలో అతిపెద్ద పాల ఉత్పత్తి దేశంగా ఉంది. ఈ పరిశ్రమ విలువ దాదాపు రూ.16-18 లక్షల కోట్లుగా ఉందని అంచనా. ప్రతి ఏడాది 5 - 7 శాతం వరకు వృద్ధిని నమోదు చేస్తోంది. 2030 నాటికి ఈ పరిశ్రమ విలువ రూ.20 - 25 లక్షల కోట్లకు చేరనుందని ఆ రంగం నిపుణుల అంచనా. ఈ రంగంపై చిన్న, సన్నకారు రైతులు ఎక్కువగా ఆధారపడ్డారు. దాదాపు రూ.20 లక్షల కోట్ల విలువ చేసే భారత డెయిరీ రంగంలో తమ ఉనికిని చాటుకోవాలని అమెరికా ఎప్పటి నుంచో భావిస్తోంది. ఇక్కడి అనేక ప్రభుత్వ, ప్రయివేటు, రైతుల సహకార సంస్థలు స్థానిక రైతులకు మద్దతును అందిస్తున్నాయి. ఆర్గానిక్ (సేంద్రియ) పాల ఉత్పత్తులతో భారత మార్కెట్ పటిష్టంగా ఉంది. అమెరికా డెయిరీ ఉత్పత్తులపై సుంకాలను తగ్గిస్తే.. అవి చౌకగా మారి పాడి రైతులను సహకార సంఘాలను నిర్వీర్యం చేయనున్నాయి. ఈ రంగంపై ఆధారపడిన 8 కోట్ల మంది పాడి రైతుల ఉపాధిపై తీవ్ర ప్రభావం పడనుంది.

రైతుల దివాలానే..!

పాల ఉత్పత్తిలో అమెరికా రెండో అతిపెద్ద దేశంగా ఉంది. అక్కడ అధిక ఆటోమేషన్, ఆధునిక సాంకేతికత, జన్యు మార్పిడి పశుగ్రాసం వాడకం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ పాల ఉత్పత్తి జరుగుతోంది. అక్కడ సగటు లీటర్ ధర రూ.25-35 (0.30-0.40 డాలర్లు)గా ఉంది. దీంతో చీజ్, వెన్న, పాల పొడి వంటి ఉత్పత్తులు చౌకగా లభిస్తాయి. భారత్‌లో లీటర్ పాల సగటు ధర రూ.45-70గా ఉంది. దేశంలోని గేదెలు రోజుకు సగటున 8-12 లీటర్ల పాలను ఇస్తాయి. అమెరికాలో గేదెలకంటే ఆవులు ఎక్కువగా ఉంటాయి. అక్కడి ఆవులు రోజుకు ఏకంగా 25-40 లీటర్ల పాల దిగుబడిని కలిగి ఉన్నాయి.

గడ్డి కూడా కొనాలా..?

అమెరికాలో జన్యు మార్పిడి (జిఎం) పశుగ్రాసాలు అయినా సోయాబీన్ మీల్, డిస్టిలర్స్ డ్రైడ్ గ్రెయిన్స్ విత్ సోల్యూబుల్స్ (డిడిజిఎస్), జిఎం మొక్కజొన్న ఉపయోగిస్తున్నారు. వీటిని భారత్‌లోకి అనుమతించాలని డిమాండ్ చేస్తోంది. వీటికి సంబంధించిన విత్తనాలపై స్పష్టత లేదు. వీటిలో కొన్ని జిఎం ఉత్పత్తులను అనుమతించడానికి భారత్ సానుకూలంగా ఉందని రిపోర్టులు వస్తున్నాయి. జిఎం పశుగ్రాసం వల్ల పశువుల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. గుజరాత్‌లో బిటి పత్తి విత్తనాల వాడకం వల్ల ఆవుల సంతానోత్పత్తి సమస్యలు, మానవ ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావాలు చోటు చేసుకున్నాయనే ఆందోళనలు ఉన్నాయి.

అధిక సుంకాలతోనే రక్షణ..

ప్రస్తుతం అమెరికా డెయిరీ ఉత్పత్తులపై 30-60 శాతం సుంకాలు అమల్లో ఉన్నాయి. వీటిని ఎత్తివేస్తే అమెరికా ఉత్పత్తులతో పోటీ పడలేక స్థానిక రైతులు తీవ్రంగా నష్టపోతారు.

- అమెరికా పాలు, పాల ఉత్పత్తులపై 30-60 శాతం సుంకాలను కొనసాగించాలి.
- అవసరమైతే మరింత టారిఫ్‌లను పెంచాలి.
- భారత రైతులకు ఎక్కువ ఆర్థిక సహాయం అందించాలి.
- డెయిరీ రంగంలో ఆధునిక సాంకేతికత యంత్రాలు కల్పించాలి.
- క్రాస్‌బ్రీడ్ గేదెల వాడకం ద్వారా పాల దిగుబడిని పెంచాలి.
- సహకార సంస్థలను బలోపేతం చేయాలి.
- రైతులకు న్యాయమైన ధరలు, మార్కెట్ అవకాశాలను కల్పించాలి.

తుళ్లూరులో హైకోర్టు లాయర్ దంపతుల కిడ్నాప్‌నకు యత్నం

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు ఎస్‌సి కాలనీలో సోమవారం రాత్రి హైకోర్టు న్యాయవాది మేరిగ మోహన్‌రావు దంపతులను కిడ్నాప్ చేయడానికి ముగ్గురు దుండగులు యత్నించడం కలకలం రేపింది. బాధిత న్యాయవాది మోహన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మోహన్‌రావు సోమవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఇంట్లో ఉండగా గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు కేసు విషయమై మాట్లాడాలంటూ ఇంట్లోకి వచ్చారు. అనంతరం కత్తితో బెదిరిస్తూ మోహన్‌రావు, ఆయన భార్య జ్యోతి చేతులను తాళ్లతో కట్టి నోటికి టేపు అంటించారు. మోహనరావు చేతికి గాయం చేశారు. అనంతరం వారిని మోహన్‌రావు కారులోనే ఎక్కించారు. అయితే చాకచక్యంగా వ్యవహరించిన మోహన్‌రావు వారి నుండి తప్పించుకుని కారులో నుండి బయటపడ్డాడు. అనంతరం పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు గుమ్మిగూడారు. దీంతో కిడ్నాపర్లు పరారయ్యారు. ఈ మొత్తం వ్యవహారం సిసి కెమెరాల్లో రికార్డయ్యింది. ఆస్తి వివాదం నేపథ్యంలో తన చెల్లెలి కుమారుడి ప్రోద్బలంతో తనపై ఈ దాడి జరిగిందని మోహన్‌రావు చెబుతున్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్టు సమాచారం.

అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఎఫ్ఎల్ఎన్

- పాఠశాల విద్య సమీక్షలో మంత్రి లోకేష్ ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థి అభ్యసన సామర్థ్యాల పెంపునకు గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ) కార్యక్రమం చేపట్టాలని అధికారులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉపాధ్యాయుల సహకారంతో ప్రాథమిక స్థాయిలోనే దీనిని నిర్వహించాలని తెలిపారు. ఉండవల్లిలోని తన నివాసంలో పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్యపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల విడుదల చేసిన పరాక్ సర్వేలో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ర్యాంకులను మెరుగుపర్చేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అకడమిక్ ఫోరమ్‌లను బలోపేతం చేసి, ఉపాధ్యాయులను ప్రేరేపించడం ద్వారా అభ్యసన ఫలితాలు మెరుగుపర్చాలన్నారు. రాష్ట్రంలో హైస్కూల్ ప్లస్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమీక్ష అనంతరం ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేయనున్న స్పోర్ట్స్ కిట్‌ను మంత్రి పరిశీలించారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, కమిషనర్ విజయరామరాజు, సమగ్రశిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్

యువత, పరిశ్రమలను అనుసంధానించేలా కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న నైపుణ్యం పోర్టల్‌ను ఆగస్టు నాటికి పూర్తిచేసి సెప్టెంబర్ ఒకటిన ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధిశాఖ అధికారులతో సమీక్షలో భాగంగా ఆయన మాట్లాడారు. జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్‌ను జిల్లా ఎంప్లాయిమెంట్ అండ్ స్కిల్ ఆఫీసర్‌గా మార్చాలని చెప్పారు. వారి ఆధ్వర్యాన జాబ్ మేళాలు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధిశాఖ కార్యదర్శి కోన శశిధర్, స్కిల్ డెవలప్‌మెంట్ ఎమ్‌డి జి గణేష్, కళాశాల విద్య డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలు ఆగాల్సిందే!

- కొత్త రేషన్ కార్డులపై ప్రతిష్టంభన
- రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్న పేదలు
- నూతన పింఛన్ల మంజూరుకు దక్కని అవకాశం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ప్రభుత్వం గత రెండు నెలలుగా దరఖాస్తులను స్వీకరిస్తోంది. అయితే, కొత్త రేషన్ కార్డులను దరఖాస్తుదారులకు అందజేయడానికి ఆరు నెలలు పట్టనున్నాయి. తహశీల్దార్ల లాగిన్‌లో అనుమతి ఇచ్చిన తర్వాత కార్డుల జారీకి ఆరు నెలల సమయం తీసుకుంటుంది. ఈ పద్ధతి గత వైసిపి ప్రభుత్వం నుంచి కొనసాగుతోంది. వైసిపి ప్రభుత్వంలో ఏడాదికి రెండుసార్లు చొప్పున జనవరి, జులైల్లో కొత్త కార్డులు జారీ అయ్యాయి. 2023 జులై వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. ఆ తర్వాత ఈ ప్రక్రియ నిలిచిపోయింది. 2024లో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం దాదాపు ఏడాదిపాటు కొత్త కార్డుల జారీపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. ప్రతిపక్షాల విమర్శలు, ప్రజల ఒత్తిడి పెరగడంతో మే 7వ తేదీ నుంచి కొత్త కార్డుల జారీకి సచివాలయాల్లో దరఖాస్తుల సేకరణ ప్రక్రియ ప్రారంభించింది. గత రెండు నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1.60 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరితోపాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చేందుకు మరో ఐదు లక్షల వరకు దరఖాస్తులు వచ్చాయి. చిరునామా మార్పులు, కుటుంబ విభజన, కుటుంబ సభ్యుల తొలగింపునకు మరో 1.10 లక్షల దరఖాస్తులు అందాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 1.40 కోట్ల రేషన్ కార్డులున్నాయి. కొత్త దరఖాస్తులను ప్రభుత్వం ఆమోదిస్తే వీటి సంఖ్య పెరగనుంది. అయితే, దరఖాస్తులను ఆమోదించిన తర్వాత ఒక నెంబరును తహశీల్దార్లు కేటాయిస్తున్నారు. దీనికి 'టి' నెంబరు అని పేరు పెట్టారు. ఈ నెంబరు వచ్చిన తర్వాత ఆరు నెలలకు కొత్త రేషన్ కార్డు జారీ కానుంది. గత ప్రభుత్వం అమలులోకి తెచ్చిన విధానాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని రెవెన్యూ అధికారులు చెబుతు న్నారు. కొత్త కార్డుల దరఖాస్తుదారులు ఆరు నెలల ఆగాల్సిందేనని అంటున్నారు. అంటే, దాదాపు డిసెంబరులో జారీ అయ్యే అవకాశం ఉంది. గత వైసిపి ప్రభుత్వం జారీ చేసిన బియ్యం కార్డుల స్థానంలో స్మార్టు కార్డులు ఇస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇప్పటికే ప్రకటించారు. జూన్ మొదటి వారంలోనే కొత్త స్మార్టు కార్డులు వస్తాయని చెప్పినా ఇంతవరకు పంపిణీ ప్రారంభం కాలేదు. మరోవైపు కొత్త రేషన్ కార్డుల జారీలో జాప్యం వల్ల దాదాపు రెండేళ్లుగా అర్హులు ప్రభుత్వ పథకాలకు దూరం అవుతున్నారు. ప్రధానంగా వితంతువులు, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, ఇతర సామాజిక పింఛన్లు పొందేందుకు అర్హత కలిగిన వారు బియ్యం కార్డులు లేకపోవడంతో పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. టిడిపి కూటమి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం మాదిరిగానే ఆరెంచెల విధానాన్ని అమలు చేయడంతో చాలామంది పేదలు సంక్షేమ పథకాలు పొందలేకపోయారు. 2023కు ముందే బియ్యం కార్డులు ఉన్నా, గత ఏడాది కాలంగా కొత్తగా సామాజిక పింఛన్లు ఇవ్వకపోవడం వల్ల వితంతువులు, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు తీవ్రంగా నష్టపోతున్నారు.

గృహ నిర్మాణ శాఖలో అంతా గోప్యతే!

- అడ్వాన్స్‌ల పేరుతో కాంట్రాక్టు సంస్థలకు నిధులు
- విజిలెన్స్ నివేదిక పేరుతో కాలయాపన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పేదల సొంతింటి కలను ఆదాయ వనరుగా మార్చుకోవడం పాలక పార్టీలు అలవాటుగా మార్చుకున్నాయనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆప్షన్-3 ఇంటి నిర్మాణాల పేరుతో జరిగిన అవినీతి, అడ్వాన్స్‌ల పేరుతో నిర్మాణ సంస్థలకు ముందస్తు చెల్లింపులు, జగనన్న కాలనీలకు భూముల కొనుగోలులో వాస్తవ ధరను కప్పిపుచ్చి అధిక ధరల పేరుతో ప్రభుత్వ ఖజానాకు గండికొట్టడం, నాణ్యత లేకుండా నిర్మాణాలు చేపట్టడం వంటి వాటిపై చర్యలు తీసుకునేందుకు కూటమి ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తోంది.

విజిలెన్స్ విచారణకు ఆదేశించి ఏడాది దాటినప్పటికీ ఆ నివేదికను బహిర్గత పర్చకపోవడం వెనుక కూటమి పార్టీల్లోని ఓ కీలక నేత ఉన్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో విజిలెన్స్ నివేదిక పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందనే పలువురు విమర్శిస్తున్నారు. 2019-24 మధ్య ఇంటి నిర్మాణాల కాంట్రాక్టులన్నీ ఆనాటి పాలకవర్గానికి చెందిన వారి సంస్థలే అధికంగా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు నెల్లూరు, పులివెందుల, అనంతపురం, ఉభయ గోదావరి జిల్లాలకు సంబంధించిన విజిలెన్స్ నివేదిక ప్రభుత్వానికి అందినట్లు తెలిసింది. ఆ నివేదిక ఇంకా తమకు అందలేదంటూ పాలకవర్గాలు, అధికారులు పేర్కొంటున్నారు. పాలకపక్ష నేతలు కూడా విజిలెన్స్ విచారణ, నివేదికలో బయటపడ్డ విషయాల గురించి మౌనం దాల్చుతున్నారు. జగనన్న కాలనీలకు సేకరించిన భూముల కొనుగోలు విషయంలో రూ.కోట్లు చేతులు మారినట్లు గతంలో కూటమి నేతలు పలు సందర్భాల్లో ఆరోపణలు చేశారు. ముఖ్యంగా ఇంటి నిర్మాణాల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పూర్తి స్థాయిలో పాటించకపోవడం, ఇనుము, సిమెంటు దారిమళ్లించడం పెద్దయెత్తున జరిగినట్లు ప్రచారం జరిగినా.. అధికారంలోకి వచ్చిన అనంతరం ఈ విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా స్పందించిన దాఖలాల్లేవు. ఒకట్రెండు చోట్ల అధికారులు స్పందించి షోకాజ్ నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నట్లు తెలిసింది. ఒకరిద్దరు క్షేత్రస్థాయి అధికారులను సస్పెండ్ చేసినా మళ్లీ వారికి పోస్టింగ్ ఇచ్చినట్లు సమాచారం.



రోడ్డును శ్రమదానంతో బాగు చేసుకుంటున్న గిరిజనులు

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - రోలుగుంట (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ కొండశిఖర గ్రామమైన పెద్దగరువు రోడ్డును మంగళవారం స్థానిక గిరిజనులు శ్రమదానంతో అభివృద్ధి చేసుకున్నారు. గ్రామంలో 12 కుటుంబాలు జీవిస్తున్నాయి. భారీ వర్షాలకు ఈ రోడ్డు కొట్టుకుపోవడం తో పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పడ్డాయి. దీంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో వారంతా ఏకమై ఆ రోడ్డును బాగు చేసుకున్నారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో అంబులెన్స్ వంటి వాహనాలు రావడం లేదని, డోలీ మోతలు తప్పడం లేదని, ఇప్పటికైనా స్పందించి నాణ్యమైన రోడ్డును ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.గోవిందరావు డిమాండ్ చేశారు.



ఇజ్రాయిల్ దాడిలో చనిపోయిన పాలస్తీనియన్లను తీసుకెళ్తున్న బంధువులు

యుద్ధోన్మాద మత్తు వీడని ఇజ్రాయిల్

- 49 మంది మృతి

గాజా : అంతర్జాతీయ సమాజం నుండి తీవ్రంగా నిరసనలు ఎదురవుతున్నా పట్టించుకోకుండా ఇజ్రాయిల్ యుద్ధోన్మాద మత్తు వీడటం లేదు. గాజాపై యథేశ్చగా అమానవీయ దాడులు కొనసాగిస్తూనేవుంది. లెబనాన్, సిరియాలపైనా బాంబు దాడులతో విరుచుకుపడుతోంది. తూర్పు లెబనాన్‌లోని బెకా లోయలో శరణార్థ శిబిరంపై జరిపిన వైమానిక దాడుల్లో 12 మంది చనిపోయారు. మరో 8 మంది గాయపడ్డారని లెబనాన్ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. సిరియాలోని సువాయ్‌డా ప్రాంతంపై కూడా బాంబు దాడులు జరపగా ఏడుగురు సిరియన్లు మరణించారు. మంగళవారం నాటి దాడుల్లో గాజాలో 30 మంది మరణించారు. ఉత్తర గాజాలోని 16 ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు తక్షణమే ఖాళీ చేసి వెళ్ళిపోవాలని ఇజ్రాయిల్ ఆర్మీ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని సెటిలర్లు బుర్ఖా గ్రామంలో పాలస్తీనియన్ల వాహనాలకు, వారి ఇళ్ళకు నిప్పంటించారు. ఇజ్రాయిల్ పాల్పడుతున్న ఈ హింసకు తక్షణమే స్వస్తి పలకాలని కోరుతూ చర్చి నేతలు, 20కి పైగా దేశాల దౌత్యవేత్తలు తైబే పట్టణంలో సమావేశమయ్యారు. ఈ సమావేశం జరిగిన కొద్ది గంటలకే సెటిలర్ల హింస మొదలైంది.

ఇటీవలి వారాల్లో తూర్పు జెరూసలేంతో సహా ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్లపై దాడులు, వేధింపులు, వారిని హత్య చేయడం వంటివి ఉధృతమయ్యాయని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం హెచ్చరించింది. ఇప్పటివరకు 964మంది పాలస్తీనియన్లు మరణించగా, దాదాపు మూడువేలకు పైగా ఇళ్ళను కూల్చివేశారు. గాజాలో ఆహార శిబిరాల వద్ద జరిగిన దాడుల్లో మరణించిన వారి సంఖ్య 875కి చేరుకుందని ఐక్యరాజ్య సమితి కార్యాలయం తెలిపింది. ప్రతి పదిమంది పిల్లల్లో ఒకరు పోషకాహార లోపంతో తీవ్రంగా బాధపడుతున్నారని యుఎన్ఆర్‌డబ్ల్యుఎ వెల్లడించింది. ఇదిలావుండగా, కాల్పుల విరమణకు ఉద్దేశించి జరుగుతున్న చర్చలు నిలిచిపోలేదని, జరుగుతున్నాయని, కానీ చాలా ప్రారంభ దశలో వున్నాయని కతార్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.



కోర్టు విచారణకు హాజరై వెళ్తున్న రాహుల్‌గాంధీ

పరువునష్టం కేసులో రాహుల్‌గాంధీకి బెయిల్

లక్నో : ఆర్మీ సిబ్బందిపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి నమోదైన పరువునష్టం కేసులో కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీకి లక్నో కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ తరుపు న్యాయవాది ప్రాన్షు అగర్వాల్ మీడియాకు తెలిపారు. ఈ కేసు విచారణ కోసం లక్నోలోని ఎంపి- ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు మంగళవారం హాజరయ్యారు. జడ్జి గదికి న్యాయవాది రాహుల్‌గాంధీని తీసుకుని వెళ్లారు. అక్కడ బెయిల్ బాండ్, పూచీకత్తు దాఖలు చేయడం వంటి లాంఛనాలను రాహుల్‌గాంధీ పూర్తి చేశారు. రాహుల్ వెంట ఉత్తరప్రదేశ్ పిసిసి అధ్యక్షులు అజయ్ రాయ్, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అవినాష్ పాండే ఇతర నాయకులు ఉన్నారు. రాహుల్ గాంధీ హాజరు సందర్భంగా కోర్టు ప్రాంగణం, చుట్టుపక్కల ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. 2022 డిసెంబరు 16న భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ భారత్ సైనికుపై చైనా సైనికులు దాడి చేశారని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు భారత సైనికుల మనోభావాలను దెబ్బతీసేవిగా ఉన్నాయని బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ రిటైర్డ్ డైరెక్టర్ (ఆర్మీలో కల్నల్ హోదాకు సమానం) ఉదయ్ శంకర్ శ్రీవాస్తవ పరువునష్టం కేసు దాఖలు చేశారు. ఈ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక కోర్టు రాహుల్‌గాంధీకి సమన్లు జారీ చేసింది. ఈ కేసులో హైకోర్టును రాహుల్‌గాంధీ ఆశ్రయించారు. కానీ అక్కడ ఉపశమనం లభించలేదు.

ఖరీదైన నగరాలుగా సింగపూర్..లండన్

న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన నగరంగా సింగపూర్ నిలిచింది. జూలియస్ బేర్ వార్షిక నివేదిక ప్రకారం వరుసగా మూడో ఏడాది ఈ ఘనతను సింగపూర్ దక్కించుకుంది. కాగా ఇప్పటివరకు రెండో స్థానంలో ఉన్న హాంగ్‌కాంగ్‌ను పక్కకు నెట్టి ఆ స్థానాన్ని లండన్ కైవసం చేసుకుంది. హాంగ్‌కాంగ్ మూడో స్థానానికి పరిమితమైంది. కనీసం 10 లక్షల డాలర్ల బ్యాంక్ బ్యాలెన్స్ కలిగిన వ్యక్తులు కొనుగోలు చేస్తున్న వివిధ రకాల ఉత్పత్తులు, వారు అనుభవిస్తున్న విలాసాల ఆధారంగా వారి జీవన వ్యయాన్ని జూలియస్ బేర్ లైఫ్‌స్టైల్ ఇండెక్స్ విశ్లేషించి.. ఈ నివేదికను రూపొందించింది. జ్యూరిచ్ సహా ఇతర ఐరోపా నగరాలు కూడా తమ ర్యాంకింగ్స్‌లో మెరుగుపడ్డాయి. ఆ నివేదిక ప్రకారం మొదటి ఖరీదైన పది నగరాల్లో వరుసగా సింగపూర్, లండన్, హాంగ్‌కాంగ్, షాంఘై, మొనాకో, జ్యూరిచ్, న్యూయార్క్, పారిస్, సావో పౌలో, మిలాన్ వున్నాయి.

తమిళనాడులో 'ఉంగలదాన్ స్టాలిన్' ప్రారంభం

- ప్రజల వద్దకే ప్రభుత్వ ప్రతినిధులు : 45 రోజుల్లో సమస్యకు పరిష్కారం



కడలూర్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్

కడలూర్ : తమిళనాడులో 'ఉంగలదాన్ స్టాలిన్' (మీ వెంటే స్టాలిన్) కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మంగళవారం ప్రారంభించారు. కడలూర్ జిల్లాలోని చిదంబరంలో ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ఆది- ద్రవిడలు, ఎస్‌టిల అభ్యున్నతికి అనేక పథకాలను ప్రారంభించింది.. అమలు చేసింది.. 'ద్రవిడ నమూనా ప్రభుత్వమే' అని చెప్పారు. అయితే లక్ష్యాల సాధనలో అనేక మైళ్లు ప్రయాణించాల్సివుందని చెప్పారు. ఉంగలదాన్ స్టాలిన్ కార్యక్రమం కింద రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పది వేలకు పైగా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటిల్లో వివిధ విభాగాలకు చెందిన 46 సేవలు అందుబాటులో ఉంటాయని, 45 రోజుల్లో సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అంతేకాకుండా ప్రతీ శిబిరంలో వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. శిక్షణ పొందిన వలంటీర్లు ప్రతీ ఇంటికి వెళ్లి ఈ శిబిరాలు ప్రారంభించే తేదీ, ప్రదేశాల గురించి ప్రజలకు తెలియజేస్తారని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే వివిధ ప్రభుత్వ పథకాలు, సేవలను పొందడానికి అవసరమైన పత్రాలను కూడా అందిస్తారని చెప్పారు. కాగా, ఈ కార్యక్రమం సందర్భంగా చిదంబరంలో తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టిఎన్‌సిసి) మాజీ అధ్యక్షులు, షెడ్యూలు తరగతికి చెందిన ప్రముఖ నాయకుడు ఎల్ ఇలయపెరుమాళ్ స్మారక మందిరాన్ని, విగ్రహాన్ని స్టాలిన్ ప్రారంభించారు. తమ ప్రభుత్వం అధికారిక రికార్డుల నుంచి కాలనీ (ఎస్‌సిల నివాసాన్ని సూచిస్తుంది) అనే పదాన్ని తొలగించిందని, ఈ పదం అణచివేత, అంటరానితనాన్ని సూచిస్తోందని, అందుకనే తొలగించామని తెలిపారు. పాఠశాల రోజుల నుంచే అంటరానితనానికి వ్యతిరేకంగా ఇలయపెరుమాళ్ ఆందోళన చేశారని, సైన్యంలో చేరిన తరువాత కూడా ఉన్నతాధికారుల వివక్షను ప్రశ్నించారని గుర్తు చేశారు. ఎస్‌టి, ఎస్‌సి (దాడుల నివారణ) చట్టం అమలుకు ఆయన కృషే కారణమని చెప్పారు. అలాగే, కడలూరు జిల్లాలోని కొడుక్కన్‌పాళయంలో రూ 75 కోట్ల పెట్టుబడితో పాదరక్షల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ యూనిట్‌తో దాదాపు 12 వేల మంది మహిళలకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎంఆర్‌కె పన్నీర్ సెల్వం, కెఎన్ నెహ్రూ, సివి గణేశన్, ఎంపి సామినాథన్, విడుతలై చిరుతైగల్ కట్చి అధ్యక్షులు- చిదంబరం ఎపి థోల్ తిరుమవలవన్, ఎంపీలు ఎంకె విష్ణు ప్రసాద్, రవికుమార్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

టమాటాలనూ వదలని ట్రంప్

- మెక్సికో దిగుమతులపై 17 శాతం సుంకం
- మండిపడుతున్న డెమొక్రాట్లు

వాషింగ్టన్ : కాదేదీ సుంకానికి అనర్హం అన్నది అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధానం. ప్రజలు విరివిగా ఉపయోగించే టమాటాలను కూడా ఆయన వదలడం లేదు. మెక్సికో నుండి దిగుమతి అవుతున్న తాజా టమాటాలపై ఆయన ఏకంగా 17 శాతం సుంకం విధించారు. తద్వారా మూడు దశాబ్దాల క్రితం కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకున్నారు. యాంటీ-డంపింగ్ సుంకాల నుండి టమాటాలను మినహాయించాలని అప్పట్లో ఇరు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. అయితే ట్రంప్ ప్రభుత్వం సోమవారం ఆ ఒప్పందం నుండి వైదొలిగింది. ఆగస్ట్ 1వ తేదీ నాటికి అమెరికాతో మెక్సికో వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సి ఉంది. లేకుంటే మెక్సికో ఉత్పత్తులపై 30 శాతం సుంకం విధిస్తారు.

'మా గొప్ప భాగస్వాములలో మెక్సికో కూడా ఒకటి. అయితే ఇంకెంతో కాలం అది అలా ఉండలేదు. ఆ దేశం అనుసరిస్తున్న అవాంఛనీయ వాణిజ్య విధానాల కారణంగా మా రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఆ విధానాల ఫలితంగా టమాటాల వంటి మా ఉత్పత్తుల ధరలు తగ్గిపోతున్నాయి' అని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లట్నిక్ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ రోజుతో అదంతా ముగిసిపోయింది. ట్రంప్ వాణిజ్య విధానాలు, మెక్సికో పట్ల మా వైఖరి కారణంగా నిబంధనలు మారాయి' అని చెప్పారు. 90 రోజులలో ఒప్పందం నుండి వైదొలుగుతామని అమెరికా వాణిజ్య శాఖ ఏప్రిల్‌లోనే ప్రకటించింది. మెక్సికో దిగుమతుల ధరలు అన్యాయంగా ఉంటున్నాయని, వాటి నుండి అమెరికా టమాటా ఉత్పత్తిదారులను కాపాడడంలో ఈ ఒప్పందం విఫలమైందని తెలిపింది. అమెరికాలో ఉపయోగిస్తున్న టమాటాలలో 70 శాతం వరకూ మెక్సికో నుండే సరఫరా అవుతున్నాయి. 1994లో ఇది కేవలం 20 శాతంగా ఉండేదని ఫ్లోరిడా టమాటా ఎక్స్ఛేంజ్ తెలిపింది. కాగా అమెరికా చర్యను మెక్సికో ఆర్థిక, వ్యవసాయ మంత్రిత్వ శాఖలు ఖండించాయి. ఇది మెక్సికో ఉత్పత్తిదారుల ప్రయోజనాలనే కాకుండా అమెరికా పరిశ్రమ ప్రయోజనాలను కూడా దెబ్బతీస్తుందని విమర్శించాయి. కాగా సుంకాల విధింపును డెమొక్రాట్లు కూడా తప్పుపట్టారు. దీనివల్ల ధరలు పెరుగుతాయని, ఉద్యోగులు ఉపాధి కోల్పోతారని హెచ్చరించారు. ట్రంప్ నిర్ణయం యాభై వేల ఉద్యోగాలను హరిస్తుందని, ప్రజలపై ధరల భారం పెరుగుతుందని తెలిపారు. ట్రంప్ చర్య ఫ్లోరిడా రైతులకు మాత్రమే ఉపయోగపడుతుందని, అరిజోనా వ్యాపారవేత్తలు, ప్రజలు ఎక్కువ ధరలు చెల్లించాల్సి వస్తుందని, ఇదంతా ట్రంప్ ప్రభుత్వ నిర్లక్ష్య వాణిజ్య యుద్ధం ఫలితమేనని వారు మండిపడ్డారు.

ఐదేళ్లలో 65 విమాన ఇంజన్ వైఫల్యాలు : డిజిసిఎ

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో 65 విమాన ఇంజిన్ వైఫల్యాలు చోటు చేసుకున్నాయి. గతేడాది జనవరి 1 నుండి ఈ ఏడాది మే 31 వరకు 11 మే డే కాల్స్ నమోదయ్యాయి. అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదం నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) విడుదల చేసిన ఓ నివేదిక ఈ అంశాలను వెల్లడించింది. అయితే 11 మే డే కాల్స్ వచ్చినప్పటికీ పైలట్లు చాకచక్యంగా వ్యవహరించి ఆయా విమానాలను సురక్షితంగా ల్యాండ్ చేయడంతో ప్రమాదాలు తప్పాయని ఆ నివేదిక పేర్కొంది.

విమాన ప్రమాదాలకు ఇంధన ఫిల్టర్లు బ్లాక్ అవ్వడం, టర్బైన్ లోపాలు, ఇంధన కాలుష్యం, ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోవడం వంటివి ప్రధాన కారణాలుగా ఉంటున్నాయని భారత పైలట్ల సమాఖ్య అధ్యక్షులు కెప్టెన్ సిఎస్ రాంధవా పేర్కొన్నారు. డిజిసిఎ ఎయిర్ సేఫ్టీ డైరెక్టర్ జోసెఫ్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా విమానాల్లో సాంకేతిక సమస్యలు చోటు చేసుకుంటున్నప్పటికీ.. భారత విమానయాన సంస్థలకు చెందిన విమానాల్లో తరచూ ఇలాంటి సమస్యలు గుర్తిస్తుండటం ఆందోళనకరమైన అంశమన్నారు. అహ్మదాబాద్ ప్రమాదంపై ప్రాథమిక నివేదిక వచ్చిన నేపథ్యంలో భారతీయ విమానయాన సంస్థలు ఎదుర్కొంటున్న లోపాలపై డిజిసిఎ దృష్టి పెట్టిందని జోసెఫ్ తెలిపారు.

చైనా జిడిపి 5.2% వృద్ధి

- ఒత్తిళ్ల మధ్య స్థిరమైన పురోగతి
- అంచనాలకి మించి నమోదు
- అమెరికాలో పెరిగిపోయిన ద్రవ్యోల్బణం

బీజింగ్ : ప్రపంచ దేశాలన్ని వాణిజ్య యుద్ధంతో సతమతమవుతుంటే చైనా సవాళ్లను ఎదుర్కోంటూ వృద్ధిని సాధించింది. మొదటి త్రైమాసికంలో స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) 5.2% నమోదు చేసుకుందని నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (ఎన్‌బిఎస్) మంగళవారం ప్రకటించింది. " ఆర్థిక ఒత్తిళ్ల చుట్టుముట్టినా వాటన్నంటిని అధిగమించి , అంచనాలకు మించి చైనా ఆర్థిక వ్యవస్థ గణనీయమైన పురోగతిని సాధించిందని " బ్యూరో డిప్యూటీ హెడ్ షెంగ్ లైయిన్ విలేకర్లకు తెలిపారు.

సవాళ్లను సానుకూలంగా మార్చుకుని :

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతీకార సుంకాల పేరుతో చైనాపై 145 % పన్నులు విధించిన సంగతి తెలిసిందే. చాలా దేశాలు అమెరికా ఒత్తిడికి లొంగిపోగా చైనా ధీటుగా నిలబడింది. అమెరికా ప్రకటించిన వాణిజ్య యుద్ధంలో విజేతలు ఎవ్వరూ ఉండరని, అందరికి నష్టమని చైనా ప్రకటించినా అమెరికా పట్టించుకోలేదు. ఎట్టకేలకు ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. అయితే అమెరికా వాణిజ్యంపై ఆధారపడకుండా చైనా ప్రత్యామ్నాయ మార్కెట్లను ఏర్పరుచుకుంది. దేశీయ మార్కెట్‌ను పెంచుకుంది. ట్రంప్ సుంకాల నేపథ్యంలో అమెరికాకు చైనా ఎగుమతులు 10.9% తగ్గిపోయినా, మరోవైపు ఆగ్నేయాసియా13% , ఇయు దేశాల ఎగుమతులు 6.6 % పెరిగాయని సిఎన్‌బీసి తెలిపింది.



చైనాలోని షాన్‌డాంగ్ ప్రావిన్సులో ఝౌపింగ్ సిటీలోని ఒక ఫ్యాక్టరీలో అసెంబ్లింగ్‌లో నిమగ్నమైన రోబోలు

ఎన్‌బిఎస్ విడుదల చేసిన డేటా ప్రకారం చైనా ట్రేడ్ ఇన్ కార్యక్రమం ద్వారా దేశీయ వినియోగాన్ని ప్రోత్సహించింది. దీంతో సొంత మార్కెట్ డిమాండ్ 68.8% పెరిగింది. ఇది జిడిపి పెరుగుదలకు చోదకశక్తిగా ఉపయోగపడింది. ఈ సంవత్సరం మొదటి ఐదు నెలల్లో ట్రేడ్ ఇన్ కార్యక్రమం ద్వారా 1.1 ట్రిలియన్ యువాన్ల అమ్మకాలు జరిగాయని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

మరోవైపు అమెరికా ద్రవ్యోల్బణం పెరిగిపోయిందని నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (ఎన్‌బిఎస్) డేటా స్పష్టం చేస్తుంది. ఎన్‌బిఎస్ విడుదలచేసిన డేటా ప్రకారం వినియోగదారుల ధరల సూచి గత సంవత్సరం కంటే 2.7% పెరిగింది. ఇది ఇలా ఉండగా రష్యా , యూరోపియన్ యూనియన్ , ఇతర దేశాలపై ఆగష్టు 1 నుండి అధిక సుంకాలు విధిస్తే ధరలు మరింత పెరిగిపోతాయని, ట్రంప్ విధించిన సుంకాల ప్రభావం అమెరికాపై ప్రతికూలంగా పడిందని, ఇది మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ నినాదానికి రివర్స్‌లో ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.



పెరూలో 3,800 ఏళ్లనాటి పురాతన కోట పునఃప్రారంభం

లిమా : ప్రపంచంలోనే అత్యంత పురాతన నాగరికతల్లో ఒకటైన కారల్ నాగరికతకు చెందిన కోటను సందర్శకుల కోసం తిరిగి తెరిచారు. 3800 ఏళ్ళనాటి ఈ కోటను ఎనిమిదేళ్ళ పాటు సమగ్ర మరమ్మత్తులు చేపట్టి, పర్యాటకుల కోసం సిద్ధం చేశారు. పెనికో పురావస్తు ప్రాంతాన్ని ఆనాటి కీలకమైన వాణిజ్య కేంద్రంగా పరిశోధకులు గుర్తించారు. లిమాకు ఉత్తరంగా 180 కిలోమీటర్ల దూరంలోని సుపే లోయలో ఈ కోట వుంది. పసిఫిక్ మహా సముద్రానికి కేవలం 19కిలోమీటర్లు మాత్రమే దూరం. 2017లో ఇక్కడ తవ్వకాలు ఆరంభమయ్యేవరకు ఇదొక అద్భుతమైన కొండ ప్రాంతాల ప్రకృతి రమణీయతకు, దృశ్యాలకు నెలవుగా వుండేది. క్రీస్తు పూర్వం 3000-1800 మధ్య కారల్ నాగరికత పరిఢవిల్లింది. ఈ నాగరికత పతనానికి సంబంధించిన కీలక సమాచారం ఈ ప్రాంతంలో లభ్యమవుతుందని పురావస్తు శాస్త్రవేత్తలు భావించారు. సాంప్రదాయ రీతిలో ప్రాంతీయ కళాకారులతో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

భూ సేకరణ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

భూములన్నీ మంచి సాగుభూములని, పక్కనే బెంగళూరులోనే గల మార్కెట్లలో తమ పంటలకు మంచి గిట్టుబాటు ధర వస్తోందని, అటువంటి భూములను ఏరోస్పేస్ పార్కు కోసం ఎలా స్వాధీనం చేసుకుంటారని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పారిశ్రామికాభివృద్ధి పేరుతో సాగు భూముల స్వాధీనం చేసుకోవడంలో ఆంతర్యాన్ని వారు ప్రశ్నించారు.

రైతులు చేపట్టిన ఈ ఆందోళనలకు విస్తృతంగా మద్దతు లభించింది. వివిధ ప్రగతిశీల సంఘాలు తమ మద్దతును ప్రకటించాయి. తమ డిమాండ్లు పెడచెవిన పెడితే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీంతో ఇక ప్రభుత్వం మెట్టు దిగి రాక తప్పలేదు. జులై మొదటి వారంలో రైతు ప్రతినిధులతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. ఇందులోని చట్టపరమైన సమస్యలను పరిశీలించి, పరిష్కరించేందుకు కొంత సమయం కావాలని కోరారు. చిట్టచివరిగా నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు మంగళవారం ప్రకటించారు.

ఎఐకెఎస్ అభినందనలు

సమైక్యంగా పోరాటం సాగించి ప్రభుత్వం వెనుకడుగు వేసేలా, నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా చేసినందుకు కర్ణాటక రైతులు, వ్యవసాయ కార్మికులను అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) అభినందించింది. ఈ మేరకు ఎఐకెఎస్ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ ధావలె, విజూ కృష్ణన్‌లు ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాడే రైతాంగ ఉద్యమానికి ఈ విజయం చాలా కీలకమైనదని వారు వ్యాఖ్యానించారు. భూములను తీసుకుని తమకివ్వాల్సిన నష్టపరిహారం సరిపోలేదు, ఇంకా ఎక్కువ ఇవ్వాలనే డిమాండ్లతో వీరు ఈ పోరాటం సాగించలేదని, వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం బలవంతంగా ఎలా స్వాధీనం చేసుకుంటారని వారు ప్రశ్నించారని, అందుకు వ్యతిరేకంగానే ఈ పోరాటం చేపట్టి విజయం సాధించారని అన్నారు. భారతదేశ వ్యాప్తంగా వేలాది ప్రాంతాల్లో ఇటువంటి తరహాలో సాగే పోరాటాలకు, ఉద్యమాలకు ఇది స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. ఈ చారిత్రక పోరాటం గురించి, మహత్తర విజయాన్ని సాధించిన తీరు గురించి సమాచారంఅందరికీ తెలిసేలా ప్రచారం చేయాల్సిందిగా ఎఐకెఎస్ తన శాఖలకు పిలుపునిచ్చింది. భవిష్యత్తులో సాగించే ఇటువంటి పోరాటాల్లో సంయుక్త హోరాటా కర్ణాటక, సంయుక్త కిసాన్ మోర్చాలకు మద్దతుగా ఎఐకెఎస్ నిలబడుతుందని వారు స్పష్టం చేశారు.

పోరాటం రూపుదిద్దుకుందిలా...

బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో బహుళ పంటలు పండే భూమిపై కార్పొరేట్ సంస్థలు కన్నేశాయి. అందుకు అనుగుణంగా గతంలోని బిజెపి ప్రభుత్వం ఆ భూములను కార్పొరేట్ సంస్థలు స్వాధీనం చేసుకునేలా ఏర్పాట్లు చేసింది. దీని వెనుక రియల్ ఎస్టేట్ మాఫియా, బిల్డర్లు వున్నారు. కానీ 13 గ్రామాల్లోరైతులు తీవ్రంగా ప్రతిఘటించారు. సమైక్యంగా పోరు బాట పట్టారు.

అయితే విభజించి పాలించు అన్న చందాన అందులో మూడు గ్రామాలను సేకరణ ప్రక్రియ నుండి పక్కకు పెట్టేస్తున్నట్లు ప్రకటించింది. అయినా రైతుల ఐక్యత చెక్కు చెదరలేదు. గత నెల 26న శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న రైతులపై పోలీసులు దారుణంగా లాఠీచార్జి చేశారు. అనేకమందిని అరెస్టు చేశారు.

వెంటనే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. రచయితలు, కళాకారులు, పౌరసమాజ గ్రూపులు ఇలా అందరూ కలిసి రైతులకు సంఘీభావం ప్రకటించారు. ఇక గత్యంతరం లేక ముఖ్యమంత్రి, రైతులను చర్చలకు ఆహ్వానించారు. రైతులు పెద్ద ఎత్తున సాగించిన నిరసనల్లో ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్‌తో సహా సంయుక్త కిసాన్ మోర్చా నేతలు పలువురు కూడా పాల్గొన్నారు. కెపిఆర్ఎస్ నాయకత్వంతో పాటు సిఐటియు, ఎఐఎడబ్ల్యుయు, ఐద్వా సహా పలు సంఘాల నేతలు కీలక పాత్ర పోషించారు.

ఆర్థిక సంస్కరణల సృష్టికర్త

- మాజీ ప్రధాని పివి నరసింహారావు సంస్మరణ సభలో కొనియాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



పివి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

దేశంలో ఆర్థిక సంస్కరణలకు సృష్టికర్త మాజీ ప్రధాని పివి నరసింహారావు అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు కొనియాడారు. 'ది లైఫ్ అండ్ లెగసీ ఆఫ్ పివి నరసింహారావు' పేరిట మంగళవారం నాడిక్కడ ప్రధాన మంత్రుల మ్యూజియం, లైబ్రరీలో జరిగిన సంస్మరణ సభలో చంద్రబాబు ప్రసంగించారు. తెలుగు ప్రజలకు పివి గర్వకారణమన్నారు. విద్యార్థి నాయకుడిగా, స్వాతంత్ర సమరయోధుడిగా, బహుభాషా వేత్తగా ఎందరికో ఆదర్శంగా పివి నిలిచారని కొనియాడారు. ఎంపిగా, సిఎంగా, కేంద్ర మంత్రిగా, చివరకు దేశ ప్రధానిగా వివిధ హోదాల్లో సేవలందించారని గుర్తు చేశారు. దేశ ఆర్థిక పరిస్థితులను గాడిలో పెట్టేందుకు ఆయన తెచ్చిన సంస్కరణలు గేమ్ ఛేంజర్ అని అభివర్ణించారు. దేశ అభ్యున్నతి కోసం పివి సేవలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరన్నారు. దేశంలో లైసెన్స్ రాజ్ విధానానికి స్వస్తి పలికి, పెట్టుబడిదారులు సులభంగా వచ్చేలా చర్యలు తీసుకున్నారు. పారిశ్రామిక పురోగతికి బాటలు వేశారని అన్నారు. పివి స్ఫూర్తితోనే ఆర్టిఫిషల్ ఇంటిలజెన్స్ (ఏఐ)లో క్వాంటం వ్యాలీని అమరావతిలో నిర్మించబోతున్నట్లు తెలిపారు.

అశ్వనీకుమార్‌కు పరామర్శ

అలాగే, ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం కేంద్ర ఐటి మంత్రి అశ్వనీ వైష్టవ్‌ను కలిసి పరామర్శించారు. ఇటీవల అశ్వనీ వైష్టవ్ తండ్రి మరణించారు. ఈ నేపథ్యంలో ఆయనకు సానుభూతి తెలిపారు. కాగా, బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, జల్‌శక్తి మంత్రి వి ఆర్ పాటిల్, కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయాతో చంద్రబాబు భేటీ కానున్నారు.

ప్రొఫెసర్ వేధింపులతో తనువు చాలించిన ఒడిశా బిఇడి విద్యార్థిని

- మూడు రోజులు మృత్యువుతో పోరాడి..మృతి

న్యూఢిల్లీ : లెక్చరర్ వేధింపులు భరించలేక ఒడిశాలోని బాలాసోర్‌కు చెందిన బిఇడి విద్యార్థిని మృత్యువుతో పోరాడి సోమవారం అర్ధరాత్రి తనువు చాలించారు. బాలాసోర్‌లోని ఫకీర్ మోహన్ కళాశాల క్యాంపస్‌లో ఇంటిగ్రేటెడ్ బిఇడి చదువుతున్న సదరు బాధిత విద్యార్థిని ప్రొఫెసర్ సమీర్ కుమార్ సాహు తనను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని ప్రిన్సిపల్ ఇతర అధికారులకు, స్థానిక బిజెపి ఎంపీ ప్రతాప్ సారంగికి ఫిర్యాదు చేశారు. కానీ ఎవ్వరూ చర్యలు తీసుకోలేదు. ఇక తనకు న్యాయం జరగదని భావించిన బాధిత యువతి ఈ నెల 12న కళాశాల ఆవరణలోనే పెట్రోలు పోసుకొని నిప్పటించుకున్నారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి చనిపోయారు. ఈ ఘటనలో మరో ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. వారు ఇరువురు ఇంకా ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. ఈ దారుణ ఘటనలకు స్థానిక బిజెపి నాయకులే కారణమని, సదరు బాధిత విద్యార్థిని బిజెపి అనుబంధ విద్యార్థి సంఘమైన ఎబివిపిలో కీలకంగా ఉన్నా..ఆమెకు న్యాయం జరగలేదంటే ఇక సాధారణ విద్యార్థుల పరిస్థితి ఏంటని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర, రాష్ట్రాల్లోని బిజెపి ప్రభుత్వాలపై ప్రతిపక్షాల నేతలు కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఆత్మహత్య కాదని, బిజెపి వ్యవస్థ జరిపిన హత్యగా కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. 'మోడీ జీ ఈ దేశంలో ఆడ పిల్లలు మంటల్లో కాలిపోతున్నారు. ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా మీరు మౌనంగానే ఉంటారా?' అని ప్రధాని మోడీని ఉద్దేశించి ఆయన ప్రశ్నించారు.

ఎస్ఎఫ్ఐ దిగ్భ్రాంతి

ప్రొఫెసర్ లైంగిక వేధింపుల కారణంగా ఒడిషాకు చెందిన బిఇడి విద్యార్థిని చనిపోవడం పట్ల భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఒడిషా ఉన్నత విద్యాసంస్థల్లో ఇటీవల కాలంలో హింస, వేధింపులు ఘటనలు పెరిగిపోతున్నాయని, ఇందుకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ప్రొఫెసర్ సమీర్ కుమార్ సాహు లైంగిక వేధింపుల గురించి పదేపదే బాధిత విద్యార్థిని ఫిర్యాదు చేసినా న్యాయం లభించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది.

ఆర్థిక కొరత తీవ్రం

(మొదటిపేజీ తరువాయి)

నిధులు విడుదల విషయాన్ని అమిత్ షా దృష్టికి తీసుకెళ్లి అన్ని విధాలా సహకరిం చాలని కోరారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని, అయినప్పటికీ ఆర్థిక వనరుల కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. రాష్ట్ర విభజన పర్యావసనంగా ఎదుర్కొన్న ఆర్థిక నష్టాన్ని పరిగణనలోకి తీసుకుని నిధుల కేటాయింపులు చేసేలా చూడాలని, ఈ మేరకు 16వ ఆర్థిక సంఘానికి కూడా నివేదికలు అందజేశామని అమిత్ షాకు చంద్రబాబు తెలియజేశారు. కరవు ప్రాంతాలకు నీటిని తరలించేందుకు కీలకమైన పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు అంశాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. పోలవరం నుంచి కర్నూలు జిల్లా బనకచర్ల రెగ్యులేటర్ వరకూ 200 టిఎంసిల వరద నీటిని తరలించేలా లింక్ ప్రాజెక్టు ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. ఈ అనుసంధాన ప్రాజెక్టు పూర్తి అయితే కరవు పీడిత రాయలసీమ ప్రాంతానికి దక్కే ఫలితాలను కూడా వివరించారు. గోదావరి నదిలో ఎగువ, దిగువ రాష్ట్రాల నీటి అవసరాలు తీర్చిన తర్వాత కూడా 90 నుంచి 120 రోజుల మిగులు జలాలు ఉంటాయని తెలిపారు. నదీ ప్రవాహ మార్గంలో చివరి రాష్ట్రంగా గోదావరి మిగులు జలాలను పూర్తిగా వినియోగించుకునే హక్కు ఏపికి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నేత అశోక్ గజపతి రాజును గవర్నర్‌గా నియమించినందునకు కేంద్ర ప్రభుత్వానికి, అమిత్ షాకు, ప్రధాని నరేంద్ర మోడీకి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు ఢిల్లీలోని ముఖ్యమంత్రి నివాసంలో చంద్రబాబుతో నీతి ఆయోగ్ సభ్యులు వికె సారస్వత్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఎరో స్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటుపై సారస్వత్‌తో ముఖ్యమంత్రి చర్చించారు. రాయలసీమ ప్రాంతంలో డిఫెన్స్ పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందని, ఈ పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను, పెట్టుబడుల సాధనకు అనుసరించాల్సిన అంశాలపై చర్చించారు. అనంతరం సిఎం చంద్రబాబుని ఢిల్లీ మెట్రో రైల్ ఎండి వికాస్ కలిశారు. విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో నిర్మాణంపై సహకారంపై చర్చించారు.

ఇంటర్ విద్యార్థినిపై హత్యాచారం!

(మొదటి పేజీ తరువాయి)

జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, బాలికది ఎర్రగుంట్ల మండలం అల్లదుర్తి (హనుమాన్ గుత్తి) గ్రామం. అదే గ్రామానికి చెందిన లోకేష్ అనే యువకుడు ప్రేమ పేరుతో తనను వేధిస్తున్నాడని గతంలో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో, ఆ యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఆరు నెలల కిందట ప్రొద్దుటూరుకు వచ్చి సార్వకట్ట వీధిలో బాలిక కుటుంబం ఉంటోంది. లోకేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. లోకేష్‌తోపాటు ఈ సంఘటనలో ఎవరెవరు పాల్గొన్నారనే కోణంలో విచారణ చేస్తున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి

సంఘటనా స్థలాన్ని ఎస్‌పి ఇజి.అశోక్‌కుమార్ పరిశీలించారు. ఈ ఘటనపై వివరాలు సేకరిస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. బాలిక తల్లిదండ్రుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం విచారణ చేస్తోందని తెలిపారు. ఆయన వెంట జమ్మలమడుగు, ప్రొద్దుటూరు డిఎస్‌పిలు వెంకటేశ్వరరావు, భావన, ట్రైనీ డిఎస్‌పి భవాని, అర్బన్ సిఐ లింగప్ప, ఎస్ఐ హైమావతి ఉన్నారు.


కఠినంగా శిక్షించాలి : ఎస్ఎఫ్ఐ

విద్యార్థినిపై ఈ ఘటనకు పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జమ్మలమడుగు పట్టణ సహాయ కార్యదర్శి హరిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక ఓ ప్రయివేట్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. గండికోట ప్రాంతం నిత్యం పర్యాటకులతో కళకళలాడుతోందని, ఇటువంటి ప్రాంతంలో అఘాయిత్య సంఘటన జరగడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

మంత్రి సవిత దిగ్భ్రాంతి

ఈ ఘటనపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిందితులు ఎంతటివారైనా శిక్షిస్తామని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

కోతి తెలివి



ఒక అడవిలో ఏనుగు ఉంది. అది చాలా మంచిది. అక్కడే ఒక కోతి కూడా ఉంటుంది. అది చాలా తెలివైనది. ఒక రోజు ఆ కోతి, ఏనుగు అరటి పండ్లు తింటుంటే చెట్టు మీద నుంచి టక్కున ఎగిరి వాటిని ఎత్తుకెళ్లింది. ఏనుగుకు కోపం వచ్చింది. కానీ 'కోతికి కూడా ఆకలైనట్టు ఉంది. అందుకే అరటి పండ్లను ఎత్తుకెళ్లి ఉంటుంద'ని ఊరుకున్నది.

ఒక రోజు ఒక వేటగాడు అడవికి వచ్చి చెట్టు మీద కూర్చుని ఉన్నాడు. అతడి చేతిలో పెద్ద వల ఉంది. అటువైపు ఏ జంతువు వచ్చినా దాని మీద వల వేసి పట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాడు. ఇంతలో అటువైపు ఏనుగు రానే వచ్చింది. వెంటనే వేటగాడు ఏనుగుపై వల విసిరాడు. అది వలలో పడింది. వల నుంచి తప్పించుకోవడానికి ఎంత ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. వేటగాడికి దాహం కావడంతో నీళ్ళు తాగడానికి పక్కన ఉన్న చెరువుకు వెళ్ళాడు. అటు నుంచి వెళు తున్న కోతి వలలో ఉన్న ఏనుగును చూసింది. ఆ రోజు తాను అరటి పండ్లు ఎత్తుకెళ్లినా ఏమీ అనలేదని గుర్తుకు వచ్చింది. ఏనుగు మంచితనాన్ని గుర్తించిన కోతి, ఎలాగైనా దానిని వల నుండి తప్పించాలని అనుకుంది. కానీ వల గట్టిగా ఉండడంతో అది ఏనుగును విడిపించలేక పోయింది.

కొద్ది సేపటికి అక్కడికి వేటగాడు వచ్చాడు. ఏనుగును తప్పించడానికి ప్రయత్నం చేస్తున్న కోతిని కర్రతో గట్టిగా కొట్టబోయాడు. కానీ కోతి తప్పించుకొని చెట్టు ఎక్కింది. ఏనుగును విడిచిపెట్టాలని అలా చేస్తే, 'నీకు ఏం కావాలన్నా ఇస్తాన'ని అంది. 'ఏనుగును విడిచి పెట్టాలంటే రెండు వేల రూపాయలు కావాల'ని వేటగాడు చెప్పాడు. రెండు వేల రూపాయలు ఎలా తేవాలని కోతి ఆలోచించింది. దానికి ఒక ఉపాయం తట్టింది. వెంటనే ఇంటికి వెళ్ళింది. నోట్ల సైజులో ఉండే కాగితాలు తీసుకొంది. వాటికి రంగు అద్దింది. వాటిపై 500 వందలు అని అందంగా రాసింది. ఒక కవర్లో పెట్టింది. ఆ కవర్‌ను తెచ్చి వేటగాడికి ఇచ్చి, ఇందులో నీవు చెప్పినట్టే డబ్బులు ఉన్నాయని అంది. వేటగాడు సంతోషంగా కవర్ తీసుకొని ఏనుగును విడిచిపెట్టాడు. ఏనుగు చాలా సంతోషించి, కోతికి కృతజ్ఞతలు చెప్పింది. వేటగాడు ఇంటికి వెళ్ళాడు. కవర్ తీసి చూసేటప్పటికి అందులో కాగితంపై రంగు పూసి, దాని మీద 500 అని రాసి ఉంది. తనను కోతి మోసం చేసిందని వేటగాడికి అర్థమై లబోదిబోమన్నాడు.



బద్రే వినయ్,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మీపూర్,
ఆదిలాబాద్ జిల్లా.

నేను గీసిన బొమ్మ





ఎం.శ్రీ చందన, 10వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతారెడ్డిపేట, మండలం,
అక్బర్ పేట భూంపల్లి, సిద్ధిపేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

యావత్ భారతీయులందరి హృదయాలు గర్వంతో ఉప్పొంగుతున్నాయి. అంతరిక్షంలోకి అడుగుపెట్టి, క్షేమంగా తిరిగి వచ్చిన శుభాంశు శుక్లా గురించి దేశం మాట్లాడుతకుంటోంది. భారత్ తరపున 18 రోజుల పాటు అంతరిక్షంలో తన సేవలు అందించి భూమి మీదకి క్షేమంగా తిరిగివచ్చిన శుభాంశు ఈ ప్రయాణంలో ఎన్నో కీలక ప్రయోగాలు చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుండి తన వీడ్కోలు ప్రసంగంలో ఆయన మాట్లాడిన ప్రతి మాట భారతీయులకు స్ఫూర్తిదాయకం.

విశ్వ సౌభ్రాతృత్వం.. 'శుభ' సందేశం

'అంతరిక్ష పరిశోధనలో భారతదేశ ప్రయాణం కష్టతరమైనది కావచ్చు. కానీ ఇప్పటికే ఇది ప్రారంభమైంది. నేను ఐఎస్ఎస్‌కి వచ్చినప్పటి నుండి ఈ ప్రయాణం అద్భుతమైనది. నేను ఊహించిన దానికంటే చాలా ఎక్కువ. నేను ఇక్కడి నుండి మధురమైన జ్ఞాపకాలతో, పాఠాలతో తిరిగి వెళ్తున్నాను. ఇక్కడ మేము నిర్వహించిన సైన్స్ ప్రయోగాలు గొప్ప ప్రభావాన్ని చూపిస్తాయని బలంగా నమ్ముతున్నాను. 41 సంవత్సరాల క్రితం ఒక భారతీయుడు అంతరిక్షంలోకి వచ్చి భారతదేశం పై నుండి ఎలా కనిపిస్తుందో మనకు చెప్పారు. ఈ రోజు నేను నా దేశం గురించి చెబుతాను.

'అంతరిక్షం నుండి నా దేశం ప్రతిష్టాత్మకంగా కనిపిస్తుంది. నా దేశం నిర్భయంగా, నమ్మకంగా ఉంది. నేటి నా భారతదేశం గర్వంతో నిండి ఉంది. నేటి భారతదేశం ఇప్పటికీ, ఎప్పటికీ 'సారే జహాన్ సే అచ్చా'గా కనిపిస్తోంది. మానవులంతా ఏకమై ఒక ఉమ్మడి లక్ష్యంతో పనిచేసినప్పుడు ఏమి సాధించగలరో ఈ ప్రయోగాలు నిరూపిస్తాయి. అలాంటి ఎన్నో అనుభవాలతో నేను భూమి మీదకి తిరిగి వెళ్తున్నా' అని శుభాంశు అన్నారు.

ఈ మాటలు, ప్రతి ఒక్క భారతీయుడికి అంతరిక్ష ప్రయోగాలపై మరింత మక్కువ పెరిగేలా చేశాయి. శాస్త్ర ప్రయోగాలు దేశ ప్రతిష్టని ఏ స్థాయికి తీసుకెళతాయో శుభాంశుప్రయాణం ప్రత్యక్ష ఉదాహరణ.

వ్యక్తిగత జీవితం..

శుభాంశు శుక్లా 1985 అక్టోబరు 10న ఉత్తరప్రదేశ్ లక్నోలో జన్మించారు. ముగ్గురు తోబుట్టువులలో చిన్నవారు. అతని తండ్రి శంభు దయాళ్ శుక్లా రిటైర్డ్ ప్రభుత్వ అధికారి, తల్లి ఆశా శుక్లా గృహిణి. శుభాంశు లక్నోలోని సిటీ మాంటిస్సోరి స్కూల్‌లో పాఠశాల విద్య పూర్తి చేశారు. 1999లో కార్గిల్ యుద్ధం ద్వారా ప్రేరణ పొంది, దేశ సేవ చేయాలనుకున్నారు. ఇంట్లోవాళ్లకి తెలియకుండానే నేషనల్ డిఫెన్స్ అకాడమీకీ దరఖాస్తు చేసుకుని ఆ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. నావల్ అకాడమీ పరీక్షల్లో కూడా ప్రతిభ చూపారు. 2005లో నేషనల్ డిఫెన్స్ అకాడమీ నుండి కంప్యూటర్ సైన్స్‌లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీని పొందారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో ఫ్లయింగ్ శిక్షణకు ఎంపికయ్యారు. జూన్ 2006లో ఐఎఎఫ్ ఫైటర్ స్ట్రీమ్‌లోకి ఫ్లయింగ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఎస్-యు, మిగ్-21, మిగ్-29, జాగ్వార్, హాక్, డోర్నియర్, ఎఎన్-32 వంటి వివిధ విమానాలను నడిపి 2000 గంటలకు పైగా విమానయాన అనుభవాన్ని పొందారు. 2019లో గగన్‌యాన్ మిషన్‌కి ఎంపికైన వ్యోమగాముల్లో శుక్లా ఒకరు. రష్యాలోని యూరి గగారిన్ కాస్మోనాట్ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందారు. 2024 మార్చిలో గ్రూప్ కెప్టెన్ హోదాకి పదోన్నతి పొందారు. 2026లో షెడ్యూల్ చేయబడిన భారతదేశ తొలి మానవ అంతరిక్ష యాత్ర గగన్‌యాన్‌కి వ్యోమగామిగా కూడా శుక్లా నియమితులయ్యారు.



శుక్లా, వృత్తిరీత్యా దంత వైద్యురాలు కామ్నా మిశ్రాను వివాహం చేసుకున్నారు, ఆమె పాఠశాలలో శుభాన్షు క్లాస్‌మేట్. ఈ దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు.

మిషన్ ప్రారంభం..

నాసా, స్పేస్ ఎక్స్, ఇస్రో సహకారంతో 'యాక్సిమా-4' అని పిలుస్తున్న ఈ మిషన్‌ను కెన్నెడీ స్పేస్ సెంటర్‌లోని లాంచ్ కాంప్లెక్స్ 39ఎ నుండి విజయవంతంగా ప్రారంభించారు. ఇందులో శుభాంశు భాగమవ్వడంతో 1984లో రాకేష్ శర్మ తర్వాత ఐఎస్ఎస్‌ని సందర్శించిన మొదటి భారతీయ వ్యోమగామిగా, కక్ష్యలోకి ప్రయాణించిన రెండవ భారతీయుడుగా చరిత్ర సృష్టించారు. ఈ మిషన్ 25 జూన్ 2025న ఉదయం 06:31 గంటలకు ఫ్లోరిడాలోని 'నాసా' కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి విజయవంతంగా ప్రారంభమైంది. దీంతో అంతరిక్షంలోకి చేరుకున్న 634వ వ్యక్తిగా శుక్లా నిలిచారు. ఈ మిషన్‌లో మన భాగస్వామ్యానికి ఐఎస్ఎస్‌కి భారత ప్రభుత్వం దాదాపు రూ. 548 కోట్లు చెల్లించింది.



మిషన్ లక్ష్యం..

1 కండరాల పునరుత్పత్తి, రోగనిరోధక వ్యవస్థపై ప్రభావం వంటి సూక్ష్మ గురుత్వాకర్షణకు మానవ శరీర ప్రతిస్పందనను పరిశోధించడం.

2 అంతరిక్షం నుండి పర్యావరణ పర్యవేక్షణను మెరుగుపరచడం.

3 3డి ప్రింటెడ్ పాలిమర్లు, వీశవఅవ-రకం నానోమెటీరియల్స్ వంటి అంతరిక్ష పరిస్థితులలో కొత్త పదార్థాలను పరీక్షించడం.

4 మైక్రోఅల్గే, టార్డిగ్రేడ్లు, పంట విత్తనాలతో సహా తక్కువ గురుత్వాకర్షణలో కణాలు, జీవుల పెరుగుదల, ప్రవర్తనను పరిశీలించడం.

5 కక్ష్యలో ఎఐ ఆధారిత డేటా ప్రాసెసింగ్ వంటి వాటి పనితీరును పరిశీలించటం.

శుభాంశుబృందం ఏం చేసింది?

శుభాంశు బృందం అంతరిక్షంలో నిర్వహించిన కీలక ప్రయోగాలలో ఒకటి : ఆహారం, ఆక్సిజన్, జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని అర్థం చేసుకోవడం. అంతరిక్ష సూక్ష్మాతిశయాల అధ్యయనం. వాటి స్థితిస్థాపకత, బహుముఖ ప్రజ్ఞ అంతరిక్షంలోకి మానవ జీవితానికి మద్దతు ఇవ్వడంలో ఉపయోగపడతాయి. సైనోబాక్టీరియా, సెంట్రిఫ్యూగేషన్ చేస్తూ, శుక్లా ఈ కిరణజన్య సంయోగ సూక్ష్మజీవుల రెండు జాతులను పోల్చారు, సూక్ష్మ గురుత్వాకర్షణ వాటి పెరుగుదల, సెల్యులార్ ప్రవర్తన, జీవరసాయన కార్యకలాపాలను ఎలా ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోవడం లక్ష్యంగా పనిచేశారు. ఇంకా ఈ బృందం అనేక వరుస ప్రయోగాలను నిర్వహించింది. ఈ ప్రయోగాలలో సూక్ష్మ గురుత్వాకర్షణ శక్తి కింద కండరాల నష్టం, అంతరిక్షంలో జీర్ణక్రియ, వ్యోమగాముల మానసిక శ్రేయస్సు ఉన్నాయి.

అమెరికాకు చెందిన పెగ్గీ విట్సన్, భారతదేశానికి చెందిన శుక్లా, పోలాండ్‌కు చెందిన స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ-విస్నివ్స్కీ, హంగేరీకి చెందిన టిబోర్ కాపు ఈ మిషన్‌లో ప్రయాణించారు.

రెండు వారాల్లో 230 సూర్యోదయాలు

- రెండు వారాల పాటు సాగిన ఈ యాత్రలో శుభాంశు శుక్లా బృందం 230 సూర్యోదయాలను చూసింది. ఎందుకంటే అంతరిక్ష కేంద్రంలోంచి చూస్తే రోజుకు 16 సూర్యోదయాలు కనిపిస్తాయి. అలాగే సుమారు కోటి కిలోమీటర్ల మేర ప్రయాణించింది. భూమికి 250 మైళ్ల ఎత్తులో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకుని, భూమి చుట్టు దాదాపు 230 సార్లు ప్రదక్షిణలు చేసింది. అంటే 96.5 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణం సాగించింది.
- జూన్ 25, 2025న ప్రారంభమైన శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర అమెరికాలోని నాసా కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి ఫాల్కన్-9 రాకెట్ ద్వారా మొదలైంది. 28 గంటల ప్రయాణం తర్వాత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించారు. అక్కడ పైలట్ శుక్లా నేతృత్వంలోని గ్రూప్ మొత్తం 60 రకాల శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించింది. ఇందులో శుక్లా స్వయంగా 7 ప్రయోగాలు నిర్వహించారు.
- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోని వ్యోమగాములు ప్రతి రోజూ 16 సూర్యోదయాలు, 16 సూర్యాస్తమయాలను చూస్తారు. ఎందుకంటే ఐఎస్ఎస్ ప్రతి 90 నిమిషాలకు భూమిచుట్టూ తిరుగుతుంది. 24 గంటల వ్యవధిలో 16 కక్ష్యలను పూర్తిచేస్తుంది.

ఎన్టీఆర్, ఎంజీఆర్ ప్రేరణతో పవన్ పాత్ర


- 'హరి హర వీరమల్లు' దర్శకుడు జ్యోతికృష్ణ



'హరి హర వీరమల్లు' చిత్రంలో పవన్ కళ్యాణ్ పాత్రను రూపొందించడానికి దిగ్గజ నటులు ఎన్టీఆర్, ఎంజీఆర్‌ల నుండి ప్రేరణ పొందా. గొప్పనటుల మాదిరిగానే పవన్ కళ్యాణ్‌లో ఉన్న అద్భుతమైన లక్షణాలను గమనించిన తర్వాతే ఆయన పాత్రను రాయడానికి పూనుకున్నా. ధర్మపరుడిగా, బలవంతుడిగా, ప్రజల మనిషిగా పవన్ కళ్యాణ్‌కి ఉన్న ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకొని పాత్రను జాగ్రత్తగా తీర్చిదిద్దా. 'ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఎంజీఆర్ గారు సందేశాత్మక, నిజాయితీతో కూడిన సినిమాలు చేస్తూ నట జీవితాన్ని కొనసాగించారు. ఈ అంశం నాకు స్ఫూర్తినిచ్చింది. అందుకే 'హరి హర వీరమల్లు'లో 'మాట వినాలి' అనే శక్తివంతమైన, ఆలోచింపజేసే పాటను స్వరపరిచాము. ఈ పాట ప్రేక్షకులను బాగా ప్రభావితం చేసింది. నటుడిగా ఎన్టీఆర్ గొప్ప ప్రదర్శనలు పౌరాణిక, జానపద చిత్రాల నుండి వచ్చాయి. ముఖ్యంగా రాముడు, కృష్ణుడు పాత్రలలో ఆయన ఒదిగిపోయిన తీరు చిరస్థాయిగా నిలిచిపోయింది. పవన్ గారి కోసం విల్లు, బాణాన్ని రూపొందించాము. కథనాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేలా ప్రతి సన్నివేశాన్ని ప్రత్యేకంగా సృష్టించాలనుకున్నా' దర్శకుడు ఎఎం జ్యోతికృష్ణ అన్నారు. పవన్‌కళ్యాణ్, నిధి అగర్వాల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ సినిమా ఈనెల 24న విడుదల కానున్న నేపథ్యంలో ఈయన మీడియాతో పై విధంగా మాట్లాడారు.

టీమిండియా ఆటగాళ్లకు చార్లెస్-3 ఆతిథ్యం

బ్రిటన్ పర్యటనలో ఉన్న భారత పురుషుల, మహిళల ఆటగాళ్లకు కింగ్ ఛార్లెస్-3 ఆతిథ్యం ఇచ్చారు. లండన్‌లోని సెయింట్ జేమ్స్ ప్యాలెస్‌లో మంగళవారం రెండుజట్లు కింగ్ చార్లెస్-3ని కలిశాయి. ఈ సందర్భంగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. కింగ్ చార్లెస్‌ను కలిసి మాట్లాడడం బాగుందని, మహ్మద్ సిరాజ్ ఔటైన విధానంపై ఛార్లెస్ స్పందించారని చెప్పాడు. మ్యాచ్‌లో ఫలితం ఎలాగైనా ఉండవచ్చని, రాబోయే రెండు మ్యాచుల్లో మాకు అదృష్టం కలిసివస్తుందని ఆశిస్తున్నాం' అని అన్నట్లుగా గిల్ పేర్కొన్నాడు. లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్ గురించి గిల్ మాట్లాడుతూ.. రెండు జట్లు ఆడిన విధానం బాగుందని..తాము అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చామని, ఎక్కడికి వెళ్లినా అభిమానుల నుంచి మద్దతు లభిస్తుందని తెలిపినట్లు పేర్కొన్నాడు. లార్డ్స్ టెస్ట్‌లో 193 పరుగుల ఛేదనలో భాగంగా టీమిండియా 170పరుగులకే కుప్పకూలి 22పరుగుల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే.



27 పరుగులకే విండీస్ ధమాల్

టెస్టుల్లో మరో చెత్త రికార్డు ● సిరీస్ 3-0తో ఆస్ట్రేలియా క్లీన్‌స్వీప్



కింగ్‌స్టన్(జమైకా): కరేబియన్ గడ్డపై ఆస్ట్రేలియా బౌలర్లు సత్తా చాటారు. మూడో, చివరి టెస్ట్‌లోనూ వెస్టిండీస్‌పై 176పరుగుల తేడాతో నెగ్గిన ఆస్ట్రేలియా 3-0తో క్లీన్‌స్వీప్ చేయగా.. 204పరుగుల ఛేదనలో భాగంగా వెస్టిండీస్ జట్టు 27 పరుగులకే ఆలౌటైంది. మిచెల్ స్టార్క్ (6/9) సంచలన బౌలింగ్‌తో కరేబియన్ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. అతనికి తోడుగా స్కాట్ బోలాండ్ (3/2) హ్యాట్రిక్‌తో మెరవడంతో విండీస్ పేకమేడలా కుప్పకూలింది. టెస్టు క్రికెట్ చరిత్రలో ఇది రెండో అత్యల్ప స్కోరు. స్టార్క్ తన మొదటి ఓవర్‌లో మూడు వికెట్లు తీశాడు. మొత్తంగా 15 బంతుల వ్యవధిలో ఐదు వికెట్లు పడగొట్టి విండీస్ పతనాన్ని శాసించాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో అతి తక్కువ బంతుల్లోనే ఐదు వికెట్లు సాధించిన బౌలర్‌గా స్టార్క్ రికార్డు సృష్టించాడు. విండీస్ బ్యాటర్లలో ఏడుగురు డకౌటయ్యారు. జస్టిన్ గ్రీవ్స్(11) ఒక్కడే రెండంకెల స్కోరు చేశాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ స్టార్క్‌కు దక్కింది. 87 బంతుల్లోనే 10 వికెట్లు కోల్పోయిన కరేబియన్ జట్టు తక్కువ బాల్స్‌లో ఆలౌటైన మూడో జట్టుగా చెత్త రికార్డు మూటగట్టుకుంది.

టెస్టు క్రికెట్‌లో అత్యల్ప స్కోర్లు..

(1) న్యూజిలాండ్ : 26 (ఇంగ్లండ్‌పై, 1955), (2) వెస్టిండీస్ : 27 (ఆస్ట్రేలియాపై, 2025)
(3) దక్షిణాఫ్రికా : 30 (ఇంగ్లండ్‌పై, 1896) (4) దక్షిణాఫ్రికా : 30 (ఇంగ్లండ్‌పై, 1924)
(5) దక్షిణాఫ్రికా : 35 (ఇంగ్లాండ్‌పై, 1899)

లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్ 2028

జులై 12న క్రికెట్ తొలి మ్యాచ్

జులై 20 నుంచి 29 పతకాల పోటీ

న్యూయార్క్: 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదలైంది. 1900 తర్వాత తొలిసారి ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు లభించగా.. 2028, జులై 12న తొలి మ్యాచ్, 20 నుంచి 29వరకు పతకాలకోసం మ్యాచ్‌లు జరగనున్నట్లు మంగళవారం ప్రకటించారు. టి20 ఫార్మాట్‌లో జరిగే ఒలింపిక్ క్రికెట్‌లో మొత్తం 180మంది ఆటగాళ్లు మాత్రమే ప్రాతినిధ్యం వహించనున్నట్లు పొమెనాలోని ఫెయిర్ గ్రౌండ్ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నట్లు వారు తెలిపారు. ఇది లాస్‌ఏంజెల్స్‌కు 50కి.మీ. దూరంలో ఉన్నట్లు పురుషుల, మహిళల విభాగాల్లో కేవలం ఆరేసి జట్లు మాత్రమే ఆడనున్నట్లు తెలిపారు. ప్రతి జట్టులో 15మంది ఆటగాళ్లు మాత్రమే ఉండాలని, డబుల్ హెడర్ పద్ధతిలో జరిగే ఈ టోర్నీలో ప్రధాన మ్యాచ్‌లన్నీ జులై 14 నుంచి 21లోపే ముగుస్తాయని, ఆ తర్వాత సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కడం పట్ల ఒలింపిక్ కమిటీకి లాస్‌ఏంజెల్స్ మేయర్ కరేన్ బాస్ మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.



'ఆంధ్ర కింగ్ తాలూకా' షూటింగ్


కథానాయకుడు రామ్ పోతినేని 'ఆంధ్ర కింగ్ తాలూకా'లో సరికొత్త అవతారంలో కనిపించను న్నారు. భాగ్యశ్రీ బోర్సే కథా నాయిక. ఇందులో రామ్ సినిమా అభిమానిగా అలరించనున్నాడు. మహేష్‌బాబు పి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలకమైన నెల రోజుల షెడ్యూల్ జరుగుతోంది. వివేక్-మెర్విన్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ ఈనెల 18న విడుదల కానుంది. ట్రాక్‌కోసం ప్రమోషనల్ పోస్టర్‌లో రామ్ ఉత్సాహంగా తెరచాపతో నాటు పడవపై ప్రయాణిస్తున్నట్లు కనిపించడం ఆకట్టుకుంది.

సందేశాత్మకంగా 'పోలీస్‌వారి హెచ్చరిక'



తూలికా తనిష్క్ క్రియేషన్స్ బ్యానర్‌పై అభ్యుదయ దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మాతగా ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. ఈ చిత్రానికి కిషన్ సాగర్, నళినీ కాంత్ సినిమాటోగ్రాఫర్స్. గజ్వేల్ వేణు ఈ చిత్రానికి సంగీతాన్ని అందించారు. శివ శర్వాణి ఈ చిత్రానికి ఎడిటింగ్ వర్క్ చేశారు. ఈ చిత్రం తొలి టికెట్ విడుదల సందర్భంగా చిత్ర యూనిట్ మీడియా సమావేశంలో మాట్లాడింది. కవి బెల్లి యాదయ్య, నటుడు సన్నీ అఖిల్, నటి జయ వాహిని, నిర్మాత బెల్లి జనార్ధన, దర్శకుడు బాబ్జి మాట్లాడారు. పోలీస్ వారి హెచ్చరిక మనకు సాధారణంగా బయట కనిపించే సినిమాలు కాకుండా ఈ సినిమా కాస్త భిన్నంగా ఉండబోతుం దన్నారు. ఈ సినిమాలో నెగటివ్ క్యారెక్టర్ల మధ్య మంచి సన్నివేశాలు ఉండబోతున్నాయని వివరించారు. మంచి సందేశాన్ని ప్రేక్షకులకు తెలియజేయబోతున్నా మన్నారు. సన్నీ అఖిల్, అజయ్‌ఘోష్, రవి కాలే, షాయాజీ షిండే, శుభలేఖ సుధాకర్, కాశీ విశ్వనాథ్, జబర్దస్త్ వినోద్, పవన్, శాంతి స్వరూప్‌లతోపాటుగా హిమజ, శంకరా భరణం తులసి, జయ వాహిని, మేఘనా ఖుషి, బెల్లి జనార్ధన్ తారాగణం.

'ప్రభుత్వ సారాయి దుకాణం' ఫస్ట్‌లుక్ విడుదల



దర్శకులు నరసింహ నంది దర్శకత్వంలో ఎస్వీఎస్ ప్రొడక్షన్స్, శ్రీనిధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం' సినిమా ఫస్ట్‌లుక్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో మంగళవారం జరిగింది. నరసింహ నంది దర్శకత్వంలో గతంలో 1940లో ఒక గ్రామం, కమలతో నా ప్రయాణం, లజ్జా లాంటి సినిమాలు వచ్చాయి. నిర్మాత ప్రసన్న కుమార్, దర్శకులు సముద్ర, నటుడు పృథ్వీతోపాటుగా చిత్ర యూనిట్ ప్రతినిధులు పాల్గొన్నారు.



శ్రీ చరణికి 6వ ర్యాంక్

ఐసిసి టి20 మహిళల ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: ఇంగ్లండ్ పర్యటనలో అంచనాలకు మించి రాణించిన తెలుగమ్మాయి శ్రీ చరణి టి20 మహిళల ర్యాంకింగ్స్‌లోనూ సత్తా చాటింది. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టి20ల సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్న ఈ స్పిన్ కెరటం కెరీర్ బెస్ట్ ఆరో ర్యాంక్‌లో నిలిచింది. ఇక టీమిండియా ఓపెనర్ షెఫాలీ వర్మ ర్యాంకింగ్స్‌లో దూసుకొచ్చింది. షెఫాలీ వర్మ(655పాయింట్లు) తొమ్మిదో స్థానం దక్కించుకుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 158.56 స్ట్రయిక్ రేటుతో 176 రన్స్ కొట్టింది. ఇక వైస్ కెప్టెన్ స్మృతి మంధాన(767పాయింట్లు) మూడో స్థానంలో నిలువగా.. రెండు స్థానాల్ని కోల్పోయిన మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 14వ ర్యాంక్ సాధించింది. ఇంగ్లండ్ చరిత్రాత్మక టి20 సిరీస్ విజయంలో కీలక పాత్ర పోషించిన రాధా యాదవ్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో 5వ స్థానంలో నిలిచింది. పేసర్ అరుంధతీ రెడ్డి నాలుగు స్థానాలు మెరుగుపరచుకొని 36వ ర్యాంక్ సొంతం చేసుకుంది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు మాత్రం షాక్ తగిలింది. టాప్-2లో ఉన్న ఆమె మూడో స్థానానికి పడిపోయింది. బేత్ మూనీ(ఆస్ట్రేలియా), హేలీ మాథ్యూస్(వెస్టిండీస్), మంధానా(భారత్), మెక్‌గ్రాత్ (ఆస్ట్రేలియా), లారా వొల్వార్ట్(దక్షిణాఫ్రికా) టాప్-5 బ్యాటర్లు కాగా.. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో సదియా ఇక్బాల్(పాకిస్థాన్), అనబెల్ సథర్‌లాండ్(ఆస్ట్రేలియా), దీప్తి శర్మ(భారత్), సోఫీ ఎకిల్‌స్టోన్(ఇంగ్లండ్), లారెన్ బెల్(ఇంగ్లండ్) ఉన్నారు.

మెరుగైన షెఫాలీ, మంధాన ర్యాంకింగ్స్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68